ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
నిజామాబాద్ : fb.com/vaartha Digital
Published from Nizamabad, Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
25-9-2026 శుక్రవారం సంపుటి: 32 సంచిక: 236 పేజీలు: 10+4 వెల: 6.50

'సర్'పై ముదిరిన రగడ.. నేడు కాంగ్రెస్ నిరసనలు
48 గంటల్లో సిఇసి రాజీనామా చేయాలి: సిజెపి
5

హైదరాబాద్-శ్రీశైలం ప్రైవేటు బస్సులో అగ్నిప్రమాదం
డ్రైవర్‌సహా 39 మంది ప్రయాణికులు క్షేమం
ప్రమాదంపై జరుగుతున్న దర్యాప్తు

3

గ్రేటర్ నోయిడాలో భగ్గుమన్న మరో బస్సు
9 మంది సజీవదహనం

5

మానవ నియంత్రణలోనే ఎఐ అభివృద్ధి జరగాలి
వైట్‌హౌస్‌లో ట్రంప్‌తో భేటీలో జిన్‌పింగ్

7

## ఆ నాలుగు అనుమతులుంటే
# రిజిస్ట్రేషన్లకు ఓకే



22ఎ నిషేధిత భూములపై ప్రభుత్వం కీలక ప్రకటన
జిహెచ్ఎంసి, హెచ్ఎండిఎ, డిటిసిపి, మున్సిపల్ అనుమతులుండాలి
22ఎ సమస్యలకు ఫాస్ట్‌ట్రాక్ పరిష్కారాలు
కొత్త ఆదేశాలు తక్షణమే అమల్లోకి: మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** 22ఏ భూములపై తెలంగాణ ప్రభుత్వం సంచలన ప్రకటన చేసింది. జిహెచ్ఎంసి,డిటిసిపి,హెచ్ఎండి అప్రూవల్ ఉంటే 22ఏలో ఉన్నా రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని అనుమతి ఇచ్చింది.ఈ ఆదేశాలు తక్షణమే అమల్లోకి వస్తాయని స్పష్టం చేసింది. ఈ నిర్ణయంతో లక్షలాది మందికి ఊరట దక్కనుంది. దశాబ్దాలుగా ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్న 22ఏ సమస్యలకు ఒక్కొక్కటిగా పరిష్కారం చూపుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ నెల 16న శాసనసభలో ఇచ్చిన హామీ మేరకు సహచర మంత్రులతో చర్చించి 22ఏ సమస్యలను ఫాస్ట్‌ట్రాక్ విధానంలో పరిష్కరించే దిశగా ప్రభుత్వం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించిందని చెప్పారు. 22 ఏ లో ఉన్నప్పటికీ సంబంధిత ప్రభుత్వ సంస్థల నుంచి చట్టబద్ధమైన అనుమతులు పొంది అభివృద్ధి చేసిన ఓపెన్ ప్లాట్లు, ఇళ్లు, ఫ్లాట్లకు నిర్దేశిత నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు చేసుకునే అవకాశం కల్పిస్తూ రెవెన్యూ శాఖ ఈరోజు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పురపాలక సంస్థలు, >>2

భూ అక్రమాలపై విచారణ కమిటీ
చైర్ పర్సన్‌గా దేవసేన నియామకం
కెసిఆర్, మరికొందరి ఉల్లంఘనలపై విచారణ
ప్రభుత్వ భూముల కొనుగోళ్లపై తనిఖీలు
2



బెస్ట్ పబ్లిక్ సర్వెంట్
## ముఖ్యమంత్రి రేవంత్
కేరళం నిలంబూరులో నేడు అవార్డు ప్రదానం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, సెప్టెంబరు24:** ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక ఆర్యదాన్ ముహమ్మద్-2026 బెస్ట్ పబ్లిక్ సర్వెంట్-2026 (ఉత్తమ ప్రజా సేవకుడు) అవార్డుకు ఎంపికయ్యారు. కేరళకు చెందిన దిగ్గజ కాంగ్రెస్ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్ ఈ పురస్కారాన్ని అందజేస్తోంది. తెలంగాణలో రైతులు, వెనుకబడిన వర్గాలు, సామాన్య >>2

## జంటనగరాల్లో నేడే
# మహా నిమజ్జనం

హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజ్‌గిరి కమిషనరేట్లలో 3 లక్షలుపైగా గణేశ విగ్రహాలు
ట్యాంక్‌బండ్ సహా అనేక చెరువులు, ప్రత్యేక పాండ్లలో నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు
35 వేల మంది పోలీసులతో పహారా
ప్రత్యేక డ్రోన్ బృందాలు సైతం రంగంలోకి



**హైదరాబాద్, సెప్టెంబరు 24: ప్రభాతవార్త:** జంట నగరాలతో పాటు శివార్లలో శుక్రవారం జరగనున్న సామూహిక గణేశ నిమజ్జనోత్సవానికి పోలీసు శాఖ భారీ బందోబస్తు ఏర్పాటు చేసింది. ట్రై కమిషనరేట్ల పరిధుల్లో 35 వేల మంది పోలీసులను బందోబస్తు కోసం రంగంలో దించా రు. దీంతో పాటు సున్నిత, అతి సున్నిత ప్రాంతాలలో సాయుధ బలగాలను మొహరించగా డ్రోన్లతో పహారా కోసం ప్రత్యేకంగా డ్రోన్ బృందా లను నియమించారు. హైదరాబాద్‌లో కాగా నిమజ్జనం సాఫీగా >>2



## నీట్ పిజి-2026 ఫలితాలు విడుదల
641 మార్కులు సాధించిన క్యాండిడేట్‌కు నం.1 ర్యాంక్

**హైదరాబాద్, సెప్టెంబరు24, ప్రభాత వార్త:** దేశవ్యాప్తంగా వైద్య విద్యలో పోస్ట్ గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నీట్ పీజీ 2026 ప్రవేశ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఇన్ మెడికల్ సైన్సెస్ (ఎన్‌బిఈఎంఎస్) ఈ ఫలితాలను గురువారం అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది. ఆగస్టు 30న ఈ పరీక్షను నిర్వహించిన విషయం తెలిసిందే. జైపూర్‌లోని రెండు కేంద్రాల్లో సమస్యలు తలెత్తిన >>2

# 'సర్'పై 28న ఆందోళన



కేంద్ర ఎన్నికల సంఘం తీరును వ్యతిరేకిస్తున్నాం..
కమిషనర్ల అభ్యంతరాలపై ఇసి వివరణ ఇవ్వాలి
ప్రతి పౌరుడి ఓటును కాపాడడం ఇసి బాధ్యత: పిసిసి చీఫ్ మహేష్ గౌడ్

**హైదరాబాద్,సెప్టెంబరు 24,ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో ఎన్నికల సంఘం వ్యవహరిస్తున్న మొదటి నుచి అనేక అనుమానాలకు తావిస్తుందని టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు..ఎన్నికల సంఘం ప్రవర్తిస్తున్న తీరుకు నిదసనగా ఎఐసిసి పిలుపు మేరకు ఈ నెల 28న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆయన కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు.ఈ విషయాలపై ఆయన ఈ రోజు ఒక ప్రకటన చేస్తూ ఓటు ప్రజాస్వామ్యానికి పునాది అని, ప్రతి పౌరుడికి హక్కు అని పౌరుల హక్కులను కాపాడడం ఎన్నికల సంఘం కనీస బాధ్యత అని అన్నారు.గత 10 నెలల్లో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించిన అంశాలపై చీఫ్ ఎన్నికల కమిషనర్ ను విభేదిస్తూ ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు 14 సార్లు అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న అంశాలు వెలుగులోకి వచ్చాయని వారి అభ్యంతరాలు కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు సంబంధించిన అంశాలు కూడా ఉన్నాయని ఆయన అన్నారు. కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం6లో సర్ కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు బయటకు వచ్చిందని, ఈ ప్రక్రియలో తలెత్తిన అనుమానాలు, ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని ఆయాన అన్నారు. ఫారం6లో చేసిన మార్పులపై ఇద్దరు కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు వచ్చిన వార్తల నేపథ్యంలో ఎన్నికల సంఘం దీనిపై పూర్తి వివరణ ఇవ్వాలని మహేష్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు.ఓటర్ల డేటాలో మార్పులు చేసే విధానం ఉంటే, క్షేత్రస్థాయిలో చట్టబద్ధమైన అధికారాలు కలిగిన ఇఆర్‌వోలు పాత్ర, వారి పర్యవేక్షణ, బాధ్యత ఏమిటో ఎన్నికల సంఘం స్పష్టం చేయాలని, ఓటర్ల డేటా ఎవరు మార్చారు? ఎప్పుడు మార్చారు? ఏ కారణంతో మార్చారు? ఏ అధికారి అనుమతితో మార్చారు? అనే వివరాలకు ఆడిట్ ట్రయల్ ఉండాలని, అత్యంత బాధ్యత యుతంగా ఉండాల్సిన అవసరం ఉందని అన్నారు.సర్ ప్రక్రియలో పెద్ద సంఖ్యలో ఓటర్ల పేర్లు డ్రాఫ్ట్ జాబితాల నుంచి తొలగించబడినట్లు నివేదికలు వెలువడ్డాయని, పేర్ల తొలగింపునకు కారణాలు ఏమిటి, ఎంత మంది పేర్లు తొలగించారు? ఎంతమంది అభ్యంతరాలు తెలిపారు? ఎన్ని పేర్లు తిరిగి చేర్చారు? అనే పూర్తి వివరాలను రాష్ట్రాల వారీగా, నియోజకవర్గాల వారీగా ఎన్నికల సంఘం బహిరంగపరచాలని టిపిసిసి చీఫ్ డిమాండ్ చేశారు.చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి >>2



# దానం అనర్హుడే
పిటిషన్ డిస్మిస్ చేసిన సుప్రీం కోర్టు
ఖైరతాబాద్ ఉప ఎన్నిక ఖాయం
తాను తిరిగి పోటీపై సిఎం స్పష్టత ఇస్తారని వెల్లడి

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** దానం నాగేందర్‌కు సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. పార్టీ ఫిరాయింపుల కేసులో ఇటీవల ఖైరతాబాద్ ఎమ్మెల్యేగా దానంపై తెలంగాణ హైకోర్టు అనర్హత వేటు వేయగా.. ఆయన సుప్రీంను ఆశ్రయించారు. ఆ పిటిషన్ గురువారం విచారణకు రాగా.. సుప్రీం కోర్టులో ఆయనకు చుక్కెదురైంది. హైకోర్టు తీర్పును సుప్రీం కోర్టు సమర్థించింది. వ్యక్తిగతంగా వేరే పార్టీలో చేరితే తప్పు కాదని.. పదవితో పాటే చేరితే పార్టీ ఫిరాయింపుల కిందకే వస్తుందని సుప్రీంస్పష్టం చేసింది.అనర్హతపై హైకోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ మళ్లీ ఎన్నికలకు వెళ్లండని దానంకు సూచించింది. అనంతరం పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో ఖైరతాబాద్‌లో ఉప ఎన్నిక అనివార్యమైంది. కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటన తర్వాత ఉప ఎన్నిక షెడ్యూల్ ఖరారు కానుంది. కాగా, 2023 తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో దానం నాగేందర్ బీఆర్ఎస్ తరఫున ఖైరతాబాద్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. అనంతరం కాంగ్రెస్‌లో చేరారు. 2024 లోక్‌సభఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేశారు. అప్పటికి ఆయన ఎమ్మెల్యేగా >>2

పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి ఎన్డీయే కసరత్తు
డీలిమిటేషన్, మహిళా బిల్లులే కీలకం
3



గురువారం భీంరెడ్డి బినామీల ఇళ్లలో ఎసిబి సోదాల్లో బయటపడిన నోట్ల కట్టలు

## భీంరెడ్డి బినామీల ఇళ్లలో
# ఎసిబి సోదాలు
అక్రమాస్తుల కేసు:

**హైదరాబాద్, సెప్టెంబర్ 24, ప్రభాతవార్త:** అక్రమాస్తుల కేసులో పట్టుబడ్డ పోలీసు కంప్యూటర్స్ సర్వీసెస్ డిఎస్పి భీంరెడ్డి బినామీలపై ఎసిబి అధికారులు గురువారం దాడులు నిర్వహించారు. భీంరెడ్డితో సన్నిహితంగా వున్న ఎనిమిది మందిపై ఈ దాడులు జరిగాయి. ఇందులో ఒక హో ంగార్డు వుండగా ఇద్దరు కానిస్టేబుళ్లు, మరికొందరు బంధువులు వున్నట్లు తెలిసింది. నగర శివార్లలోని పుప్పాల్‌గూడతో పాటు మణికొండ సహా మరో రెండు చోట్ల బినామీలు వున్నట్లు గుర్తించిన ఎసిబి అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఎసిబి డిఎస్‌పి శ్రీధరళ్ నేతృత్వంలో ఈ దా డులు జరిగాయి. దాడుల సందర్భంగా బినామీల వృత్తి, ప్రవృత్తి ఏమిటీ...? వారి నెలసరి >>2



వర్ష సూచన
## 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్
గంటకు 40 కి.మీ వేగంతో ఈదురు గాలులు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** తెలంగాణలోని వివిధ జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) రాష్ట్రంలోని 10 జిల్లాలకు శుక్రవారం వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. వీటిలో భద్రాద్రి కొత్తగూడెం, హన్మకొండ,జనగాం, కరీంనగర్,మహబూబాబాద్, >>2



# మీ కిడ్నీలు జర భద్రం..
తెలుగు రాష్ట్రాల్లో పెరుగుతున్న కిడ్నీవ్యాధిగ్రస్తులు

డయాలసిస్ కేంద్రాలపై పెరుగుతున్న ఒత్తిడి
తెలంగాణలో 101, ఎపిలో 61 డయాలసిస్ కేంద్రాలు
కిడ్నీ మార్పిడికి 5 నుంచి 10 లక్షల ఖర్చు
రాకెట్‌తో కోట్లు ఆర్జిస్తున్న కొన్ని ఆసుపత్రులు

**ప్రభాతవార్త / న్యూస్‌నెట్‌వర్క్**

రెండు తెలుగు రాష్ట్రాల్లో కిడ్నీ వ్యాధి చాపకింద నీరులా వ్యాపిస్తోంది. ఇతర వ్యాధుల వలే దీనిని ప్రాథమిక స్థాయిలో గుర్తించే అవకాశాలు తక్కు వగా ఉండటంతో కిడ్నీ ఫెయిల్యూర్ స్థాయికి చేరు కుంటున్న వ్యాధిగ్రస్తులు. మొదటి రెండు దశల్లో గుర్తించలేకపోతున్న రోగులు. అతి త్వరగా మం దుల స్థాయి నుంచి డయాలసిస్ తప్పనిసరి పరి స్థితికి చేరుకుంటున్నారు. కొన్ని నెలలు డయాలసిస్ తరువాత కిడ్నీ మార్పిడి అత్యవసరం అవు తోంది. ఈ >>7



# భూ అక్రమాలపై విచారణ కమిటీ

## చైర్ పర్సన్‌గా దేవసేన నియామకం

## కెసిఆర్, మరికొందరి ఉల్లంఘనలపై విచారణ

## ప్రభుత్వ భూముల కొనుగోళ్లపై తనిఖీలు

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** తెలంగాణలో భూములకు సంబంధించిన అక్రమాలు, నిబంధనల ఉల్లంఘనలపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో భూములకు సంబంధించిన అంశాలపై సమగ్ర విచారణ కోసం ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ చైర్‌పర్సన్‌గా టెక్నికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ శ్రీదేవసేన, కన్వీనర్‌గా స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్‌గాంధీ హనుమంతు, సభ్యులుగా జనగామ జిల్లా కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, సంబంధిత జిల్లా కలెక్టర్లు ఉంటారు. ఈ మేరకు సీఎస్ సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ చేశారు. 22ఏ భూముల అంశంపై ఈ నెల 16న అసెంబ్లీలో జరిగిన చర్చ తర్వాత ఈ కమిటీని ఏర్పాటు చేశారు. అయితే ఈ విచారణ కేవలం 22ఏ భూములకే పరిమితం కాదని స్పష్టం చేసిన ప్రభుత్వం మొత్తం 16 ప్రధాన భూ అంశాలను కమిటీ పరిధిలోకి తీసుకొచ్చింది. ఇవి కాకుండా మరిన్ని అంశాలను కూడా కమిటీకి అప్పగించే అవకాశం ఉన్నట్లు జీవోలో ప్రభుత్వం స్పష్టం చేసింది. ఆయా భూముల విషయంలో చట్టాలు, నిబంధనలు, ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించారా? అన్నది ఈ కమిటీ పరిశీలించనుంది. ఉల్లంఘనలు జరిగినట్లు తేలితే బాధ్యతను నిర్ధారించి, తగిన చర్యలకు సిఫారసు చేయనుంది. ఈ కమిటీ పరిధి 22ఏ భూములకే పరిమితం కాకుండా ప్రభుత్వ భూములు, సీలింగ్ సర్‌ప్లస్ భూములు, అసైన్డ్ భూములు, జాగీర్ భూములు, భూదాన్ భూములు, ఇనామ్ భూములు, అటవీ భూములు, భూసేకరణ, పునరావాసం పునరావాస ప్యాకేజీలు, చెరువులు, నీటి వనరులు, వాటి పరివాహక ప్రాంతాలు, భూ రికార్డులను కూడా కమిటీ పరిశీలించనుంది. అవసరమైతే ఏ ప్రభుత్వ శాఖ నుంచైనా రికార్డులు, డాక్యుమెంట్లు, డేటా, సమాచారాన్ని ఈ కమిటీ కోరవచ్చు. కలెక్టర్లు, కార్పొరేషన్లు, స్థానిక సంస్థలు, ఇతర ప్రభుత్వ సంస్థలు కమిటీకి పూర్తి సహకారం అందించాల్సి ఉంటుంది. ఈ కమిటీ తన నివేదికను వీలైనంత త్వరగా ప్రభుత్వానికి సమర్పించాల్సి ఉంటుంది. అవసరానికి అనుగుణంగా నిర్దిష్ట అంశాలపై మధ్యంతర నివేదికలు కూడా సమర్పించవచ్చు. ఇక జీవోలో 16 ప్రధాన భూ అంశాలను ప్రత్యేకంగా చేర్చారు. సిద్దిపేట జిల్లా మార్కుక్ మండలం ఎర్రవల్లి, వెంకటాపూర్ ప్రాంతాల్లో మాజీ సీఎం కేసీఆర్, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించిన భూముల అంశాన్ని విచారణ పరిధిలోకి తీసుకొచ్చారు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం రామంచలో రంగనాయకసాగర్ రిజర్వాయర్ సమీపంలోని మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించిన భూముల అంశాన్ని కూడా చేర్చారు. సిద్దిపేట జిల్లా కొండపాక మండలం వెలికట్టలో సర్వే నంబర్ 271లో ఎం.హనుమంతరావు అనే వ్యక్తి అసైన్డ్ భూమి కొనుగోలు చేసిన అంశం, మల్లన్నసాగర్ భూసేకరణలో అక్రమాలపై వచ్చిన ఆరోపణలను కూడా ఈ కమిటీ పరిశీలించనుంది. అదేవిధంగా రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం జన్వాడలో సతబిషా ఆగ్రో తదితర కంపెనీలు, వ్యక్తులు కొనుగోలు చేసిన భూములను మాజీ మంత్రి కేటీఆర్ కుటుంబ సభ్యులు, అనుచరులు కొనుగోలు చేసిన అంశాన్ని కూడా జీవోలో ప్రస్తావించారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ మండలం మద్దూర్‌లో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించిన భూములను కూడా ఈ విచారణ పరిధిలోకి తీసుకొచ్చింది.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం అజీజ్‌నగర్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు, ఆయన కుటుంబ సభ్యులు, అనుచరులకు సంబంధించిన భూముల అంశంతో పాటు అదే ప్రాంతంలో తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి అసైన్డ్ భూముల కొనుగోలు, అక్రమ ఆక్రమణకు సంబంధించిన ఆరోపణలను కూడా కమిటీ పరిశీలించనుంది. శంషాబాద్ మండలం బహదూర్‌గూడలో మాజీ మంత్రి గంగుల కమలాకర్, ఇతరులు ప్రభుత్వ భూమిని అక్రమంగా కొనుగోలు చేసి ఆక్రమించారన్న ఆరోపణలు, గండిపేట మండలం వట్టినాగులపల్లిలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు భూదాన్ భూములను అక్రమంగా కొనుగోలు చేశారన్న ఆరోపణలు కూడా జాబితాలో ఉన్నాయి. వట్టినాగులపల్లిలోనే శంకరాహిల్స్ భూముల కొనుగోలుకు సంబంధించిన మాజీ మంత్రి గంగుల కమలాకర్ అంశాన్ని కూడా జీవోలో చేర్చారు. కందుకూరు మండలం తిమ్మాపూర్‌లో భూదాన్ భూముల అంశం, హైదరాబాద్, సికింద్రాబాద్ ప్రాంతాల్లో ఎల్విన్ స్టైఫెన్సన్ లీజ్ భూముల రెగ్యులరైజేషన్ అంశం కూడా కమిటీ పరిశీలించనుంది. మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలం గుండేడ్‌లో ధరణి మాడ్యూల్, ఇతర విధానాల దుర్వినియోగానికి సంబంధించిన అంశాలను కూడా కమిటీ పరిధిలోకి తీసుకొచ్చారు.

రాజ్ హైటెక్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, రాజ్ పౌల్ట్రీ అండ్ ప్లాంటేషన్ ప్రైవేట్ లిమిటెడ్, రాజ్ పౌల్ట్రీ అండ్ అగ్రికల్చర్ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్, మానవిహ బ్రీడర్స్ ఎల్‌ఎల్‌పీ సంస్థలకు సంబంధించిన అంశాలను జీవోలో ప్రస్తావించారు. ఈ సంస్థలకు సంబంధించి ఎం.హనుమంతరావు, ఎం.సుమన్, టి.మహేష్‌రావు తదితరుల పేర్లను కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో అసైన్డ్ భూముల అక్రమ కొనుగోళ్ళ, ప్రభుత్వ భూముల అక్రమ కేటాయింపులకు సంబంధించిన ఆరోపణలను కూడా కమిటీ విచారించనుంది. సిరిసిల్ల, తంగళ్లపల్లి తదితర మండలాలతోపాటు సర్దాపూర్, లక్ష్మీ మ్రపూర్, తంగళ్లపల్లి వంటి గ్రామాలను జీవోలో పేర్కొన్నారు. పభుత్వ, అసైన్డ్, భూదాన్, ఇనామ్, అటవీ, సీలింగ్ భూములు

మిడ్ మానేర్ రిజర్వాయర్ పరిధిలో జోగినపల్లి రవీందర్‌రావు, జోగినపల్లి సౌమ్యలకు సంబంధించి పరిహారం, పునరావాస ప్యాకేజీలను అక్రమంగా పొందారన్న ఆరోపణలను కూడా కమిటీ పరిశీలించనుంది. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని బోయినపల్లి, ఇతర మండలాల్లో మిడ్ మానేర్ రిజర్వాయర్ కోసం జరిగిన భూసేకరణకు సంబంధించిన గ్రామాలు, మాన్వాడ సహా ప్రాంతాలు కూడా విచారణ పరిధిలో ఉన్నాయి. అయితే ఈ 16 అంశాలకే కమిటీ విచారణ పరిమితం కాదని అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్‌లో మరిన్ని గ్రామాలు, మరిన్ని భూ అంశాలను కూడా ప్రభుత్వం కమిటీకి అప్పగించవచ్చని పేర్కొంది.

అంటే 22ఏ భూముల అంశంతో మొదలైన ఈ విచారణ పరిధి ప్రభుత్వ, అసైన్డ్, భూదాన్, ఇనామ్, అటవీ, సీలింగ్ భూములు, భూసేకరణ, ధరణి రికార్డులు తదితర అంశాల వరకు విస్తరించింది.

ఆరోపణలు, నిబంధనల ఉల్లంఘనలు ఉన్నాయా? లేదా అన్నది పరిశీలించి తగిన చర్యలకు సిఫారసు చేయడం కమిటీ ప్రధాన బాధ్యతగా ప్రభుత్వం నిర్దేశించింది.



గురువారం కోల్‌కతాలోని కాళీఘాట్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ

## దానం అనర్హుడే

>> కొనసాగుతుండటంతో.. ఒక పార్టీ తరఫున ఎమ్మెల్యేగా గెలిచి మరో పార్టీ అభ్యర్థిగా లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేయడం రాజ్యాంగంలోని పదో షెడ్యూల్ కింద పార్టీ ఫిరాయింపుగా పరిగణించాలంటూ అనర్హత పిటిషన్లు దాఖలయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి, బీజేపీ శాసనసభా పక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి వేర్వేరుగా అసెంబ్లీ స్పీకర్ వద్ద దానం నాగేందర్‌పై అనర్హత పిటిషన్లు దాఖలు చేశారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ 2026 మార్చి 11న పిటిషన్లను కొట్టివేశారు. దానం నాగేందర్ బీఆర్ఎస్ సభ్యత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకున్నట్లు నిర్ధారించడానికి తగిన ఆధారాలు లేవని స్పీకర్ అభిప్రాయపడ్డారు. స్పీకర్ నిర్ణయాన్ని సవాల్ చేస్తూ పాడి కౌశిక్‌రెడ్డి, ఏలేటి మహేశ్వర్‌రెడ్డి తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు ధర్మాసనం ఆగస్టు 21న తీర్పును రిజర్వు చేసింది. సెప్టెంబర్ 18న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. స్పీకర్ ఇచ్చిన ఉత్తర్వులను పక్కనపెట్టి దానం నాగేందర్‌ను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది. అంతేకాదు.. ఈ అనర్హత 2024 ఏప్రిల్ 23 నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు కూడా హైకోర్టు ప్రకటించింది. హైకోర్టు తీర్పును వెంటనే అమలు చేయకుండా నిలిపివేసి సుప్రీంకోర్టుకు వెళ్లేందుకు అవకాశం ఇవ్వాలన్న దానం నాగేందర్ తరఫు అభ్యర్థనను కూడా ధర్మాసనం అంగీకరించలేదు. తీర్పు ప్రతిని అసెంబ్లీ స్పీకర్, అసెంబ్లీ కార్యదర్శి, ఎన్నికల సంఘానికి పంపించాలని ఆదేశించింది. హైకోర్టు తీర్పు తర్వాత దానం నాగేందర్ ఈనెల 19న సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. హైకోర్టు తీర్పును నిలిపివేయాలని కోరారు. ఆయన తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ అత్యవసర విచారణ కోరగా.. సుప్రీంకోర్టు విచారణకు అంగీకరించింది. ఈ కేసులో బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇప్పటికే కేవియట్లు దాఖలు చేశారు. తాజాగా.. గురువారం పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీం కోర్టు.. హైకోర్టు తీర్పును సమర్థిస్తూ దానం నాగేందర్ పిటిషన్‌ను కొట్టేసింది. దీంతో ఖైరతాబాద్‌లో త్వరలోనే ఉప ఎన్నిక రానుంది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నానని దానం నాగేందర్ అన్నారు. సర్వోన్నత న్యాయస్థానం గురువారం తీర్పును వెలువరించిన సందర్భంగా ఆయన స్పందించారు. తనకు ప్రజా క్షేత్రంలో బలం ఉందని తెలిపారు. తాను ప్రతి ఇంటికి సేవ చేశానని వాళ్లను అడిగితే తెలుస్తుందన్నారు. ఉపఎన్నికల్లో పోటీపై సీఎం స్పష్టత ఇస్తారన్నారు.

## భీంరెడ్డి బినామీల ఇళ్లలో ఎసిబి సోదాలు

>> సంపాదన ఎంత...? వారి మొత్తం ఆస్తులు ఎన్ని.. .? రెండు, మూడేళ్ల క్రితం ఎంత వుండేది...? ఇప్పుడు ఎంత వుంది...? అనే దానిపై ఎసిబి అధికారులు వివరాలు సేకరిస్తున్నారు. బినామీల ఆస్తుల వివరాలతో పాటు దానికి సంబంధించిన అన్ని పత్రాలను ఎసిబి అధికారులు క్షుణ్ణంగా పరిశీలించారు. వారికి వున్న ఆస్తులు గతంలో ఎ వరి పేరిట వుండేవి...? వీరి పేరిట ఎప్పుడు బదిలీ అయ్యాయి...? ఏ నేపథ్యంలో బదిలీ అయ్యాయి. వాటి విలువ ఎంత...? అనే అంశాలపై ఎసిబి అధికారులు దృష్టి సారించారు. అక్రమాస్తుల కేసులో భీంరెడ్డి గత జూలై నెల ఆరవ తేదీన ఎసిబికి పట్టుబడడం తెలిసిందే. పట్టుబడిన సమయంలో అనారోగ్యంతో వుండడంతో ఆయన ఆసుపత్రి పాలయ్యారు.

ఐదు రోజుల తరువాత ఎసిబి అధికారులు అరెస్టు చేసి జైలుకు తరలి ంచారు. ఎసిబికి పట్టుబడడంతో ఆయనను సర్కారు సస్పెండ్ చేసింది. సెప్టెంబరు ఒకటవ తేదీన ఆయన చంచల్‌గూడ జైలు నుంచి బెయిలు పై విడుదలయ్యాక ఆయనకు ఈడీ అధికారులు మనీలాండరింగ్ కోణంలో నోటీసులు జారీ చేసి విచారణకు రావాలని ఆదేశించారు. ఓవైపు ఎ సిబి. ఈడీ కేసు కొనసాగుతుండగానే తాజాగా ఆయన బినామీలను కూడా ఎసిబి అధికారులు టార్గెట్ చేయడం సంచలనం రేపింది. ఎసిబికి ప ట్టుబడ్డ అధికారులకు సంబంధించిన కేసుల్లో బినామీల ఇళ్లలో దాడులు జరగడం ఇటీవల కాలంలో ఇదే మొదటిసారి కావడం గమనార్హం.

## 'సర్'పై 28న ఆందోళన

>> ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తకుండా, ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబు దారీతనంతో ఉండేలా చూడాలని ఆయన అన్నారు. ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.

## బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ ముఖ్యమంత్రి రేవంత్

>> ప్రజల సంక్షేమానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపట్టిన వినూత్న కార్యక్రమాలు, దూరదృష్టి గల నాయకత్వానికి గానూ ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఫౌండేషన్ వర్కింగ్ ఛైర్మన్, నిలంబూర్ ఎమ్మెల్యే ఆర్యదాన్ షౌకత్ తెలిపారు. అవార్డు ఎంపికకు ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ రెవెన్యూ శాఖ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్, ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ జ్యూరీగా వ్యవహరించారు. ప్రజాస్వామిక విలువలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను ఈ సందర్భంగా జ్యూరీ ప్రత్యేకంగా కొనియాడింది.

ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని కేరళలోని నిలంబూర్‌లో శుక్రవారం ఉదయం 10 గంటలకు అవార్డును ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రదానం చేస్తారు. పురస్కారం కింద రూ.లక్ష నగదు బహుమతి, ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందజేస్తారు. వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్, ఆర్యదాన్ ముహమ్మద్ స్మారక ఉపన్యాసం చేస్తారు. ఆర్యదాన్ ముహమ్మద్ కేరళ కాంగ్రెస్ సీనియర్ నేత. 8 సార్లు ఎమ్మెల్యేగా, కేరళలోని వివిధ మంత్రివర్గాల్లో నాలుగు సార్లు వివిధ శాఖలకు మంత్రిగా సేవలు అందించారు. రాజనీతిజ్ఞుడైన ఆర్యదాన్ ముహమ్మద్ దూరదృష్టి గల నేతగా, అద్భుతమైన పార్లమెంటేరియన్‌గా, సమర్థుడైన పాలకునిగా, కార్మిక వర్గ ఛాంపియన్‌గా కేరళ ప్రజల మదిలో నిలిచిపోయారు. నిజాయితీ, లౌకిక విలువలు, ప్రజా సంక్షేమ పాలనకు మారుపేరుగా ఆర్యదాన్ ముహమ్మద్ గుర్తింపుపొందారు.

## ఆ నాలుగు అనుమతులుంటే రిజిస్ట్రేషన్లకు ఓకే

>> డీటీసీపీ లేదా ఇతర పట్టణ, గ్రామీణ స్థానిక సంస్థల నుంచి చెల్లుబాటు అయ్యే లేఅవుట్, భవన నిర్మాణం లేదా అపార్ట్‌మెంట్ అనుమతులు పొందిన ఆస్తులకు ఈ నిర్ణయం వర్తిస్తుందని చెప్పారు. అనుమతి పొందిన అనంతరం జరిగిన రిజిస్ట్రేషన్లకు సంబంధించి ఏదో ఒక లింక్ డాక్యుమెంట్ తప్పనిసరిగా దరఖాస్తుదారులు సమర్పించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. జిల్లా స్థాయిలో సమస్యల పరిష్కారానికి కమిటీఈ ప్రక్రియలో ఏవైనా సమస్యలు తలెత్తితే వాటిని పరిశీలించి పరిష్కరించేందుకు జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. ఈ కమిటీలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), జిల్లా రిజిస్ట్రార్, హెచ్‌ఎండీఏ/పురపాలక సంస్థ/గ్రామీణ స్థానిక సంస్థల ప్రతినిధి సభ్యులుగా ఉంటారని తెలిపారు. 22ఏ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ఇప్పటికే అమలులోకి వచ్చిన నిర్ణయాలే నిదర్శనమని మంత్రి తెలిపారు. రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లాల్లోని దాదాపు 64 కాలనీల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యకు జీవో 118కు అనుగుణంగా మెమో జారీ, దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న సింగరేణి కార్మికుల ఇళ్ల క్రమబద్ధీకరణ సమస్యను కూడా ప్రభుత్వం జీవో 76 ద్వారా పరిష్కరించే దిశగా కీలక నిర్ణయం తీసుకుందని మంత్రి తెలిపారు.

భూమి, ఇల్లు వంటి అంశాల్లో ప్రజలు సంవత్సరాల తరబడి ప్రభుత్వ కార్యాలయాలు, కోర్టుల చుట్టూ తిరిగే పరిస్థితికి ముగింపు పలకడమే ప్రజా ప్రభుత్వం లక్ష్యమని అన్నారు.

ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యలను కేవలం ఫైళ్లకే పరిమితం చేయకుండా, ప్రజలకు ప్రత్యక్షంగా ఉపశమనం కలిగేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకుంటోందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. 22ఏలోని అన్ని భూములను ఒకే గాటన కట్టకుండా, భూమి స్వభావం, అందు బాటులో ఉన్న రికార్డులు, చట్టబద్ధమైన అనుమతులు, న్యాయపరమైన అంశాలను పరిశీలించి అర్హమైన సమస్యలకు సత్వర పరిష్కారం చూపుతామని మంత్రి స్పష్టం చేశారు.

### వారం - వర్జ్యం

25-09-2026, శుక్రవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
భాద్రపద మాసం, దక్షిణాయణం
వర్ష ఋతువు, శుక్లపక్షం, ఉత్తర కార్తె,
తి. చతుర్దశి రా.11.03, న.శతభిష ఉ.11.19
వ.సా.5.46 - రా.7.22
దు.ఉ.8.21 - ఉ.9.09
2) మ.12.23 - మ.1.11
రాహు ఉ.10.30-12.00 శుభ స. లేదు

### వార్తాఫలం

**మేషం :** ఆరంభశూరత్వంతో కొత్త పనులను ప్రారంభించే అవకాశాలున్నాయి. పొదుపు పథకాలకు శ్రీకారం చుడతారు.

**వృషభం :** ఆహార, ఆరోగ్య నియమాల పట్ల ప్రత్యే శ్రద్ధను కనబరుస్తారు. అన్యభాషలు నేర్చుకోవాలనే ఆలోచనలు మెదులుతాయి.

**మిథునం :** నిష్కారణమై అసూయా, ద్వేషాలకు కారణం అంతుపట్టదు. తగిన చర్యలను చేపడతారు. మంచి అవకాశాలు లభిస్తాయి.

**కర్కాటకం :** మాట తీరులో కొద్దిపాటి మార్పులను చేయడం వలన అధికంగా లాభపడతారు. గోప్యంగా వ్యవహరిస్తారు.

**సింహం :** సమాజంలోని ఉన్నత స్థాయి వర్గం వారు కూడా మీ సలహాలను స్వీకరిస్తారు. మంచి అవకాశాలు లభిస్తాయి.

**కన్య :** పంతానికి పోయి కొంతమంది వ్యక్తులతో కలవడం ఇష్టంలేక ప్రయోజనాలను వదులుకుంటారు.

**తుల :** ఉన్నత స్థానంలో ఉన్నవారు సహాయ సహకారాలను అందిస్తారు. నూతన అవకాశాలు కలిసివస్తాయి.

**వృశ్చికం:** విజయానికి ఐకమత్యమే పునాదని బలంగా నమ్ముతారు. నూతనోత్సాహాన్ని కలిగి ఉంటారు.

**ధనుస్సు :** సంఘంలో గౌరవ మర్యాదలు పెంపొందుతాయి. బంధువర్గంతో ఏర్పడిన వివాదాలు సమసిపోతాయి.

**మకరం :** మొదట కొంత నింపాదిగా పనులు సాగినప్పటికీ తుది ఫలితాలు మెరుగ్గా ఉంటాయి.

**కుంభం :** నిష్ణాతుల నుండి తీసుకునే సూచనల వలన లాభపడతారు. పనిభారం అధికంగా ఉంటుంది.

**మీనం :** వ్యక్తిగత విషయాలకన్నా, వృత్తి, ఉద్యోగాలకు ప్రాముఖ్యత నిస్తారు. గోప్యంగా వ్యవహరిస్తారు.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



సిమ్లాలో గురువారం రాష్ట్రప్రభుత్వ ప్రజావ్యతిరేక నిర్ణయాలకు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న బిజెపి శ్రేణులు

## జంటనగరాల్లో నేడే మహా నిమజ్జనం

>> సాగేందుకు వీలుగా టెక్నాలజిని వాడుతున్న పోలీసు శాఖ ట్రై కమిషనరేట్లలో ఎ నిమిది లక్షలకు పైగా సిసి కెమెరాల సేవలను వాడుకుంటున్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో గణేష్ ఉత్సవాలు శుక్రవారంతో ముగియనున్నాయి. ఈ నెల 14వ తేదీన మొదలైన గణేష్ వేడుకలు ధూంధాంగా కొన సాగుతుండడం తెలిసిందే. హైదరాబాద్‌తో పాటు సైబరాబాద్, మల్కాజిగిరి కమిషనరేట్ల పరిధుల్లో మూడు లక్షలకు పైగా విగ్రహాలు ప్రతిష్ఠించడం విదితమే. ఇందులో ఇప్పటి వరకు చిన్న విగ్రహాలతో పాటు ఓ మోస్తరు ఎత్తు కలిగిన విగ్రహాలు రెండున్నర లక్షల వరకు వుండగా వీటి లో 80శాతం ఇప్పటికే ట్యాంక్‌బండ్‌తో పాటు ఆయా ప్రాంతాలలో గల చెరువులు, కుంటలు, బల్దియా ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల్లో ని మజ్జనం అయ్యాయి. మిగతా విగ్రహాలు శుక్రవారం నాడు నిమజ్జనం కానున్నాయి. ఇందులో మెజారిటీ విగ్రహాలు భారీవే కావడం గమనార్హం. కాగా శుక్రవారం జరిగే నిమజ్జనం కోసం ట్యాంక్‌బండ్‌తో పాటు శివార్లలోని చెరువులు, కుంటల వద్ద ఇప్పటికే ఏర్పాట్లు పూర్తి కాగా ఈ సంద ర్భంగా ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా ఏర్పాట్లు చేశారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా మెజారిటీ విగ్రహాలు ట్యాం క్‌బండ్ నెక్లెస్ రోడ్డు మార్గంలోనే నిమజ్జనం అవుతుండడంతో ఇక్కడ అదనపు బలగాలను మొహరించారు. హైదరాబాద్ వరకు వస్తే 20 వేల మంది పోలీసులు బందోబస్తులో వుండగా సైబరాబాద్‌లో ఆరు వేల మంది, మల్కాజిగిరి పరిధిలో 12 వేల మందిని మొహరించారు. గణేష్ ఉ త్సవాల కోసం పోలీసు, పౌర విభాగాలు నెలన్నరగా ఏర్పాట్లు చేయడం విశేషం. ట్యాంక్‌బండ్‌లో శుక్రవారం నాటి చివరి రోజు నిమజ్జనంలో 25 వేల విగ్రహాలు వచ్చే వీలుందని అధికారులు అంచనా వేయసాగారు. పిఓపి విగ్రహాలకు నెక్లెస్ రోడ్, ఎన్టీఆర్ మార్గ్‌లలో ఏర్పాటు చేసిన కృత్రిమ కొలనుల్లో నిమజ్జనానికి ఏర్పాట్లు చేశారు. దీంతో పాటు జంట నగరాలు, శివార్లలో బల్దియా ఆధ్వర్యంలో 200 వరకు కృత్రిమ నీటి కొ లనులు ఏర్పాటు చేయడంతో ఇక్కడ కూడా పెద్ద సంఖ్యలో విగ్రహాలను నిమజ్జనం చేయసాగారు. గణేష్ నిమజ్జనం ప్రధాన ఊరేగింపు బాలాపూర్ రాచకొండ పరిధిలో వుండగా అక్కడి నుంచి ట్యాంక్‌బండ్ వరకు వున్న 19 కిలోమీటర్ల మార్గంలో వెయ్యికి పైగా సిసి కెమెరాలను ఏరా ్పటు చేశారు. ఇక గణేష్ బందోబస్తు కోసం నగరంలోని అన్ని మార్గాలు కలిపి 120 కిలోమీటర్ల దూరంగా నిర్ణయించారు. ఈ క్రమంలో అన్ని చోట్ల పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. నిమజ్జనంలో ప్రజల భాగస్వామ్యం, స్వచ్ఛంద సేవకుల సేవలను పెంచారు. ఇక గణేష్ విగ్రహాల త రలింపు సవ్యంగా సాగేందుకు సిసి కెమెరాలను, టెక్నాలజిని మరోసారి వాడుతున్నారు. దీనివల్ల ముఖ్యమైన విగ్రహాల వద్ద జరిగే అన్ని కార్య క్రమాలను బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ రూం నుంచి నిరంతరం పరిశీలించేందుకు వీలుంటుంది. హైదరాబాద్ పరిధిలో బందోబస్తు కోసం రంగంలో దిగిన 20 వేల మంది పోలీసులను జోన్ల వారిగా కేటాయించారు. నగరంలో 18 జంక్షన్లను కీలకమైనవిగా గుర్తించారు. ఇక్క డ సాయుధ బలగాలను మొహరించారు. ఇదే సమయంలో జంట నగరాలు, శివార్లలో బందోబస్తును నిరంతరం పర్యవేక్షించేందుకు ఏడు లక్ష లకు పైగా సిసి కెమెరాల సేవలను వాడుకోనున్నారు. ఇక నిమజ్జనం వేళ డిజెలను నిషేధించగా, మద్యం తాగి ఎవరూ రావద్దని, ఇలాంటి వా రిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ఇదే సమయంలో పేలుడు పదార్థాలను గుర్తించేందుకు ప్రత్యేకంగా శిక్షణ పొందిన జాగిలాలను, ఆపదలో వు న్న వారిని రక్షించేందుకు గజ ఈతగాళ్లను రంగంలో దించారు. ఎవరికైనా ఏమైనా జరిగితే వెంటనే వైద్య సేవలందిం చేందుకు పలుచోట్ల అంబులెన్స్‌లు సిద్ధంగా వుంచారు. ఆకతాయిల భరతం పట్టేందుకు షీ బృందాలను రంగంలో దించారు. ఖైరతాబాద్ వినా యక విగ్రహం ఈసారి కూడా త్వరగానే నిమజ్జనం అయ్యేలా అధికారులు చర్యలు తీసుకున్నారు.

**రెండు రోజుల పాటు మద్యం, కల్లు అమ్మకాలు బంద్**

ఇదిలావుండగా గణేష్ నిమజ్జనం పురస్కరించుకుని జంట నగరాలు, శివార్లలో రెండు రోజుల పాటు మద్యం, కల్లు అమ్మకాలను నిలిపివేస్తూ సర్కారు ఆదేశాలు జారీ చేసింది. శుక్రవారం ఉదయం ఆరు గంటల నుంచి శనివారం సాయంత్రం ఆరు గంటల వరకు మద్యం, కల్లు అమ్మ కాలు చేయరాదు. మద్యం దుకాణాలు, కల్లు కాంపౌండ్లు, బార్ అండ్ రెస్టారెంట్లు, పబ్‌లు, మిలటరీ క్యాంటీన్లు, స్టార్ హోటళ్లకు కూడా ఈ నిషేధం వర్తిస్తుందని సర్కారు జారీ చేసిన ఉత్తర్వులో వుంది.

## 10 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

>> ములు గు, నల్గొండ, సూర్యాపేట, వరంగల్ జిల్లాలు ఉన్నాయి. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ ఉన్నాయి. హైదరాబాద్, మేడ్చల్, మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాలతో సహా 15 జిల్లాలకు గంటకు 40 కిలోమీటర్ల కంటే తక్కువ గరిష్ట ఉపరితల గాలుల వేగంతో కూడిన ఉరుములతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేస్తూ ఎల్లో హెచ్చరిక జారీ చేసింది. వర్ష సూచన దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసర పరిస్థితి ఉంటే తప్ప బయటకు రాకూడదని అధికారులు కోరారు. గణేశ విగ్రహాల నిమజ్జనంలో పాల్గొనే భక్తులను కూడా అప్రమత్తంగా ఉండమని కోరారు. కాగా గడచిన 24 గంటల్లో రాష్ట్రంలో సగటున 33.8 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది. రాష్ట్రంలోనే అత్యధికంగా మహబూబాబాద్ జిల్లాలో 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే సిద్దిపేట్ జిల్లాలో 48.8 మిల్లీమీటర్లు, సిరిసిల్లాలో 56.3 మిల్లీమీటర్లు, మంచిర్యాలలో 34.6 మిల్లీమీటర్లు, పెద్దపల్లిలో 45.9 మిల్లీమీటర్లు, ఆసిఫాబాద్‌లో 37.3 మిల్లీమీటర్లు, జగిత్యాలో 54.3 మిల్లీమీటర్లు, కరీంగనగర్‌లో 67.2 మిల్లీమీటర్లు, ములుగులో 33.1 మిల్లీమీటర్లు, భూపాలపల్లిలో 46.5 మిల్లీమీటర్లు, భువనగిరిలో 26.8 మిల్లీమీటర్లు, జనగామలో 77.9 మిల్లీమీటర్లు, మహబూబ్‌నగర్‌లో 23.2 మిల్లీమీటర్లు, సూర్యాపేట్‌లో 69.3 మిల్లీమీటర్లు, వనపర్తిలో 40.5 మిల్లీ మీటర్లు, ఖమ్మంలో 79.3 మిల్లీమీటర్లు, నల్లగొండలో 21.7 మిల్లీమీటర్లు, వరంగల్‌లో 78.7 మిల్లీమీటర్లు, హన్మకొండ జిల్లాలో 78.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## నీట్ పిజి-2026 ఫలితాలు విడుదల

>> అభ్యర్థులకు రీఎగ్జామ్ కూడా నిర్వహించారు. పరీక్షకు హాజరైన అభ్యర్థులు తమ రోల్ నంబర్ ఆధారంగా ఫలితాలను, ర్యాంకు వివరాలను చెక్ చేసుకోవచ్చు. ఈ ఫలితాలతో పాటు వివిధ కేటగిరీలకు సంబంధించిన క్వాలిఫైయింగ్ కటాఫ్ మార్కులను కూడా ఎన్‌బిఈఎంఎస్ ప్రకటించింది. మొత్తం 720 మార్కులకు గాను కటాఫ్ స్కోర్లను ఇలా నిర్ధారించారు: జనరల్ / ఈడబ్ల్యుఎస్: 50వ పర్సంటైల్ కటాఫ్ స్కోరు 262.

**జనరల్ పిడబ్ల్యుబిడి:** 45వ పర్సంటైల్ కటాఫ్ స్కోరు 244

**ఎస్‌సి ఎస్‌టి ఓబిసి (పిడబ్ల్యుబిడితో సహా):** 40వ పర్సంటైల్ కటాఫ్ స్కోరు 226, ఈ కటాఫ్ మార్కులు సాధించిన అభ్యర్థులు కౌన్సెలింగ్‌లో పాల్గొనేందుకు అర్హత సాధిస్తారు.

అభ్యర్థులు తమ ఫలితాలను సులభంగా తెలుసుకునేందుకు ముందుగా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలి. హోమ్‌పేజీలోని ఎగ్జామినేషన్స్ సెక్షన్‌కు వెళ్లాలి. అక్కడ నీట్ పీజీ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. నీట్ పీజీ 2026 సెక్షన్‌పై క్లిక్ చేసి, రిజల్ట్స్ లింక్‌ను ఓపెన్ చేయాలి. ఫలితాల పీడీఎఫ్ ఫైల్ ఓపెన్ అవుతుంది. అందులో మీ రోల్ నంబర్ ద్వారా ఫలితాన్ని సరిచూసుకోవచ్చు. అభ్యర్థుల వ్యక్తిగత స్కోర్‌కార్డులను అక్టోబర్ 1, 2026 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని వితీనిలీఛ తెలిపింది. ఈ స్కోర్‌కార్డులు ఆరు నెలల పాటు వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. వీటిని పోస్ట్ లేదా ఈమెయిల్ ద్వారా పంపబోమని, అభ్యర్థులే డౌన్‌లోడ్ చేసుకుని భద్రపరచుకోవాలని బోర్డు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అక్టోబర్ 1న లేదా ఆ తర్వాత ఫైనల్ ఆన్సర్ కీని కూడా విడుదల చేయనున్నారు. అభ్యర్థులు తమ లాగిన్ వివరాలతో ప్రశ్నల ఐడీ, సరైన సమాధానం, తాము గుర్తించిన సమాధానం వంటి వివరాలను చూసుకోవచ్చు. కటాఫ్ మార్కులు సాధించినంత మాత్రాన సీటు గ్యారెంటీ కాదని, కౌన్సెలింగ్ సమయంలో అర్హత ప్రమాణాలను బట్టి అడ్మిషన్ ఖరారు అవుతుందని బోర్డు స్పష్టం చేసింది. 720 మార్కులకుగానూ 641 సాధించిన క్యాండిడేట్‌కు ఆల్ ఇండియా నంబర్ 1 ర్యాంక్ వచ్చింది. వ్యక్తిగత స్కోర్ కార్డులు అక్టోబర్ 1న విడుదల కానున్నాయి. జనరల్, ఈడబ్ల్యుఎస్‌కు 262, ఎస్‌సి, ఎస్టీ, ఓబిసిలకు 226 మార్కులు కటాఫ్‌గా నిర్ణయించారు. ఈ ఏడాది ఆగస్టు 30న జరిగిన పరీక్షకు 2.6లక్షల మంది హాజరయ్యారు.



జూరాలకు ప్రారంభమైన ఇన్‌ఫ్లో

## జూరాలకు 4,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

### కాల్వల ద్వారా దిగువకు నీటి విడుదల

**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా వరప్రదాయని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద ప్రారంభమైంది. కర్ణాటక ప్రభుత్వం మూడు టీఎంసీల నీటి విడుదలకు ఓకే చెప్పడంతో జూరాల ఆయకట్టు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జూరాల కుడి కుడి కాలువకు 800 క్యూసెక్కులు,ఎడమ కాల్వకు 600 క్యూసెక్కులు, సమాంతర కాలువకు 700 క్యూసెక్కులతో పాటు బీమా లిఫ్ట్ 1కు 1300 క్యూసెక్కులు, బీమా లిఫ్టు 2 ద్వారా 750 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 4000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో నమోదు కాగా, అవుట్ ఫ్లో 5286 క్యూసెక్కులు అయినట్లు అధికారులు తెలిపారు. జూరాల పూర్తి సామర్థ్యం 9.657 టీఎంసీలకు గాను ప్రస్తుతం 9.398 టిఎంసిలు నిల్వ ఉన్నట్లు తెలిపారు. కర్ణాటకలోని ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పోటెత్తింది. ఎగువన భారీ వర్షాలు కురవడంతో ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పెరుగుతున్నది. గురువారం ఆర్డీఎస్ ఆనకట్టకు ఇన్ ఫ్లో 12,233 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, ఆర్డీఎస్ ఆనకట్ట 9.2 అడుగులకు చేరుకున్నది. ఆర్డీఎస్ ప్రధాన కాల్వకు 650 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తుంగ భద్ర నది, ఆర్డీఎస్ ఆనకట్టకు వరద పోటెత్తడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## భారీ వర్షాలతో విమానాల దారిమళ్లింపు

**హైదరాబాద్ (శంషాబాద్), సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్‌లో భారీ వర్షాలు, ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పలు విమానాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. విశాఖపట్నం నుంచి విజయవాడ వెళ్లాల్సిన ఇండిగో విమానాన్ని శంషాబాద్ విమానాశ్రయానికి దారి మళ్లించారు. అలాగే హైదరాబాద్ నుంచి రాజమండ్రి వెళ్లాల్సిన స్టార్ ఎయిర్‌లైన్స్ విమానాన్ని బెంగళూరుకు మళ్లించారు. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా లేకపోవడంతో మరికొన్ని విమానాలు రద్దైనట్లు సమాచారం. ప్రయాణికులు విమానాశ్రయాలకు బయలుదేరే ముందు తమ విమానాల రాకపోకల స్థితిగతులను సంబంధిత ఎయిర్‌లైన్స్ అధికారిక మార్గాల్లో ముందుగానే తెలుసుకోవాలని విమానాశ్రయ అధికారులు సూచించారు.

## రాజ్‌కసిరెడ్డి, వాసుదేవరెడ్డికి ఇడి స్పెషల్‌కోర్టు బెయిల్

### ఎపి లిక్కర్ స్కాంలో కీలక పరిణామం

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కాం కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఈడీ అధికారులు అరెస్టు చేసిన రాజ్ కసిరెడ్డి, వాసుదేవ రెడ్డిలకు నాంపల్లిలోని ఈడీ స్పెషల్ కోర్టు గురువారం నాడు షరతులతో కూడిన బె యిల్ మంజూరు చేసింది. ప్రస్తుత వీరిద్దరు చంచల్‌గూడ జైల్లో రిమాడులో వుండడం తెలిసిందే. బెయిల్‌పై విడుదల అయిన తరువాత రాజ్ కసిరెడ్డి, వాసుదేవరెడ్డి విదేశాలకు వెళ్లరాదని, పాస్‌పోర్టులు అధికారులకు అప్పగించాలని షరతులు విధించింది. దీంతో పాటు సాక్షులను ప్రభావితం చేయరాదని, తలా లక్ష రూపాయల పూచీకత్తులు చెల్లించాలని కోర్టు పేర్కొంది. దర్యాప్తు అధికారులకు సహకరించాలని, విచారణకు పిలిచినపుడు రావాలని ఆదేశించింది. కాగా బెయిల్ ప్రక్రియ గురువారం నాడు పూర్తి కాకపోవడంతో శుక్రవారం వీరిద్దరు చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యే వీలుంది.

## శ్రీశైలం వెళ్తున్న ప్రైవేటుబస్సులో అగ్నిప్రమాదం

### సకాలంలో స్పందించడంతో తప్పిన ప్రాణనష్టం

### డ్రైవర్‌సహా 39 మంది ప్రయాణికులు క్షేమం

### ప్రమాద కారణాలపై జరుగుతున్న దర్యాప్తు

**హైదరాబాద్ (సరూర్‌నగర్), సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** గణేశ నిమజ్జనం, మల్లన్న స్వామి దర్శనార్థం భక్తులతో శ్రీశైలం వెళ్తున్న ఒక ప్రైవేటు బస్సు అగ్ని ప్రమాదానికి గురైంది. ఓ పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డు పక్కనే ఆగి ఉన్న సమయంలో ఒక్కసారిగా మంటలు రావడంతో గమనించిన డ్రైవర్ అప్రమత్తం చేయడంతో ప్రయాణికులందరూ




ప్రమాదంలో పూర్తిగా కాలిపోయిన బస్సు

దిగిపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనలో కేవలం బస్సు దహనం మినహా ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటన బుధవారం అర్ధరాత్రి దాటిన సమయంలో హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ కిందకు వచ్చే మీర్‌పేట్ పిఎస్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలిలా ఉన్నాయి. నాగోల్ ప్రాంతానికి చెందిన ఓ రియల్ ఎస్టేట్ సంస్థకు సంబంధించిన దాదాపు 150 మంది గణేష్ విగ్రహ నిమజ్జనం, మల్లన్న స్వామి దర్శనం కోసం శ్రీశైలంకు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత మూడు బస్సుల్లో బయలు దేరారు. అయితే కర్మన్‌ఘాట్ హనుమాన్ టెంపుల్ సమీపంలో ఉన్న బంకులో డీజిల్ పోయించడానికి రెండు బస్సులు లోనికి వెళ్లగా 39 మందితో నిండి ఉన్న టిఎస్ 15 టి 8558 నెంబర్ గల బస్సు అక్కడే రోడ్డు పక్కన ఆగింది. అదే సమయంలో ఒక్క సారిగా ఇంజన్ భాగం నుండి పొగలు వ్యాపిస్తూ మంటల రావడాన్ని గమనించిన డ్రైవర్ ప్రయాణికులను అప్రమత్తం చేశాడు. ఈ నేపథ్యంలో అందరూ బస్సు నుండి దిగిపోయారు. ఆ తర్వాత కొద్ది సేపటికే బస్సుకు పూర్తిగా మంటలు వ్యాపించాయి. ఈ మేరకు సమాచారం అందడంతో ఫైర్ స్టేషన్ సిబ్బంది ఘటనా ప్రాంతానికి చేరుకొని మంటలనార్పారు. అప్పటికే మంటల ధాటికి బస్సు దాదాపుగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న మీర్‌పేట్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. సంఘటనా ప్రాంతానికి వచ్చిన మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ శోభన్ బస్సు ప్రమాదం గురించి విచారణ జరిపారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# పార్లమెంటు 'ప్రత్యేక సెషన్'కు ఎన్డీయే కసరత్తు

### డీలిమిటేషన్, మహిళా బిల్లులే కీలకం

### ఇంకా ప్రోరోగ్‌కాని పార్లమెంటు సమావేశాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** జాతీయ రాజకీయాల్లో కొత్త సమీకరణాలు. బీజేపీ నాయకత్వం రూటు మార్చింది. ఢిల్లీలో జెన్ జీ ఉద్యమం తరువాత పంథాలో మార్పు చేసుకుంది. దూకుడు కంటే అందరినీ కలుపుకొని వెళ్లే ప్రణాళికలను అమలు చేస్తోంది. అందులో భాగంగా డీలిమిటేషన్ వ్యవహారంలో కొత్త వ్యూహాన్ని సిద్దం చేసింది. ఎన్డీఏలోకి నయా మిత్రులు చేరేందుకు రంగం సిద్ధం అయింది. మోడీ 4.0 టార్గెట్ గా పావులు కదుపుతోంది. అందులో తెర వెనుక రాజకీయమే డిసైడింగ్ ఫ్యాక్టర్ గా మారుతోంది. బీజేపీ నాయకత్వం వ్యూహాలు విపక్షాలకు అంతు చిక్కటం లేదు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు వాయిదా పడి 40 రోజులు పూర్తయింది. ఇప్పటి వరకు ప్రోరోగ్ చేయలేదు. మహిళా రిజర్వేషన్ డీలిమిటేషన్ బిల్లును మరోసారి ప్రవేశ పెట్టేందుకే సమావేశాలను ప్రోరోగ్ చేయలేదన్న వాదనలు వస్తున్నాయి. అటు కాంగ్రెస్ సైతం ఇదే అంశాన్ని ప్రశ్నిస్తోంది. మహిళా రిజర్వే షన్లకు తాము మద్దతు ఇస్తామని చెబుతూనే డీలిమిటేషన్ కు మాత్రం మద్దతు ఇచ్చేది లేదని తేల్చి చెబుతోంది. 25 యేళ్లపాటు మార్పులు చేయ వద్దని ప్రధానికి లేఖ రాసింది. కాలం గడుస్తున్న కొద్దీ డీలిమిటేషన్ వ్యవహారంలో కాంగ్రెస్ కూటమిలో స్వరం మారుతోంది. కాంగ్రెస్ కు అను కూలంగా ఉన్న ప్రధాన పార్టీలు తమ వాదనల్లో మినహాయింపులు ఇస్తున్నాయి. బీజేపీ నాయకత్వం లెక్కలు మాత్రం వేరుగా ఉన్నాయి. ఢిల్లీలో జెన్ జీ ఉద్యమం తరువాత ఎన్డీఏ మిత్రపక్షాలు సైతం ఉలిక్కి పడ్డాయి. తిరుగులేని నేతగా ప్రచారంలో ఉన్న మోడీ వీరి దెబ్బకు ధర్మేంద్ర ప్రధాన్ తో రాజీనామా చేయించటంతో ఒక్క సారిగా మోడీ నాయకత్వం పైన చర్చ మొదలైంది. ఎన్డీఏ మిత్రపక్షాలతో పాటుగా ఇతర పార్టీల్లో కనిపిస్తున్న మార్పు పైన బీజేపీ నాయకత్వం ఫోకస్ చేసింది. త్వరలో పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అందు లో ఉత్తర ప్రదేశ్ ఎన్నికలు బీజేపీకి ప్రతిష్ఠాత్మకంగా మారుతున్నాయి. పంజాబ్, ఉత్తరాఖండ్ ఆ తరువాత గుజరాత్ ఎన్నికల్లోనూ బీజేపీ గెలవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక.. బీజేపీ అసలు లక్ష్యం మోడీ 4.0 గా మారింది. తమిళనాడులో మారిన రాజకీయ సమీకరణాలతో ఇప్పటికే డీఎంకే అటు కాంగ్రెస్ కు దూరంగా జరిగింది. ఇక డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు కావాలంటే దక్షిణాది రాష్ట్రాల సీట్ల వాటా ఏమాత్రం తగ్గకుండా పాత నిష్పత్తినే కొనసాగించాలనే ప్రతిపాదనపై కట్టుబడి ఉండాలని సూచిస్తోంది. బిల్లును ఆమోదించే ముందే ప్రతి రాష్ట్రానికి కేటాయించబోయే సీట్ల సంఖ్యతో కూడిన స్పష్టమైన షెడ్యూల్‌ను బిల్లులో స్పష్టం చేయాలని డిమాండ్ చేస్తోంది. దీంతో, కేంద్రం సైతం ఆ దిశగా తుది కసరత్తు చేస్తోంది. అయినప్పటికీ డీఎంకే ఈ బిల్లులో మద్దతు విషయంలో కొంత డైలమాలో ఉందనే విషయం స్పష్టం అవుతోంది. ఇక టీఎంసీ, ఎన్సీపీ, శివసేన చీలక ఎంపీల మద్దతుతో ఈ బిల్లును పాస్ అయ్యే అవకాశం కనిపిస్తోంది. కాగా, ఈ డీలిమిటేషన్ బిల్లు నెగ్గించుకోవాలంటే కేంద్రానికి మూడింట రెండు వంతుల మెజారిటీకి 360 ఓట్లు కావాల్సి ఉంటుంది.

కొత్త మిత్రుల మద్దతుతో డీఎంకేకు చెందిన 22 మంది సభ్యులు ఈ బిల్లుకు అనుకూలంగా ఓటు వేస్తే, ప్రభుత్వ బలం 346కు చేరుతుంది. అయినా ఇంకా కేంద్రానికి 14 మంది ఎంపీల మద్దతు అవసరం. ఈ సంఖ్య సమస్య కాదని బీజేపీ భావిస్తోంది. అదే విధంగా రాజ్యసభలో మాత్రం కేంద్రానికి మూడింట రెండు వంతుల మెజారిటీ లభించే అవకాశం ఉంది. రాజ్యసభలో ఓటింగ్ సమయంలో మొత్తం 244 మంది సభ్యులు హాజరైతే, ప్రభుత్వానికి 164 ఓట్లు కావాలి. ప్రస్తుతం ఎన్డీయేకు 158 మంది ఎంపీల బలం ఉంది. ప్రస్తుతం ఖాళీ కానున్న 12 స్థానాలకు ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. ఇందులో ఉత్తరప్రదేశ్‌లో 10, ఉత్తరాఖండ్, బెంగాల్ లో ఒక్కో స్థానానికి ఎన్నిక జరుగతుంది. వీటిల్లో పది స్థానాలు బీజేపీ గెలిచే అవకాశం ఉంది. ఈ లెక్కలు టార్గెట్ 2029 దిశగా బీజేపీ డీలిమిటేషన్ బిల్లులో అమలు చేస్తున్న కొత్త వ్యూహాలతో నవరాత్రుల వేళ పార్లమెంట్ సమావేశాలకు ప్లాన్ చేస్తోంది. దీంతో బీజేపీ వ్యూహాలు ఎంత వరకు ఫలిస్తాయనేది ఇప్పుడు ఆసక్తి కరంగా మారుతోంది.

## అప్పర్‌భద్రపై తెలంగాణ ప్రతిపాదనలు పరిగణనలోకి తీసుకోని సుప్రీం

### కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు పరిధిలేని అప్పర్‌భద్రపై విచారణాంశాలు ఖరారు

**హైదరాబాద్, సెప్టెంబరు 24.ప్రభాతవార్త:** కర్ణాటక ప్రభుత్వం చేపట్టిన అప్పర్ భద్ర ప్రాజెక్టుకు వివాదంపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సుప్రీంకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ దాఖలు చేసినా తెలంగాణ ప్రతిపాదనను ధర్మా సనం పరిగణనలోకి తీసుకోలేదు, అవసరం అనుకుంటే మరో సూట్ దాఖలు చేసుకోవాలని సూచన చేసింది. గురువారం కృష్ణా ట్రిబ్యునల్ అవార్డు పరిధి లేని అప్పర్‌భద్ర నిర్మాణంపై సుప్రీంకోర్టు తదుపరి చేపట్టాల్సిన విచారణాంశాలు ఖరారయ్యాయి. ఏడు అంశాలపై విచారణ జరపాలని సుప్రీంకోర్టుకు ఆంధ్రప్రదేశ్, కర్ణాటక ప్రతిపాదించాయి.

గతంలో సుప్రీం సూచనకు అనుగుణంగా ముసాయిదా అంశాలను రెండు రాష్ట్రాలు సమర్పించాయి. కర్ణాటక ప్రభుత్వం తుంగభద్ర నదిపై నిర్మిస్తున్న అప్పర్ భద్ర ప్రాజెక్టు ), అలాగే దానికి కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించడంపై తెలంగాణ వాదులు, రాజకీయ నేతలు ఇరిగేషన్ నిపుణులు తీవ్రంగా అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా మైనర్ ఇరిగేషన్ సేవింగ్స్ తెలంగాణ అభ్యంతరం తెలుపుతోంది.

అదే విధంగా ఆంధ్రప్రదేశ్ గోదావరి నీటిని పోలవరం నుంచి డైవర్షన్ చేస్తున్న దృష్ట్యా 21టిఎంసిలు నీటిని కర్నాటక క్లైం చేసుకొంటుంది. కృష్ణా నది ఉపనది అయిన తుంగభద్రపై ఎగువన కర్ణాటక ఈ ప్రాజెక్టు ద్వారా నీటిని మళ్లిస్తే దిగువన ఉన్న తెలంగాణకు ముఖ్యంగా కృష్ణా బేసిన్‌లోని ప్రాజె క్టులకు నీటి ప్రవాహం భారీగా తగ్గిపోతుందని తెలంగాణ వాదుల ఆందోళన. శ్రీశైలం రిజర్వా యర్‌తోపాటు తెలంగాణలోని దక్షిణ జిల్లాల సాగునీటి అవసరాలు దెబ్బతింటాయని తెలంగాణ నుంచి అభ్యంతరం వ్యక్తం అవుతోంది. తుంగభద్ర నదిపై ఆధారపడిన రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఎగువన అప్పర్ భద్ర ద్వారా కర్ణాటక నీటిని తరలిస్తే, ఇప్పటికే ఆర్డీఎస్ కింద తమ కోటాను పూర్తిగా వాడుకోలేకపోతున్న తెలంగాణ రైతులకు భవిష్యత్తులో తీవ్ర అన్యాయం జరుగుతుందని భయపడుతున్నారు. జోగులాంబ గద్వాల జిల్లా రైతులకు ఇది పూర్తిగా సాగునీటి కటకటకతీసుకొస్తుంది. బ్రిజేష్ కుమార్ కృష్ణా జలాల వివాదాల ట్రిబ్యునల్ తుంగభద్ర సబ్ బేసిన్‌లో చేసిన కేటాయింపులపై సుప్రీంకోర్టులో ప్రత్యేక లీవ్ పిటిషన్లలో తెలంగాణ ప్రతిపాదనలు తీసుకోలేదు. సమగ్రమైన సమీక్షలు లేకుండా, వివాదాలు తేలకుండానే కేంద్ర జల సంఘం అప్పర్ భద్రకు అనుమతులు మంజూరు చేయడం చట్టవిరుద్ధమని తెలంగాణ సాగునీటి రంగానికి చెందిన నిపుణులు వాదనలు మరో సూట్‌లో సుప్రీం కోర్టు సూచించినట్లు దాఖలు చేయడానికి ప్రభుత్వం పూనుకోవాల్సి ఉంటుంది.

## దానం నాగేందర్‌పై అనర్హత వేటు

### ప్రజాస్వామ్య విజయం : ఎంపి డికె అరుణ



**మహబూబ్‌నగర్ బ్యూరో, సెప్టెంబరు 24, ప్రభాతవార్త :** ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ సభ్యత్వాన్ని రద్దు చేస్తూ తెలంగాణ హైకోర్టు చారిత్రాత్మక ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ సుప్రీంకోర్టు వెలువరించిన నిర్ణయం ప్రజాస్వామ్య విజయమని తమిళనాడు బీజేపీ సహ ఇంచార్జ్ ఎంపీ డీకే అరుణ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యానికి, పార్టీ ఫిరాయింపులు గొడ్డలిపెట్టు అని, రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు సాగించిన అనైతిక రాజకీయాలకు ఈ తీర్పు చెంపపెట్టు అని హర్షం వ్యక్తం చేశారు. రాజీనామా చేయకుండా వ్యక్తిగత, స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి, ఎంపీగా పోటీ చేయడం తీవ్రమైన రాజ్యాంగ ఉల్లంఘనని, ఇది దిగజారుడు, దివాలాకోరు రాజకీయాలకు నిదర్శనమని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభు త్వం ఫిరాయింపుల రాజకీయలను పక్కనబెట్టి, పార్టీ ఫిరాయించిన పది మంది ఎమ్మెల్యేల నియోజకవర్గ ప్రజలను సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణలు కోరి, ఎమ్మెల్యేలతో రాజీనామాలు చేయించాలని ఎంపీ డీకే అరుణ డిమాండ్ చేశారు.

## సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి చెంపపెట్టు: హరీశ్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** దానం నాగేందర్ ఎమ్మెల్యే పదవికి అనర్హుడిగా ప్రకటిస్తూ జారీ చేసిన తెలంగాణ హైకోర్టు ఆదేశాలను సుప్రీంకోర్టు సమర్థించింది. సుప్రీంకోర్టు తీర్పును బీఆర్ఎస్ నేతలు స్వాగతిస్తున్నారు. దీనిపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు స్పందించారు. గురువారం ఆయన తన ఎక్స్ ఖాతా వేదికగా స్పందిస్తూ.. దానం నాగేందర్ అనర్హతపై సుప్రీంకోర్టు తీర్పు కాంగ్రెస్ ద్వంద్వ వైఖరికి చెంపపెట్టు. దానం నాగేందర్ అనర్హతను సమర్థిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు.. రాజ్యాంగ పరిరక్షణ గురించి పదే పదే మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ ద్వంద్వ వైఖరిని ప్రశ్నిస్తోంది రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా సంవిధాన్ బచావో అంటూ రాజ్యాంగ పరిరక్షణ గురించి మాట్లాడుతున్నారు. ఇప్పుడు ఆ మాటలను ఆచరణలో చూపించాల్సిన సమయం వచ్చింది. రాజ్యాంగంపై రాహుల్ గాంధీకి నిజమైన నిబద్ధత ఉంటే.. కాంగ్రెస్‌లోకి పార్టీ ఫిరాయించిన మిగతా ఎమ్మెల్యేలతో కూడా రాజీనామా చేయించి, ప్రజల తీర్పు కోరాలని ఆయన డిమాండ్ చేయాలి, ఢిల్లీలో రాజ్యాంగ నైతికత గురించి మాట్లాడుతున్న రాహుల్ గాంధీ.. తెలంగాణలో తమ పార్టీ అనుసరిస్తున్న ఫిరాయింపుల రాజకీయాలపై ఎందుకు మౌనం వహిస్తున్నారు? అని ప్రశ్నించారు. 'సంవిధాన్ బచావో' అనేది కేవలం రాజకీయ నినాదమా? లేక నిజమైన రాజ్యాంగ నిబద్ధతా? రాహుల్ గాంధీ స్పష్టం చేయాలి. పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేలతో రాజీనామా చేయించి, తిరిగి ప్రజాక్షేత్రంలోకి పంపాల్సి అని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత, ఎంపీ రాహుల్ గాంధీకి హరీశ్ రావు స్పష్టం చేశారు.

## గుండెపోటుతో ప్రణయ్ హత్య కేసు ఖైదీ మృతి



అబ్దుల్ బారీ (ఫైల్)

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త :** ఎనిమిదేళ్ల క్రితం తెలుగు రాష్ట్రాల్లో సంచలన సృష్టించిన ప్రణయ్ హత్య కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న అబ్దుల్ బారీ గుండెపోటుతో మృతి చెందాడు. గురువారం చర్లపల్లి జైలు లో తీవ్రఅస్వస్థతకు గురైన బారీ మృత్యువాత పడ్డాడు. అస్వస్థతకు గురైన క్రమంలో అతన్ని గాంధీ హాస్పిటల్‌కు తరలించగా అప్పటికే గుండెపోటుకు గురై మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. నల్గొండలోని ప్యారసాభగ్ కాలనీకి చెందిన అబ్దుల్‌బారీ.. ప్రణయ్ హత్య కేసులో జీవిత ఖైదు అనుభవిస్తున్నాడు. 2025 మార్చిలో నల్గొండ కోర్టు అతనితోపాటు పలువురికి జీవితఖైదు విధించగా, కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్ కుమార్‌శర్మకు మరణశిక్ష విధించింది.

2018 సెప్టెంబరు 14న ప్రణయ్‌కుమార్ హత్యకు గురయ్యాడు. అమృ తను ప్రణయ్ పెళ్లి చేసుకున్న క్రమంలో ఆమె తండ్రి మారుతీరావు.. ప్రణయ్‌ను హత్య చేయించినట్లు ఆరోపలున్నాయి. పోలీస్ చార్జ్‌షీట్‌లోని వివరాల ప్రకారం.. అబ్దుల్‌కరీం, అబ్దుల్ బారీ, అస్ఘర్‌అలీలు కాంట్రాక్ట్ కిల్లర్ సుభాష్‌కుమార్‌శర్మ సాయంతో ప్రణయ్‌ను హత్య చేశారు. దీనికి గాను కోటి రూపాయల వరకూ డీల్ కుదిరినట్లు ఆరోపణలున్నాయి. భార్య అమృతతో కలిసి ఆసుపత్రి నుండి బయటకువస్తున్న ప్రణయ్‌ను శర్మ వెంబడించి కత్తి దాడి చేసి హత్య చేశారు.

**విచారణ జరుగుతుండగానే మారుతీరావు మృతి**

ఈ కేసులో ప్రధాన నిందితుడైన అమృత తండ్రి మారుతీరావు.. 2020 మార్చి 8న హైదరాబాద్ లోని ఖైరతాబాద్ పరిధిలోని గెస్ట్‌హౌస్‌లో ఆత్మహత్య చేసుకున్నారు. ఈ హత్య కేసుకు సంబంధించి విచారణ జరుగుతున్న సమయంలోనే మారుతీరావు ఆత్మహత్య చేసుకోవడం కల కలం రేపింది. ఆ సమయంలో మారుతీరావు రాసిన సూసైడ్ నోటును సైతం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో 2025 తీర్పు వెలువడగా బారీసహా ఆరుగురి నిందితులకు జీవితఖైదు పడగా కాంట్రాక్ట్ కిల్లర్ శర్మకు మరణశిక్ష పడింది. ఇదిలా ఉంచితే, గుజరాత్ మాజీ హోం మంత్రి హరేన్‌పాండ్యా హత్య కేసులో బారీని గతంలో అరెస్టు చేశారు. అయితే, ఆ కేసులో బారీ నిర్దోషిగా విడుదలయ్యారు.

## ఎపి లిక్కర్ స్కాం కేసులో వైసిపి నేత అంబటికి ఇడి నోటీసులు

### నేడు హైదరాబాద్‌లో విచారణకు రావాలని ఆదేశం

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** ఎపిలో సంచలనం రేపిన లిక్కర్ స్కాంలో వైకాపా నేత అంబటి రాంబాబుకు కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరక్టరేట్ గురువారం నాడు నోటీసులు జారీ చేసింది. హైదరాబాద్‌కు చెందిన ఈడీ అధికారులు ఆయనకు ఫోన్ ద్వారా దీ నికి సంబంధించిన సమాచారం అందజేశారు. శుక్రవారం నాడు హైదరా బాద్‌లోని బషీర్‌బాగ్‌లో గల ఈడీ కార్యాలయంలో విచారణకు రావాల ని కోరారు. గుండె సంబంధ వ్యాధితో 15 రోజుల క్రితమే ఆయన స్టెంట్లు వేయించుకోవడం తెలిసిందే. ఇంతకు ముందు ఇచ్చిన నోటీసులకు గానూ అంబటి గురువారం నాడు విచారణకు హాజరు కావాల్సి వుండగా ఆయన రాకపోవడంతో రెండవ దఫా నోటీసులు ఇచ్చారు. ఈడీ నోటీసులకు స్పందించిన రాంబాబు తాను అనారోగ్యంతో బాధపడుతున్నానని, పూర్తిగా కోలుకున్న తరువాత తప్పనిసరిగా విచారణకు వచ్చి సహక రిస్తానని ఈడీ అధికారులకు సమాచారం అందించారు. అంబటి నోటీసులకు ఈడీ ఇంకా స్పందించాల్సి వుంది. కాగా ఇదే కేసులో వైకాపా నా యకులు మగ్రి సుబ్బారెడ్డి, పురుషోత్తం రావుల వాంగ్మూలాలను ఈడీ ఇదివరకే నమోదు చేయడం తెలిసిందే. ఈ స్కాంలో మగ్రి సుబ్బారెడ్డి, పురుషోత్తం రావులు 59.14 కోట్ల రూపాయల మద్యం పెట్టెలను రవాణా చేసినట్లు ఈడీ గుర్తించింది. సిగ్మా అనే సంస్థ నుంచి ఇందుకుగానూ 15.44 కోట్ల రూపాయలను వీరు లంచంగా తీసుకున్నారని ఈడీ తేల్చింది. ఈ స్కాంలో సర్కారు ఖజానాకు 195 కోట్ల రూపాయలు నష్టం వాటిల్లిందని ఈడీ తేల్చగా ఇందులో అంబటి రాంబాబు పాత్రపై నిగ్గు తేల్చేందుకు ఈడీ కసరత్తులు చేస్తోంది.

## వంట నూనెలపై దిగుమతి సుంకం తగ్గింపు

### సన్‌ఫ్లవర్ క్రూడ్ ఆయిల్‌పై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ పూర్తిగా రద్దు

### సోయాబీన్, క్రూడ్ పామాయిల్‌పై సుంకం 10 శాతం నుంచి 5 శాతానికి తగ్గింపు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24 :** దేశీయ వంట నూనెల ధరలను నియంత్రించడం, వినియోగదారులకు ఉపశమనం కల్పించడం, అంతర్జాతీయ మార్కెట్లలో వంట నూనెల ధరల పెరుగుదల కారణంగా ఏర్పడుతున్న ద్రవ్యోల్బణ ఒత్తిడిని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. దిగుమతి చేసుకునే ముడి వంటనూనెలపై బేసిక్ కస్టమ్స్ డ్యూటీ ని తగ్గించింది. క్రూడ్ సన్‌ఫ్లవర్ ఆయిల్‌పై ఉన్న 10 శాతం సుంకాన్ని పూర్తిగా తొలగించింది. ముడి సోయాబీన్ ఆయిల్, క్రూడ్ పామ్ ఆయిల్‌పై ఉన్న 10 శాతం సుంకాన్ని 5 శాతానికి తగ్గించింది. అదే సమయంలో సంబంధిత రిఫైన్డ్ ఎడిబుల్ ఆయిల్స్‌పై కూడా వర్తించే బేసిక్ కస్టమ్స్ డ్యూటీ తగ్గించింది. అయితే క్రూడ్, రిఫైన్డ్ వంట నూనెల మధ్య 19.25 శాతం దిగుమతి సుంకం వ్యత్యాసాన్ని ప్రభుత్వం కొనసాగించింది. అంతర్జాతీయ మార్కెట్లలో వంట నూనెల ధరలు పెరగడం, దాని ప్రభావంతో దేశీయంగా దిగుమతి ఖర్చులు, రిటైల్ ధరలు పెరగడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సుంకాల హేతుబద్ధీకరణ చేపట్టినట్లు ప్రభుత్వం తెలిపింది.

**ఇ-వేలం ప్రకటన**

ఇందుమూలముగా యావన్మంది సాధారణ ప్రజానీకానికి సమాచారం నిమిత్తం ప్రకటించునది ఏమనగా, 2025-26 AMWP క్రింద ఈత కొలను యొక్క ఏర్పాటు నిమిత్తం, సికింద్రాబాద్ MCEME, వివిధ కేటగిరీలలోని 49 నంబర్ల ఆకుపచ్చని నిట్టనిలువు చెట్లను 09.10.2026న ఉ.11.00 గం. వద్ద ఇ-వేలం ద్వారా విక్రయించబడునని తెలియజేయడమైనది. ఆ చెట్లు కాంట్రాక్టర్‌కు 07.10.2026న మరియు 08.10.2026న ఉ.11.00 నుండి సా.17.00 వరకు చూపించబడును. ఉద్దేశం గల బిడ్డర్, స్థానిక మిలిటరీ అథారిటీతో సంప్రదింపుతో (JS ధపోలా, Lt Col, మొబైల్ నం. 9596855229) సదరు చెట్లు మరియు లొకేషన్ తనిఖీ మరియు వీక్షించటానికి అనుమతింపబడతారు. ఇ-వేలంలో పాల్గొనటానికి https://eauction.gov.in/eAuction/app వద్ద ప్రభుత్వ ఇ-వేలం పద్ధతి పోర్టల్ దయచేసి వీక్షించండి.

సం/- డిఫెన్స్ ఎస్టేట్స్ ఆఫీసర్
T & AP సర్కిల్, సికింద్రాబాద్

తెలంగాణ ప్రభుత్వం
కోహీర్ మునిసిపాలిటీ కార్యాలయం, సంగారెడ్డి జిల్లా-T.S
ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్రకటన

టెండర్ ప్రకటన నెం. E1/ /Kohir/e-proc/2026-27 తేది: 24.09.2026

కోహీర్ మునిసిపాలిటీలో వివిధ గ్రాంట్లు/పథకాల క్రింద అభివృద్ధి/నిర్వహణ పనుల కొరకు టెండర్లు పిలువబడుతున్నవి. క్రింద వివరాలు చూపబడినవి. ఆన్‌లైన్ బిడ్స్ దాఖలుకు ముగింపు తేది/సమయం: 05.10.2026 ఉ.10.30ని. వరకు. బిడ్స్ తెరచుట: 05.10.2026 ఉ.11.00గం. వద్ద. సంప్రదించవలసినవారి వివరాలు: ది మునిసిపల్ కమిషనర్, కోహీర్ మునిసిపాలిటీ, సెల్ నం: 8074912180, 7331123024. ఇ-మెయిల్: kohir.mc.@gmail.com. తదుపరి వివరాలు "ఇ" ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ www.tender.telangana.gov.in వద్ద చూడవచ్చును.

సం/-. కమిషనర్, కోహీర్ మునిసిపాలిటీ.

DIPR.NO. 10588-PP/CL/ADVT/1/2026-27 తేది: 24.09.2026

CSIR FOUNDATION DAY

**సియస్ఐఆర్-జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ**

మీ అందరినీ
సియస్ఐఆర్ - ఎన్ జీ ఆర్ ఐ సందర్శన దినోత్సవం
సందర్భంగా సాదరంగా ఆహ్వానిస్తోంది.

26 సెప్టెంబర్ 2026
ఉదయం 10:00 గంటల నుండి సాయంత్రం 3:00 గంటల వరకు
(ప్రవేశం మధ్యాహ్నం 1:30 గంటలకు ముగుస్తుంది)

వివరాలకు సంప్రదించండి:
శాస్త్రీయ ప్రచురణ మరియు ప్రసార సంచాలన శాఖ (SPDD)
040-27012796/27012364

సియస్ఐఆర్ - జాతీయ భూభౌతిక పరిశోధనా సంస్థ
(వైజ్ఞానిక మరియు పారిశ్రామిక పరిశోధనా మండలి)
ఉప్పల్ రోడ్, హైదరాబాద్ - 500 007

ఈ క్రింది వాటిపై మమ్మల్ని అనుసరించండి

www.ngri.res.in | facebook.com/csirngrihyd | twitter.com/csirngri | youtube.com/@csir-ngri/featured

అధిక వివరాల కోసం ఈ-మెయిల్: information.ngri@csir.res.in పై మిమ్మల్ని సంప్రదించండి

వార్త

మార్పు అనేది మనుషులకు సహజగుణం, కొన్నిసార్లు అది ముఖ్యం కూడా.

- షేక్స్పియర్

# కష్టాల 'తీరం' దాటేదెప్పుడు?

విఘ్నేశ్వరుని పెళ్లికి వేయి విఘ్నాలన్న సామెత అక్షరాలా నిజమవడం ఈసారి జనం కళ్లారా చూస్తున్నారు. విఘ్నాలను తొలగించే అధిపతి పెళ్ళికి అన్నీ ఆటంకాలేనా? అనే ధోరణిలో దీన్ని తీసుకోవడం కద్దు. కానీ ఈసారి ఆయన నిమజ్జనానికి నిజంగానే విఘ్నాలు కళ్ళెదుట సాక్షాత్కరిస్తున్నాయి. వాయువ్య బంగాళా ఖాతంలో కొనసాగిన వాయుగుండ ప్రభావంతో కోస్తాంధ్ర అదీ ఉత్తరాంధ్ర జిల్లాలు చిగురుటాకులా వణికిపోతున్నాయి. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో గణేశ్ నిమజ్జనాలు ఎక్కడికక్కడ ఆగిపోయాయి. తుఫాను తాకింది ఉత్తరాంధ్రకే అయినా వర్షప్రభావం ఉభయ తెలుగు రాష్ట్రాల మీద పడింది. నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి వెళ్లిపోయాయనుకున్నా కోస్తా జిల్లాలకు, తెలంగాణ రాష్ట్రానికి తీవ్ర వాయుగుండ ప్రభావంతో రెండు తెలుగు రాష్ట్రాలూ తడిసి ముద్దయ్యాయి. అల్లూరి జిల్లాలో కొండచరియలు విరిగి పడి విధ్వంసం జరిగింది. లక్షలాది ఎకరాల్లో పంటలు పనికిరాకుండా పోయినట్లే. మునుపటి కన్నా మేలుగా కోస్తా జిల్లాలను తాకిన తుఫాను వల్ల మరింత విధ్వంసం జరుగకుండా ప్రభుత్వం ఎంతో అప్రమత్తంగా ఉంది. తొలుత కోస్తా ప్రాంతాలను చూసుకుంటే అక్కడి ప్రభుత్వాలు తమ ఆర్టిజిఎస్ వ్యవస్థల ద్వారా క్షేత్రస్థాయిలో ఏం జరుగుతుందోన్న విషయమై ప్రత్యేక కెమెరాలతో వీక్షించి ఎప్పటికప్పుడు ప్రజల్ని అప్రమత్తం చేయగలిగ్నింది. దీని ప్రభావం గుర్తించి ఉత్తరాంధ్రలో తుఫాను తీరం దాటే సమయానికి భారీనుంచి అతిభారీ వర్షాలు పడ్డాయి. కోస్తా తీరమంతటా భారీ వర్షాలు కురిసాయి. విశాఖపట్నం గోపాల పట్నం మధ్య బుధవారం అర్ధరాత్రికి వాయుగుండం తీరం దాటడంతో ఉత్తర కోస్తా జిల్లాలకు రెడ్ అలర్ట్ హెచ్చరికలు జారీ అయ్యాయి. పలుప్రాంతాల్లో ఈదురు గాలులు బలంగా ఊపందుకొని పెద్ద పెద్ద వృక్షాలు సైతం కిందపడిపోయాయి. ఉత్తరాంధ్రలో 'ఫ్లాష్ ఫ్లడ్ అలర్ట్'కూడా జారీ చేశారు. గతంలో తీసుకోలేకపోయిన జాగ్రత్తలన్నీ తీసుకోగలిగారు. ఆధునిక సాంకేతిక వాతావరణ పరికరాలతో అప్రమత్తమై ఉండి ప్రాణహాని లేకుండా కాపాడటంలో కృతకత్యురాలైంది ప్రభుత్వం. కోస్తాంధ్ర జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు కూడా ప్రకటించడం, సముద్రంలోకి వెళ్లే మత్స్యకారులను నిరోధించడం వంటి అనేక జాగ్రత్తలు తీసుకోవడం చెప్పుకోదగినది. ఈదురుగాలుల సమయంలో పిడుగులు, కొండచరియలు విరిగిపడే ప్రమాదాన్ని వారించడం విశేషం. గతంకన్నా మిన్నగాప్రాణనష్టం లేకుండా వ్యవస్థలను సిద్ధం చేయడం చెప్పుకోవాల్సిన విషయం. హైదరాబాద్లో కూడా గణేశ్ నిమజ్జనాలు మందగించాయి. ఆధ్యాత్మిక శోభ నిండుగా విలసిల్లేహైదరాబాద్ నగరంలో వాడవాడలా, వీధివీధిన దాదాపు ప్రతి గుమ్మంలోనూ గణేశ్ దీవెనలు అందుకుంటూ భక్తులు తాదాత్మం చెందారు. కానీ లోయర్ ట్యాంక్ బండ్లో గణేశ్ నిమజ్జనాలు చూసే అదృష్టం కోల్పోయారు. ఊరంతా ఎక్కడికక్కడ చెరువుల్లో నిమజ్జనాల కోసం ఏర్పాటు చేసినా గత మూడురోజులుగా కుంభవృష్టి కారణంగా నిమజ్జనాలు కాకుండానే పూజా గణపతి విగ్రహాలు కూడా తడిసి ముద్దయ్యాయి .నిమజ్జనాల హడావుడి కనపడక జంటనగరాలు చిన్నబోయాయి. అటుకోస్తాంధ్ర ప్రాంతంలో వాయుగుండం కారణంగా ఇదే మాదిరి విఘ్నాలు ఏర్పడ్డాయి.వరుణదేవుడి కరుణ లేకపోవడం వల్ల నిమజ్జనాలకు ఆటంకమేర్పడి వాన చినుకులు ఆగేవరకు ఎదురు చూడడం ఈ యేడాది సరికొత్త విఘ్న వింత. పలు జిల్లాల్లో వరదలకు, వాగులు వంకలు, చెరువులు, పొంగిపొర్లుతున్నాయి. దీంతో అనేక ప్రాంతాల్లో జనజీవనం పూర్తిగా స్తంభించిపోయింది. తీవ్ర వాయుగుండం బుధవారం రాత్రి 11 గంటల తర్వాత కళింగ పట్నం సమీపంలో తీరందాటింది. ఇదే సమయంలో పాడుపడిన భవనాలు,పూరిల్లు, వర్షానికి నాని పడిపోయే ప్రమాదం ఉంది.విద్యుత్తు స్తంభాలు, వైర్లు మీద పడి ఇటు బాపట్లలో,అటు నర్సీపట్నంలో చెరో ఇద్దరూ మృతి చెందడంతో విషాదం మూట కట్టుక్నొంది. తీరాన్ని దాటినా దాని ప్రభావం భూభాగంపై ఎక్కువగాఉంటుందని అంచనాలతో ప్రభుత్వం ఖిఅలెర్ట్ఖిగా ఉంది. అల్లూరి సీతా రామ రాజు,ఏలూరు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలుకురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ముందస్తు హెచ్చరికల కారణంగా ఆ ప్రాంత రైతాంగం తమ పంటలను కాపాడుకోవాలనే ఆతృతతో ఆందోళన పడుతున్నారు. తెలుగు రాష్ట్రాల వ్యాప్తంగా వర్షప్రభావానికి విద్యుత్ స్తం భాలు, చెట్లు నేలకూలాయి. శ్రీకాకుళం జిల్లాలోని వంశధార, నాగావళి, బహుదా నదుల్లో నీటి ఉధృతి పెరుగుతూనే ఉంది. సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో బంగాళాఖాతంలో తుఫానులు రావడం సహజం. ఎల్నినో ఒక రకమైన దెబ్బతీస్తే, మరో పక్క తుఫానులు రైతాంగాన్ని చాచి కొడుతోంది. పంట చేతికొచ్చే సమయంలో తుఫాను దెబ్బతో రైతు నిండా నీరైపోయాడు. ఎల్నినో దుష్ప్రభావాలను ఎలా తట్టుకోవాలో తెలుసుకునేలోగానే తుఫాను విరుచుకుపడింది. ప్రభుత్వాలు పంటనష్టం లెక్కించే విధానంలో అది ఎల్నినో నష్టమో, తుఫాను నష్టమా అనే మీమాంసలో పడకుండా రైతుకు మేలు చేసేవిధంగా ప్రభుత్వ నిర్దిష్ట విధానాలను రూపొం దించాలి. ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న పంటలపై నష్టం ఎక్కువగా ఉంది. ఒకవేళ అధిక విస్తీర్ణంలో ప్రత్యామ్నాయ పంటలను వేసి ఉన్నా అవి నీటమునిగి నష్టం తెచ్చేవి. ప్రస్తుత తుఫాన్ రైతును ఆగం చేసిందని అర్థమయ్యేసరికి ఇప్పుడే అర్థమైంది. పటిష్టంగా వంటల బీమాను నమ్ముకున్న రైతుకు ఎంతో కొంత ప్రయోజనం కలిగించేలా ప్రభుత్వాలు ఆదుకోవాలి. ప్రభావిత జిల్లాల్లో వర్షాల రీత్యా రవాణా స్తంభించింది. బస్సులు, రైళ్లు, విమాన సర్వీసులు ఆలస్యంగా గమ్యస్థానం చేరుకుంటున్నాయి. తుఫాను నుండి బయటపడ్డాక బాధితులకు తగిన విధంగా మేలు చేయాల్సిన బాధ్యత ప్రభుత్వ తక్షణ కర్తవ్యం.



భాష ఎలక్ట్రిక్ బల్బ్లోని ఫిలమెంట్లాగా ప్రజ్వలిస్తుంది. కాని మౌనం తీగలో ప్రవహించే విద్యుత్ ప్రవాహం వంటిది.

రమణ మహర్షి



భగవంతుడు బంధువులను ఇస్తాడు కాని, మిత్రులను ఎన్నుకునే అవకాశం మనకే ఇచ్చాడు.

నేతాజీ

# ప్రజావాక్కు



## పార్టీ ఫిరాయింపులెందుకో?

పదవి కోసం ఒక రాజకీయ పార్టీలోచేరి పదవులను అనుభవించిన తరువాత ఆ పార్టీ ప్రభుత్వం పడిపోతే పార్టీ మారి అక్కడ పదవులు పొంది పార్టీ మారకుండా మరో కొత్త పార్టీ నుంచి పోటీ చేయడం మనసేలా ఒప్పుతుందో మన రాజకీయ నాయకులకు? ఇంతకూ వారికి కావలసిందేమిటంటే పదవి ముఖ్యం ఏపార్టీ అయినా.సర్ విన్‌స్టన్ చర్చిల్ ఏమన్నారంటే కొందరు రాజకీయులు పార్టీకోసం ప్రిన్సిపల్స్‌ను వదిలేస్తే ఇంకొందరు ప్రిన్సిపల్స్ కోసం పార్టీలు మారుతుంటారు. మరింతమంది పార్టీని, ప్రిన్సిపల్స్‌ను తుంగలో తొక్కి కేవలం పదవుల కోసమే జంప్ జిలానీలవుతుంటారు. ఈ మూడవ సూత్రం మన దేశ రాజకీయ నాయకులకు వర్తిస్తుందని చెప్పాలనిపిస్తుంది.

- డా. ఎన్.ఎస్.ఆర్. మూర్తి, సికింద్రాబాద్

## తగ్గుతున్న విద్యార్థులు

గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఫ్రీడమ్ స్కూల్ విద్యార్థుల నమోదు శాతం,హాజరు శాతం తక్కువగా ఉంది.మారుమూల గిరిజన ప్రాంతాల నుండి వచ్చి ఇప్పుడిప్పుడే విద్యను అభ్యసిస్తున్నారు.భాష,వేషధారణ, సంస్కృతి, సాంప్రదాయాలలో మార్పు రావడం లేదు. వారి విద్యా అభివృద్ధికి గాను టీచింగ్ సిబ్బంది నిత్యం కృషి చేస్తున్నారు. ఫ్రీడమ్ స్కూల్ విద్యార్థులు ఉత్తీర్ణులు కాకపోయినా కూడాఎలాంటి నిబంధనలను విద్యార్థులపై కానీ టీచింగ్ సిబ్బందిపై గాని ఒత్తిడి వద్దు.ఇలాంటి వారి విద్యాభివృద్ధికి గాను ప్రభుత్వం తగిన వసతి కల్పించాలి. గిరిజన విద్యార్థులను ఉత్తమమైన విద్యావంతులుగా భవిష్యత్తులోఉద్యోగులుగా తీర్చిదిద్దడం కోసం ప్రణాళిక రూపొందించాలి. గిరిజన ఫ్రీడంస్కూల్ విద్యాసంస్థలపై ప్రభుత్వం ప్రత్యేకమైన పరిశోధనలు సలహాలు సూచనలనువారికి బోధించే టీచింగ్‌సిబ్బంది ద్వారా స్వీకరించాలి.

- కదురు శ్రీనివాస్, వరంగల్

## భవిష్యత్‌లో కలిసికట్టుగా ఉండాలి

దాదాపు పన్నెండు రోజుల పాటు గ్రామాలలో కాలనీలు గానివార్డులు గానీ ప్రజలు కలిసికట్టుగా ఒకదాటిపైకి చేరి వినాయక ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. కేవలం పండుగలప్పుడు మాత్రమే కాకుండా భవిష్యత్‌లో అత్యవసరమైన పరిస్థితుల్లో కూడా వార్డుప్రజలంతా రాజకీయాలకు అతీతంగా ఒకే మాటపై నిలబడి వార్డులోని అన్ని కుటుంబాలకుతమ వంతుగా చేయుతానందించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

## పరిశ్రమలకు అనుగుణంగా పాఠ్యాంశాలు

భారత ఉద్యోగ మార్కెట్‌లో సాంకేతిక పరిజ్ఞానం వేగంగా మారుతున్న కొద్దీ నైపుణ్యాల విలువ కూడా మారుతున్నాయి. కృత్రిమ మేధస్సు ఆధారిత ఉద్యోగాల్లో వేతన వృద్ధి వేగంగా ఉండగా, కొన్ని సంప్రదాయ సాంకేతిక ఉద్యోగాల్లో వేతనాల పెరుగుదల మందగించడం ఈ మార్పుకు సంకేతం. ఇది కేవలం వేతనాల అంశం కాదు. విద్యార్థులు, ఉద్యోగులు భవిష్యత్ ఉద్యోగ మార్కెట్‌కు ఎంతవరకు సిద్ధంగా ఉన్నారనే ప్రశ్నను కూడా ముందుకు తెస్తోంది. కృత్రిమ మేధస్సుతో పాటు సైబర్ భద్రత, అర్థవాహక చిప్పులు, సమాచార సాంకేతికత వంటి రంగాల్లో నైపుణ్యాలకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా అనుభవంతో పాటు ప్రత్యేక నైపుణ్యం, సమస్య పరిష్కార సామర్థ్యం, కొత్త సాంకేతికతలను నేర్చుకునే సన్నద్ధత వేతనాలను నిర్ణయించే ప్రధాన అంశాలుగా మారుతున్నాయి.పరిశ్రమ అవసరాలకు అను గుణంగా పాఠ్యాంశాలను నవీకరించడంతో పాటు, ఏఐశిక్షణ, ప్రాజెక్టులు, పరిశ్రమలతో కలిసి ఇంటర్న్‌షిప్‌లు అందించాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## ఎల్‌నినో గురించి ఆలోచించండి

ఇప్పుడు అనవసర విషయాలు పతాక శీర్షికలుగా మారిపోతున్నాయి ఏమో అనిపిస్తుంది. వందేమాతరం పాడడం, మతం లాంటివి పతాక శీర్షికలు కావడం విచారం. సూపర్ ఎల్‌నీనో లాంటి అంశాలు పతాక శీర్షికలు కావాలి. వాటిని ఎలా ఎదురు కోవాలి అనేది పతాక శీర్షిక కావాలి. తెలంగాణ ప్రభుత్వం తెచ్చిన జలసిరి కార్యక్రమం అమలు గురించి పతాక శీర్షిక కావాలి. దక్షి ణ భారతంలో విలయ ప్రళయం చేస్తున్న నీటి కరవు వాటిని ఎదుర్కొనే పరిస్థితుల గురించి పతాక శీర్షికలు కావలి. భారత దేశంలో కురిసే వర్షపాతం 4000 బీఎంసీ అంటే 140000 టిఎంసి వాటిలో కొంత ఆవిరి అయినా నిక రంగా ఉండే నీరు 100000 టిఎంసి దానిలో నదుల ద్వారా సజీవంగా ఉండే నీరు 70000 టిఎంసి.

- భారత అవినాష్, జనగామ

## ఆశకు అంతం లేదా?

ఆశకు అంతంలేదంటారు.దురాశ దుఃఖానికి చేటుఅని చదువుకున్నాం. మానవుడి జీవితంలో కీలకపాత్ర పోషించే ఆశమితంగా ఉండాలంటారు. మనిషి ఉల్లాసంగా ఉండడానికి ఆశ కూడా ఒకకారణం.మంచి కన్న మనీకే మక్కువ ఎక్కువ. ప్రతి మనిషి జీవితంలో ఆశనిరాశల మధ్యఊగిసలాడే సందర్భాలు అనేకం. శ్రమ, పట్టుదలతో కోరికలను సొంతం చేసుకోవచ్చు.

- ఆర్. వెంకటేష్ చరన్, బెంగళూరు

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి.. ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్ (e-mail: editpage@vaartha.com)

# డ్రగ్స్ రహిత సమాజాన్ని చూడలేమా?

**డ్రగ్స్ రహిత భారత్ విజయాన్ని కొలిచే ప్రమాణాలు కూడా మారాలి. స్వాధీనం, అరెస్టులు, కేసులు, శిక్షలు అవసరమైన గణాంకాలే. కానీ వాటితో పాటు కొత్త వినియోగదారుల సంఖ్య, ముందస్తుగా గుర్తించిన కేసులు, చికిత్స తర్వాత కోలుకున్నవారి స్థితి, పునరావాసం, డ్రగ్స్ సంబంధిత ప్రమాదాలు వంటి అంశాలనూ కొలవాలి. ఎన్‌సీబీ,రాష్ట్ర పోలీసు, ఆరోగ్యం, విద్య, ఔషధ నియంత్రణ, రహదారి భద్రతా సంస్థలు తమ తమ పరిధిలో కాకుండా ఒకే సమస్యకు వేర్వేరు కోణాలుగా పనిచేసే వ్యవస్థ అవసరం. అంతిమంగా ప్రశ్న భారత్ ఎంత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది? అన్నదానికే పరిమితం కాకూడదు. డ్రగ్స్ వల్ల జరగాల్సిన నష్టంలో ఎంత భాగాన్ని భారత్ నివారించింది?' అన్నదే అసలు ప్రమాణంగా మారాలి. కొత్తగా వ్యసనానికి గురయ్యే వారిని తగ్గించడం, యువత చదువును కాపాడటం, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, చికిత్స పొందినవారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం ఇవే డ్రగ్స్ రహిత భారత్ సాధనకు నిజమైన సూచికలు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ పరిమాణం ప్రభుత్వ చర్యను చూపిస్తుంది. నివారించిన నష్టం ఆ చర్య ఫలితాన్ని చూపిస్తుంది.**

దుంగ జయరాం

భారత్‌లో మాదకద్రవ్యాల నియంత్రణ చర్యలు వేగం పుంజుకున్నాయి. 2025లో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) 1,33,965 కిలోల మాదకద్రవ్యాలను స్వాధీనం చేసుకుంది. వాటి విలువ దాదాపు రూ.1,980 కోట్లు.447 కేసుల్లో 994 మంది అక్రమ రవాణాదారులను అరెస్టు చేసింది. 131 కేసుల్లో శిక్షలు పడగా, 77వేల కిలోలకుపైగా స్వాధీనం చేసుకున్న డ్రగ్స్‌ను ధ్వంసం చేసింది. ఇవిఅమలు వ్యవస్థ చురుకుదనాన్ని చూపించే గణాంకాలు. కానీ వీటితోనే దేశంలో డ్రగ్స్ వినియోగం తగ్గిందా, కొత్తగా వ్యసనానికి గురయ్యేవారి సంఖ్య తగ్గిందా, సమాజానికి జరుగుతున్న నష్టం ఎంత మేరకు తగ్గింది అన్నది చెప్పలేం. డ్రగ్స్ రహిత భారత్ లక్ష్యాన్ని అంచనా వేయాలంటే ఈ ప్రశ్నలే కీలకం. డ్రగ్స్ సమస్య వినియోగదారుడితోనే ఆగిపోదు. వ్యసనం చదువుకు, ఉద్యోగానికి, కుటుంబ ఆదాయాన్ని దెబ్బతీయవచ్చు. చికిత్స ఖర్చు పెరగడం, సంపాదించే వ్యక్తి పని సామర్థ్యం తగ్గడం కుటుంబంపై అదనపు భారం మోపుతాయి. ఒక వ్యక్తి ఆరోగ్య సమస్యగా మొదలైనది కుటుంబ ఆర్థిక స్థితిని ప్రభావితం చేసి, చివరికి సమాజ ఉత్పాదకతపైనా ప్రభావం చూపుతుంది. అందుకే డ్రగ్స్ నియంత్రణను కేవలం అక్రమ సరఫరాను అడ్డుకునే కార్యక్రమంగా చూడటం సరిపోదు. దీనికి ప్రజా భద్రత కూడా జతవుతుంది. అక్రమ డ్రగ్స్ మార్కెట్ నేర ముఠాలకు ఆర్థిక ఆధారంగా ఉంటుంది. వ్యసనం కొన్ని సందర్భాల్లో ప్రమాదకరమైన, చట్టవిరుద్ధమైన ప్రవర్తనకు దారితీయవచ్చు. మత్తు వాహనం నడిపే సామర్థ్యాన్ని, నిర్ణయశక్తిని దెబ్బతీయడం వల్ల రహదారి భద్రతకు ప్రమాదం ఏర్పడుతుంది. తీవ్రమైనమానసిక ఒత్తిడి, ఆత్మహత్యా ప్రవర్తనతోనూ మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధం ఉండవచ్చు. ప్రతి నేరానికి లేదా ప్రమాదానికి డ్రగ్స్‌కారణమని చెప్పడం శాస్త్రీయంగా సరైందికాదు. అయితే డ్రగ్స్ ప్రమేయం ఉన్నసందర్భాలను పోలీసు,వైద్య, రహదారి భద్రతా వ్యవస్థలు సక్రమంగా నమోదు చేయాల్సిన అవసరం మాత్రం ఉంది. ఈ ప్రభావాలకు ఆర్థిక విలువను కచ్చితంగా లెక్కించడం కష్టం. అయినా పనిదినాలు కోల్పోవడం, ఉత్పాదకత తగ్గడం, వైద్య ఖర్చులు, ప్రమాదాలు, పోలీసు దర్యాప్తు, న్యాయవ్యవస్థపై భారం ఇవన్నీ దేశ వనరులపైనే పడతాయి. డ్రగ్స్ వల్ల జీడీపీకి ఇంత శాతం నష్టం జరుగుతోందని చెప్పే సమగ్ర భారతీయ అధ్యయనం ప్రస్తుతం లేదు. కానీ పనిచేసే వయసులోని ప్రజల ఆరోగ్యం, ఉత్పాదకత దెబ్బతింటే దాని ప్రభావం ఆర్థిక వ్యవస్థపై పడక మానదు. ఇదే సమయంలో డ్రగ్స్ మార్కెట్ స్వరూపం మారుతోంది. ఎన్‌సీబీ గణాంకాల ప్రకారం యాంఫెటమైన్ తరహా ఉద్దీపకాలు, ఎండీఎంఏ వంటి సింథటిక్ డ్రగ్స్ స్వాధీనం 2019లో 1,890 కిలోల నుంచి 2024లో 11,994 కిలోలకు పెరిగింది దాదాపు ఆరురెట్లు. ఇటువంటి డ్రగ్స్‌ను రహస్యంగా తయారు చేయడం, చిన్న పరిమాణాల్లో తరలించడం, కొత్త మార్గాల్లో విక్రయించడం సులభం. డార్క్‌నెట్, ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్, క్రిప్టోకరెన్సీ వంటి మార్గాలు ఈమార్కెట్‌ను మరింత అదృశ్యంగా మారుస్తున్నాయి. డార్క్‌నెట్ ఆధారిత ముఠాలను ఎన్‌సీబీ ఇటీవల ఛేదించడం ఈ మార్పుకు ఉదాహరణ. కాబట్టి డ్రగ్స్ నియంత్రణలో సైబర్ దర్యాప్తు, డిజిటల్ ఆధారాలు, ఆర్థిక లావాదేవీల పరిశీలనకు ప్రాధాన్యం పెరగాలి.



మరో సవాలు చట్టబద్ధమైన మందుల దుర్వినియోగం. వైద్యపరంగా అవసరమైన కొన్ని మందులు ఇతర ప్రయోజనాలకు వాడేప్రమాదం ఉంది. ఈనేపథ్యంలో 2026మేలో కేంద్ర ఆరోగ్యమంత్రిత్వ శాఖ ప్రీగాబాలిన్‌ను షెడ్యూల్ హెచ్1 కేటగిరీలోకి తీసు కొచ్చింది.అవసరమైన రోగులకు మందులు అందుతూనే దుర్వినియోగాన్ని అడ్డుకోవాలంటే వైద్యుల ప్రిస్క్రిప్షన్లు, మందుల సరఫరా గొలుసు, ఫార్మసీల విక్రయాలపై మెరుగైన పర్యవేక్షణ అవసరం. విధాన రూపకల్పనకు మరో అడ్డంకితాజా సమాచారం కొరత. దేశవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగంపై జరిగిన చివరి సమగ్ర సర్వే 2018లో సేకరించిన సమాచారంపై ఆధారపడింది. దాని ప్రకారం 3.1 కోట్ల మంది గంజాయి ఉత్పత్తులను, 2.26కోట్ల మంది ఓపియాయిడ్లను ఉపయోగిస్తున్నారని అంచనా. ఓపియాయిడ్ వినియోగానికి చికిత్స అవసరమైన వారు సుమారు 77 లక్షల మంది. ఆ తర్వాత డ్రగ్స్ మార్కెట్‌లో సింథటిక్ పదార్థాలు, డిజిటల్ సరఫరా వంటి కొత్త పరిణామాలు చోటుచేసుకున్నాయి. కాబట్టి ఇప్పుడు ఎవరు, ఎక్కడ, ఏ డ్రగ్స్‌ను ఎంతగా ఉపయోగిస్తున్నారు అన్నదానిపై తాజా సమాచారం లేకుండా విధానాలను ఖచ్చితంగా రూపొందించడం కష్టం. ఈ లోటును పూడ్చడానికి అవగాహన కార్యక్రమాలకంటే ముందుకు వెళ్లాలి. పాఠశాలలు, కళాశాలల్లో ప్రమాద సంకేతాలను ముందుగానే గుర్తించి కౌన్సెలింగ్‌కు అనుసంధానం చేసే వ్యవస్థ అవసరం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనే వ్యసన సమస్యను గుర్తించి చికిత్సకు పంపే అవకాశం ఉండాలి. మోతాదు మించి డ్రగ్స్ తీసుకోవడం, ప్రమాదాలు లేదా తీవ్రమైన మానసిక సమస్యలతో ఆసుపత్రులకు వచ్చే సందర్భాల్లో డ్రగ్స్ ప్రమేయాన్ని సక్రమంగా నమోదు చేయాలి. ఈ సమాచారం ద్వారా కొత్త వినియోగ ధోరణులను ముందుగానే గుర్తించవచ్చు. అదేవిధంగా ఫోరెన్సిక్ ప్రయోగశాలలు, ఆసుపత్రులు, చికిత్సా కేంద్రాలు, పోలీసు సంస్థల సమాచారాన్ని అనుసంధానించే జాతీయ ముందస్తు హెచ్చరిక వ్యవస్థ అవసరం. కొత్తపదార్థం మార్కెట్‌లో విస్తరించిన తర్వాత చర్య తీసుకోవడం కంటే, అది విస్తరించే ముందు గుర్తించడం సమర్థమైన విధానం. డ్రగ్స్ నియంత్రణలో ఇది పెద్ద మార్పు అవుతుంది. చికిత్స విజయాన్ని కొలిచే పద్ధతిలోనూ మార్పు అవసరం. డీఅడిక్షన్ కేంద్రాల్లో చేరిన వారి సంఖ్య కంటే చికిత్స పూర్తిచేసిన వారు, మళ్లీ వ్యసనానికి గురికాకుండా ఉన్నవారు, చదువు లేదా ఉద్యోగంలోకి తిరిగి వెళ్లినవారు ఎంతమంది అన్నదే ముఖ్యం. పునరావాసాన్ని కుటుంబ సహకారం, విద్య, ఉపాధితో అనుసంధానించాలి. లేకపోతే చికిత్స ముగిసిన తర్వాత మళ్లీ అదే పరిస్థితుల్లోకి వెళ్లే ప్రమాదం ఉంటుంది. అందువల్ల డ్రగ్స్‌రహిత భారత్ విజయాన్ని కొలిచే ప్రమాణాలు కూడా మారాలి. స్వాధీనం, అరెస్టులు, కేసులు, శిక్షలు అవసరమైన గణాంకాలే. కానీ వాటితో పాటు కొత్త వినియోగదారుల సంఖ్య, ముందస్తుగా గుర్తించిన కేసులు, చికిత్స తర్వాత కోలుకున్న వారిస్థితి, పునరావాసం, డ్రగ్స్ సంబంధిత ప్రమాదాలు వంటి అంశాలనూ కొలవాలి.ఎన్‌సీబీ,రాష్ట్ర పోలీసు, ఆరోగ్యం, విద్య, ఔషధ నియంత్రణ, రహదారి భద్రతా సంస్థలు తమ తమ పరిధిలో కాకుండా ఒకే సమస్యకు వేర్వేరు కోణాలుగా పనిచేసే వ్యవస్థ అవసరం. అంతిమంగా ప్రశ్న భారత్ ఎంత డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకుంది? అన్నదానికే పరిమితం కాకూడదు. డ్రగ్స్ వల్ల జరగాల్సిన నష్టంలో ఎంత భాగాన్ని భారత్ నివారించింది?' అన్నదే అసలు ప్రమాణంగా మారాలి. కొత్తగా వ్యసనానికి గురయ్యే వారిని తగ్గించడం, యువత చదువును కాపాడటం, కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించడం, చికిత్స పొందినవారిని తిరిగి సాధారణ జీవితంలోకి తీసుకురావడం ఇవే డ్రగ్స్ రహిత భారత్ సాధనకు నిజమైన సూచికలు. స్వాధీనం చేసుకున్న డ్రగ్స్ పరిమాణం ప్రభుత్వ చర్యను చూపిస్తుంది. నివారించిన నష్టం ఆ చర్య ఫలితాన్ని చూపిస్తుంది. ●

# చదువు, నిరుద్యోగం మధ్య అంతరం తగ్గాలి

కె.ప్రదీప్

విద్యార్థుల ఆలోచనా విధానాల్లో మార్పులొస్తున్నాయి, బయటి ప్రపంచం సరికొత్త పోకడలుపోతోంది. విద్య, వ్యాపార రంగాల్లో వస్తున్న మార్పులు మానవ జీవితాన్ని సంతోషమయం చేయాల్సింది పోయి, నేడు నిరుద్యోగం రూపంలో ఎన్నో కఠిన పరిస్థితులను మన ముందుంచుతున్నాయి. దేశవ్యాప్తంగా దాదాపు లక్ష ఉద్యోగాలతో వచ్చిన ఒక రైల్వే నోటిఫికేషన్‌కు ఏకంగా కోటీ 15 లక్షల మంది దరఖాస్తు చేసుకోవడం ఒకవైపు తీవ్ర పోటీని సూచిస్తుంటే, మరోవైపు అందులో 50శాతానికి పైగా దరఖాస్తుదారులు డిగ్రీలు, పీజీలు చేసినవారే కావడం విద్యావంతుల దయనీయ స్థితికి అద్దం పడుతోంది. ఒక్క రైల్వే నోటిఫికేషన్ మాత్రమే కాదు,యూపీఎస్సీ, ఎస్సెస్సీ, బ్యాంకింగ్, రాష్ట్ర స్థాయి గ్రూప్స్ సహా ఏ నోటిఫికేషన్ వచ్చినా అది పదో తరగతి అర్హత అయినా, గ్రాడ్యుయేషన్ స్థాయి అయినా లక్షలాది మంది పట్టభద్రులు వాటి వెంట పడుతున్నారు. ఈ దుస్థితికి అసలు కారణం ఏమిటి? మన విద్యా వ్యవస్థ లక్ష్యాలకు, నేటి మార్కెట్ అవసరాలకు మధ్య ఉన్న భారీ అంతరమే దీనికి ప్రధాన కారణం. కేంద్ర విద్యాశాఖ నివేదికల ప్రకారం దేశంలో ఏటాదాదాపు కోటీ పది లక్షల మంది ఉన్నత విద్యను పూర్తి చేసుకుని బయటకు వస్తు న్నారు. అందులో కేవలం అండర్ గ్రాడ్యుయేట్లే 80లక్షల మంది. మరి జాబ్ మార్కెట్ ఎంతమంది విద్యార్థుల భవి ష్యత్తుకు బాటలు వేస్తోంది? ఈ అంతరం నానాటికీ పెరిగి ఒక తీరని అగాధంగా మారుతోంది. గత రెండు దశాబ్దాలుగా గుడ్డి కన్నా మెల్ల మేలు అన్నచందంగా ఉపాధిని అందించిన ఐటీ రంగం సైతం కరోనా తదనంతర పరిణామాలు, ఆర్థిక మాంద్యం, వరుసలేఆఫ్స్ రూపంలో తీవ్ర ఒడిదుడుకులను ఎదుర్కొంటోంది. సరిగ్గా పుంజుకుంటున్న సమయంలోనే కృత్రిమ మేధ విస్తరిస్తోంది. దీనివల్ల ఉద్యోగాలు పోతాయని ఒక వర్గం, కొత్త అవకాశాలు వస్తాయని మరో వర్గం వాదిస్తున్నప్పటికీ ప్రస్తుత విద్యా విధానం ఆధునిక సాంకేతికతకు తగిన నైపుణ్యాలను విద్యార్థులకు అందిస్తోందా అన్నదే అసలు ప్రశ్న. దేశానికి తలమానికమైన ఐఐటీ, ఎన్ఐటీల్లో సైతం పూర్తిస్థాయిలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు లభించకపోవడం, ఆఫర్లు వచ్చినా జాయినింగ్స్ నెలల తరబడి ఆలస్యం కావడం, పరిస్థితుల తీవ్రతను స్పష్టం చేస్తోంది. ఇక్కడే మరో సమాంతర విద్యా వ్యవస్థ మొదలవుతోంది. కాలేజీల్లో ప్లేస్‌మెంట్లు రానివారు, వచ్చి ఆగిపోయినవారు అనివార్యంగా ప్రైవేట్ ఇన్‌స్టిట్యూట్ల వైపు మళ్లుతున్నారు. 100 జాబ్ గ్యారెంటీ బోర్డుల వలలో పడి వేలకు వేల ఫీజులు ముట్టజెబుతూ,మరో రెండు మూడేళ్లు అదనపు కోర్సుల కోసం విలువైన సమయాన్ని వృధా చేసుకుంటున్నారు. మార్కెట్‌కు పనికొచ్చే ఆ కోర్సులను డిగ్రీ కరిక్యులమ్‌లోనే అందిస్తే విద్యార్థి చదువు పూర్తయ్యేనాటికే రంగంలోకి దిగే అవకాశం ఉంటుంది కదా? మరోవైపు ప్రభుత్వ ఉద్యోగాల కోసం సిద్ధమయ్యే అభ్యర్థుల పరిస్థితి మరీ సున్నితం. డిగ్రీలు పూర్తికాగానే యూపీఎస్సీ, ఎస్సెస్సీ, గ్రూప్స్‌కోసం ఢిల్లీ, హైదరాబాద్ వంటి మహానగరాల్లో ఉంటూ లక్షలాది రూపాయలు ఫీజులు, హాస్టళ్లకుధార బోస్తున్నారు.ప్రభుత్వ ఉద్యోగాల సక్సెస్ రేటు 2శాతం లోపే ఉన్నప్పటికీ, ఉద్యోగ భద్రత, సామాజిక గౌరవం కోసం యువత ఈ ప్రయాస పడుతోంది. ఎంబీబీఎస్, సీఏ, లా వంటి ప్రొఫెషనల్ కోర్సులు చేసినవారికి ఉద్యోగ భరోసా కాస్తమెరుగ్గా ఉన్నప్పటికీ, సాధారణ గ్రాడ్యుయేట్లపై ఆధారపడి కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లు, సంబంధిత వ్యాపారాలు మాత్రమే మూడు పువ్వులు ఆరు కాయలుగా లాభపడుతున్నాయి. కానీ ఆ మార్పు కేవలం సానుభూతి తోనో, విమర్శలతోనో రాదు. బలమైన విధాన పరమైన నిర్ణయాలతోనే సాధ్యం. డిగ్రీ ప్రాజెక్టుల పేరుతో జరిగే తూతూమంత్రపు తంతుకు స్వస్తిపలకాలి. కాలేజీ స్థాయిలోనే పరిశ్రమలతో భాగస్వామ్యాలు కుదుర్చుకుని, ఆచరణాత్మక ఇంటర్న్‌షిప్‌లను డిగ్రీలో తప్పనిసరి చేయాలి. ఒక నోటిఫికేషన్ వస్తే కోర్టుకేసులు, పరీక్ష రద్దులతో ఏళ్ల తరబడి యువత జీవితాలు నలిగిపోకుండా యూపీఎస్సీతరహాలో పక్కా వార్షిక జాబ్ క్యాలెండర్‌ను రాష్ట్రాలు, కేంద్ర సంస్థలు పారదర్శకంగా అమలు చేయాలి. ప్రతి ఒక్కరూ ఉద్యోగార్థులుగాకాకుండా, స్థానిక వనరులతో సూక్ష్మపరిశ్రమలు, స్టార్టప్‌లు ప్రారంభించేలా ప్రభుత్వాలు రుణ నిబంధనలను సులభతరం చేయాలి. ప్రభుత్వ ఉద్యోగం లేదా సాఫ్ట్‌వేర్ కొలువు మాత్రమే విజయానికి కొలమానం అనే సంకుచిత భావన సమాజం నుంచి పోవాలి. డిగ్రీల కంటే ఆచరణా త్మక నైపుణ్యానికే అసలైన ప్రాధాన్యం దక్కాలి. ●

# పర్యావరణంపై ఏఐ డేటా సెంటర్ల ప్రభావం!

యేచన్ చంద్ర శేఖర్

గత దశాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా కృత్రిమ మేధ డేటా వినియోగం వాయు వేగంతో దూసుకుపోతోంది. ఇది ఒక ప్రత్యేకమైన ఎంటర్‌ప్రైజ్ సాధనం నుండి ఆధునిక మౌలిక సదుపాయాల సర్వవ్యాప్త, డేటాఆధారిత చోదకంగా రూపాంతరం చెందింది. ఇటీవలి కాలంలో మెషిన్ లెర్నింగ్ నమూనాలు గణనీయంగా విస్తరించాయి.ప్రముఖ ఏఐ వ్యవస్థలకు శిక్షణ ఇవ్వడానికి ఉపయోగించే డేటా పాయింట్లు, ప్రమాణాలు,గణనశక్తి వేగంగా రెట్టింపు అవుతున్నాయి. 2022 సంవత్సరాంతంలో పబ్లిక్ జనరేటివ్ ఏఐ ప్లాట్‌ఫారమ్‌ల ప్రారంభం, వినియోగదారులు, కార్యాలయాలలో వీటి వినియోగాన్ని మరింత వేగవంతం చేసింది. తత్ఫలితంగా ఇది రోజువారీ వృత్తిపరమైన, వ్యక్తిగత కార్యప్రవాహాలలో సర్వసాధారణం అయిపోయింది. ఇటీవలి కాలంలో ప్రపంచవ్యాప్తంగా చేపట్టిన అధ్యయనాలు దాదాపు 95 శాతం సంస్థలు ఏఐ సాంకేతిక వినియోగం కారణంగానే స్పష్టంగా ఎక్కువ డేటాను నిల్వ చేసుకునే సామర్థ్యం సంతరించుకుంటున్నాయని వెల్లడిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా, ఈ కేంద్రాలు సువిశాలమైన స్థలాలలో తమ కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయి. ఏఐ వర్క్‌లోడ్‌ల కారణంగా, దాదాపు 61 శాతం సంస్థలు ఇటీవలి ఒకే సంవత్సరంలో 25శాతం లేదా అంతకంటే ఎక్కువ డేటా వృద్ధిని నమోదు చేశాయి. కంపెనీలు పాత ఆర్కైవ్‌లను క్రియాశీలంగా ఉంచుతూనే, కొత్త సింథటిక్ లాగ్‌లను ఉత్పత్తి చేస్తున్నాయి. డేటా వినియోగంలో ప్రపంచంలో ఐదోవంతు మనదే! దాదాపు 1.45 బిలియన్ల జనాభా, అధిక మొబైల్ ఇంటర్నెట్ వినియోగం కారణంగా, ప్రపంచ డేటా వినియోగంలో భారతదేశం భారీ వాటాను కలిగి ఉంది. ప్రపంచంలోని డిజిటల్ డేటాలో భారతదేశం దాదాపు 20 శాతాన్ని వినియోగిస్తూ, మొత్తం ఏఐ వినియోగ పరిమాణంలో రెండవ స్థానంలో ఉంది. అయినప్పటికీ, ప్రపంచంలోని డేటా సెంటర్ సామర్థ్యంలో కేవలం 3 నుండి 5శాతం మాత్రమే కలిగి ఉండటం వల్ల మౌలిక సదుపాయాల అంతరాన్ని ఎదుర్కొంటోంది. పటిష్టమైన డిజిటల్ మౌలిక సదుపాయాలు కలిగిన సంపన్న ఆర్థిక వ్యవస్థలు, అధిక తీవ్రత గల ఏఐడేటా వినియోగంలో ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. 2025 నాటికి భారతదేశంలో ప్రతి వినియోగదారుడి సగటు నెలవారీ మొబైల్ డేటా వినియోగం 31జీబికి చేరుకుంది. ఇది ఐదేళ్లలో 18 శాతం వార్షిక వృద్ధి రేటును చూపిస్తుంది. కాగా కొన్ని నివేదికలు మాత్రం ఈ సంఖ్యను 36జీబి వరకు ఉన్నట్లు పేర్కొన్నాయి. స్ట్రీమింగ్, క్లౌడ్ గేమింగ్, వాయిస్ సెర్చ్, చాట్‌బాట్‌ల వంటి ఏఐ సాధనాలు ఈ వృద్ధిని పెంచడంలో సహాయపడ్డాయి.ప్రస్తుతం దాదాపు 44శాతం ఇంటర్నెట్ వినియోగ



దారులు ప్రాథమిక ఏఐ ఫీచర్లను వినియోగిస్తున్నారు. క్లౌడ్ వంటి చాట్‌బాట్‌ల మొత్తం ఏఐ సాధనాల వినియోగంలో భారతదేశం ప్రపంచంలోనే రెండవ స్థానంలో ఉంది.అయితే భారతదేశ జనాభా పరిమాణాన్ని పరిగణనలోకి తీసుకున్నప్పుడు, తలసరి ఏఐ వినియోగంలో భారతదేశం ప్రపంచవ్యాప్తంగా 116 దేశాలలో 98 నుండి 101వ స్థానంలో దిగువన ఉండడం గమనార్హం.మన దేశంలో ఏఐ సాంకేతిక వినియోగం ఎక్కువగా పట్టణ నిపుణులు, టెక్ ఉద్యోగుల మధ్యనే కేంద్రీకృతమై ఉంది. ఏఐ డేటా సెంటర్లు భారీ మొత్తంలో విద్యుత్, నీటిని వినియోగించడం, కార్బన్ ఉద్గారాలను పెంచడం, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, శబ్దం,పట్టణ వేడిని ఉత్పత్తి చేయడం ద్వారా పర్యావరణంపై తీవ్ర ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయి. యూనివర్సిటీ ఆఫ్‌కాలిఫోర్నియా రివర్‌సైడ్ యూనివర్సిటీ ఆఫ్ టెక్సాస్ పరిశోధన ప్రకారం, ఏఐ డేటా సెంటర్లు ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే మొత్తం విద్యుత్‌లో 2 శాతం వినియోగిస్తాయని అంచనా. ఏఐ డేటా సెంటర్లు వాటి కార్యకలాపాల ప్రక్రియలో భాగంగా సంక్లిష్టమైన మెషిన్ లెర్నింగ్ మోడళ్లకు శిక్షణఇవ్వడానికి వాటిని అమలు చేయడానికి వేలాది శక్తివంతమైన కంప్యూటర్ చిప్‌లు నిరంతరం పనిచేయాల్సి ఉంటుంది. ఈ చిప్‌లు ఉత్పత్తి చేసే తీవ్రమైన వేడికి విస్తృతమైన శీతలీకరణ అవసరం కావడంతో అవి అధిక మొత్తంలో వేడిని ఉత్పత్తి చేస్తాయి. డేటా సెంటర్లు భారీ విద్యుత్ వినియోగించడంతో పాటు శీతలీకరణ కోసం అధిక నీటివాడకం కారణంగా స్థానికంగా,వాయు, శబ్ద కాలుష్యం ఏర్పడి పర్యావరణంపై తీవ్ర ప్రభావం చూపుతాయి. దేశాన్ని ప్రపంచ స్థాయి ఏఐ అగ్రగామిగా తీర్చిదిద్దాలన్న యుకె ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో, ఒక సాధారణ డేటా సెంటర్ రోజుకు 11 నుండి 19 మిలియన్ల లీటర్ల నీటిని వినియోగించుకోగలదని,ఇది30వేల నుండి 50వేల మంది జనాభా కలిగిన ఒక పట్టణం, నీటి వినియోగానికి సమానమని నీటి వనరుల నిర్వహణ నిపుణులు తెలిపారు.డేటా సెంటర్లు భారీ మొత్తంలో విద్యుత్‌ను వినియోగించడం వలన ప్రపంచ కార్బన్ ఉద్గారాలలో వాటా సుమారు 1 నుండి 1.5 శాతం వరకు ఉంటుంది. అనేక కేంద్రాలు బొగ్గు, సహజ వాయువు ఆధారిత గ్రిడ్‌ల నుండి విద్యుత్‌ను పొందడంతో ఇది పాత విద్యుత్ ప్లాంట్ల తొలగింపును ఆలస్యం చేయడమే కాక గ్రీన్‌హౌస్ వాయువులను పెంచుతుంది. మరో పక్కఏఐ వర్క్‌లోడ్‌లు వేగంగాపెరగడం వల్ల, స్థానిక విద్యుత్ గ్రిడ్‌లు అందించగల దానికంటే ఎక్కువ శక్తి డేటా సెంటర్లకు అవసరం అవుతోంది. ఈ కొరత సహజంగానే అధిక విద్యుత్ ధరలకు కారణమవుతోంది. 2022తర్వాత నిర్మించిన డేటా సెంటర్లలో మూడింటరెండు వంతులునీటి కొరత ఉన్న ప్రాంతాలలో నెలకొల్పబడడంతో, ఇది స్థానిక సరఫరాలను క్షీణింపజేసి, నివాస ప్రాంతాలలో తాగునీటి ఎద్దడికి కారణమై కరవు ప్రమాదాలను తీవ్రతరం చేస్తుంది. ఏదేమైనప్పటికీ అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానం ఒక పక్క మానవ మనుగడను మరింత సౌకర్యవంతంగా మారుస్తూనే, పర్యావరణ సమతుల్యతను పరిరక్షిస్తూ,ప్రకృతి వనరులను కాపాడినప్పుడే మానవుడుసాధించిన సాంకేతిక ప్రగతికి అర్థం పరమార్థం ఉంటుంది. ●

# 'సర్ఞ్' పై ముదిరిన రగడ




- సిఇసి అభిశంసనకు విపక్ష కూటమి నిర్ణయం - నేడు దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నిరసనలు - జ్ఞానేశ్ తప్పిదాలపై విచారణ జరపాలి: రాహుల్‌గాంధీ - ప్రధాన ఎన్నికల కమిషనర్ తీరును తప్పుపడుతున్న విపక్షాలు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)తో పాటు ఫారం6 మార్పులు, ఓటర్ల తొలగింపు, పునరుద్ధరణ, ఎన్నికల డేటా నిర్వహణ వంటి అంశాలపై ముగ్గురు కమిషనర్లలో విభేదాలు వచ్చాయని, ప్రధానంగా ఇద్దరు ఎన్నికల కమిషనర్ల అభ్యంతరాలు వ్యక్తమైనట్లు నివేదిక బహిర్గతమైంది. గత 10 నెలల్లో కనీసం 14 సందర్భాల్లో సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి అభ్యంతరాలు నమోదు చేసినట్లు ఆ నివేదిక తెలిపింది. సిఇసి ఏకపక్ష నిర్ణయాలను వ్యతిరేకించినట్లుగా తెలుస్తోంది. అయితే ఈ నివేదికపై ఎన్నికల సంఘం స్పందిస్తూ కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు ఉండటం నిర్ణయ ప్రక్రియలో భాగమేనని, గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే ఉన్నాయని పేర్కొంది. తాజాగా వెలుగుచూసిన నివేదికపై రాజకీయ దుమారం చెలరేగింది. తక్షణమే ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నాయి. బిజెపికి అనుకూలంగా వ్యవహరిస్తూ ఎన్నికల్లో ఓట్ల అక్రమాలకు పాల్పడ్డారని మండిపడుతున్నాయి. సిఇసిని అరెస్టు చేసి, సమగ్ర విచారణ జరిపించాలని కాంగ్రెస్ సహా పలు ప్రతిపక్ష పార్టీలు కోరుతున్నాయి. కాంగ్రెస్, టిఎంసి, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్జేడీ, ఆమ్ ఆద్మీ పార్టీ ఇలా ప్రతిపక్షాలు, ఆ పార్టీ నేతలు సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై విమర్శలు పెంచారు. ఓట్ల దొంగతనం వల్ల ప్రజాస్వామ్యం బలహీనపడిందని, హర్యానా, గుజరాత్, మహారాష్ట్ర, పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో తీవ్ర ప్రభావం చూపిందని రాహుల్‌గాంధీ, మమతాబెనర్జీ పేర్కొన్నారు. ఓట్లను దొంగలిస్తే, ప్రజాప్రతినిధులు రూపొందించే చట్టాల చట్టబద్ధతపైనా ప్రశనలు తలెత్తుతాయని వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో ఓట్ల అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో దేశంలో ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తున్నా తాము మౌనంగా ఉండబోమని అన్నారు. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌ను తక్షణమే అరెస్టు చేసి, తొలగించాలని, ఆయన ఆధ్వర్యంలో తీసుకున్న నిర్ణయాలు, ఓటర్ల జాబితా మార్పులపై స్వతంత్ర సమీక్ష జరపాలని డిమాండ్ చేస్తూ, సెప్టెంబర్ 25న తమ తమ రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యాలయాల వరకు నిరసన పాదయాత్రలు నిర్వహించాలని కాంగ్రెస్ గురువారం తన రాష్ట్ర యూనిట్లను ఆదేశించింది. నిరసనల రెండవ దశలో భాగంగా, అన్ని జిల్లా కాంగ్రెస్ కమిటీలు (డిసిసిలు) సెప్టెంబర్ 28న తమ తమ జిల్లా కలెక్టరేట్ల వరకు ఇదే తరహా పాదయాత్రలు నిర్వహిస్తాయని కాంగ్రెస్ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ తెలిపారు. బిజెపి నియంత్రణలో కుమార్ 'భారీ ఓట్ల దొంగతనం'కు నేతృత్వం వహిస్తున్నారని వేణుగోపాల్ ఆరోపించారు. "జ్ఞానేశ్ తప్పక పదవి నుంచి వైదొలగాలి, ఆయన తీసుకున్న నిర్ణయాలన్నింటినీ రద్దు చేయాలి. ఆయనను తొలగించి, జైలుకు పంపి, మా డిమాండ్లన్నీ నెరవేరే వరకు మా నిరసనలు అవిశ్రాంతంగా కొనసాగుతాయి అని ఆయన స్పష్టంచేశారు.

**సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన!**

సిఇసి జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై మరోసారి తొలగింపు తీర్మానం తీసుకురావడానికి ప్రతిపక్షాలు సిద్ధమవుతున్నట్లు సమాచారం. సిఇసి జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసనకు విపక్ష కూటమి నిర్ణయం తీసుకున్నట్లుగా తెలుస్తోంది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) అంశంపై ఎన్నికల సంఘంపై విమర్శలు కొనసాగుతున్న నేపథ్యంలో కాంగ్రెస్ చొరవతో 'ఇండియా' కూటమిలోని పార్టీలు ఈ అంశంపై ఏకాభిప్రాయానికి వచ్చినట్లు సమాచారం. జ్ఞానేశ్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని ప్రతిపక్షాలు గతంలోనూ పార్లమెంటులో నోటీసు ఇచ్చాయి. 2026 మార్చిలో లోక్‌సభకు చెందిన 130 మంది, రాజ్యసభకు చెందిన 63 మంది సభ్యుల సంతకాలతో తొలగింపు తీర్మానం కోసం నోటీసులు సమర్పించారు. ఇది సిఇసిని తొలగించేందుకు పార్లమెంటులో వచ్చిన తొలి అధికారిక ప్రయత్నంగా నమోదైంది. అయితే ఆ నోటీసులను లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ సిపి రాధాకృష్ణన్ ఏప్రిల్ 6న స్వీకరించలేదు. రెండు సభల ప్రిసైడింగ్ అధికారులు వేర్వేరు ఉత్తర్వుల్లో ఆ నోటీసులను అడ్మిట్ చేయడానికి నిరాకరించారు.

**ఆరోపణలు ఏంటి?**

మార్చిలో ఇచ్చిన నోటీసులో జ్ఞానేశ్ కుమార్‌పై పలు ఆరోపణలు చేసినట్లు అప్పటి నివేదికలు పేర్కొన్నాయి. ఇందులో పక్షపాతపూరిత, వివక్షపూరితంగా వ్యవహరించడం, ఎన్నికల అక్రమాలపై దర్యాప్తును అడ్డుకోవడం, భారీ స్థాయిలో ఓటర్లను ఓటు హక్కుకు దూరం చేసే పరిస్థితులు ఏర్పడటం వంటి ఆరోపణలు ఉన్నాయి. ఇవి ప్రతిపక్షాలు చేసిన ఆరోపణలేనని, స్వతంత్రంగా నిర్ధారించబడిన అంశాలుగా పరిగణించరాదని గమనించాలి. ప్రధాన ఎన్నికల కమిషనర్‌ను పదవి నుంచి తొలగించే ప్రక్రియ సుప్రీంకోర్టు న్యాయమూర్తిని తొలగించే విధానానికి సమానంగా ఉంటుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324(5) ప్రకారం, పార్లమెంటులో నిర్దిష్ట ప్రక్రియను అనుసరించాల్సి ఉంటుంది. తొలగింపు చర్యకు 'నిరూపిత దుర్వ్యవహారం లేదా అసమర్థత' వంటి రాజ్యాంగపరమైన ప్రాతిపదిక అవసరం. నోటీసు ఆమోదించబడితే తదుపరి దర్యాప్తు ప్రక్రియ కొనసాగుతుంది. చివరగా పార్లమెంటులో ప్రత్యేక మెజారిటీతో తీర్మానం ఆమోదం పొందాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్‌పై రాజకీయ వివాదం కొనసాగుతున్న వేళ, జ్ఞానేశ్ కుమార్‌పై ప్రతిపక్షాలు మరోసారి తొలగింపు చర్యకు సిద్ధమవుతున్నాయన్న వార్తలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## మోడీ, అమిత్, జ్ఞానేష్ దేశద్రోహులు: రాహుల్‌గాంధీ



దేశంలో ఓటు హక్కును, ఎన్నికల ప్రక్రియను నాశనం చేసిన ప్రధాని నరేంద్ర మోడీ, హోంమంత్రి అమిత్ షా, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ 'దేశద్రోహుల్లు' అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆరోపించారు. దేశానికి వారు చేసిన ద్రోహానికి మోడీ, అమిత్ షాపై విచారణ జరిగి తీరుతుందని స్పష్టం చేశారు. సిఇసి తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. దేశంలో 2024 తర్వాత జరిగిన సార్వత్రిక, అసెంబ్లీ ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయని రాహుల్ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ మీడియాతో మాట్లాడుతూ, సిఇసి జ్ఞానేశ్‌కుమార్ దేశానికి వ్యతిరేకంగా పని చేస్తున్నారని ఆరోపించారు. జ్ఞానేశ్‌కుమార్‌ను ప్రధాని మోడీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఎంపిక చేశారన్న రాహుల్, రాజ్యాంగంపై దాడులు చేస్తున్నప్పటికీ ఆయన్ను వారు కాపాడుతున్నారని ఆరోపించారు. 2024 ఎన్నికలకు ముందు సిఇసిపై చట్టప్రకారం ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఓ చట్టం తెచ్చారని రాహుల్ వెల్లడించారు. ఆ తర్వాత జరిగిన ఎన్నికలన్నీ రిగ్గింగ్ అయ్యాయని రాహుల్ ఆరోపించారు. ఈ క్రమంలో ఓటు చోరీ.. చివరకు చట్టం చోరీగా మారుతోందని పేర్కొన్నారు. ఓటు చోరీ ద్వారా ఎన్నికైన ఎంపిలు చేసే చట్టాలు అక్రమమని రాహుల్ పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియనే దొంగిలిస్తున్న మోడీ, అమిత్‌షాపై విచారణ జరగాలన్న ఆయన, ప్రజాస్వామ్యం ధ్వంసం అవుతుంటే చూస్తూ ఊరుకోబోమని తేల్చిచెప్పారు. మోడీసర్కార్ చేస్తున్న నేరంపై పోరాటం చేస్తామని ప్రకటించారు.

# 48 గంటల్లో సిఇసి రాజీనామా చేయాలి

### లేదంటే దేశవ్యాప్త ఆందోళన: సిజెపి చీఫ్ అభిజత్ దీప్కే హెచ్చరిక

### వచ్చే అసెంబ్లీ ఎన్నికలు నిలిపివేయాలని డిమాండ్



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** కేంద్ర ఎన్నికల సంఘంలో కమిషనర్ల మధ్య విభేదాల వ్యవహారం రాజకీయంగా తీవ్ర దుమారం రేపుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ సహా పలు విపక్ష పార్టీలు జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి. తాజాగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) కూడా రంగంలోకి దిగింది. జ్ఞానేశ్ కుమార్ 48 గంటల్లో రాజీనామా చేయాలని సీజేపీ వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కే అల్టిమేటం ఇచ్చారు. గడువులోగా రాజీనామా చేయకపోతే ఢిల్లీతో పాటు దేశవ్యాప్తంగా నిరసనలు చేపడతామని ప్రకటించారు. ఈ క్రమంలో, సీజేపీ సహ కన్వీనర్ సౌరవ్ దాస్ తమ డిమాండ్లను వెల్లడించారు. సీఈసీ జ్ఞానేశ్ కుమార్ రాజీనామాతో పాటు ఆయనకు ఆదేశాలు ఇచ్చినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలను 2025 నాటి స్థాయికి పునరుద్ధరించాలని కోరారు. ఎస్ఐఆర్‌కు సంబంధించిన ఫైళ్లను సుప్రీంకోర్టు నేతృత్వంలోని కమిటీ అధీనంలో ఉంచాలన్నారు. ఎన్నికల కమిషనర్ల నియామకానికి సంబంధించిన ప్రస్తుత చట్టాన్ని రద్దు చేయాలని కూడా డిమాండ్ చేశారు. గతంలో నీట్ పేపర్ లీక్ వ్యవహారం, అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌కు వ్యతిరేకంగా కూడా సీజేపీ ఇలాంటి ఆందోళనలు చేపట్టిన విషయం తెలిసిందే. చివరకు కేంద్ర ప్రభుత్వం దిగొచ్చి వారి డిమాండ్లను నెరవేర్చింది. తాజాగా ఎన్నికల సంఘంపై ఆందోళనకు పిలుపునివ్వడం రాజకీయ వర్గాల్లో చర్చకు దారితీసింది. ఎన్నికల సంఘంలోనే నిర్ణయాలపై అభ్యంతరాలు నమోదైనట్లు వచ్చిన సమాచారం ఆందోళన కలిగించే అంశమని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్లు నమోదు చేసిన అభ్యంతరాలపై సమగ్ర విచారణ జరగాలని కోరారు. మరోవైపు ఎన్నికల సంఘం మాత్రం ఈ ఆరోపణలను ఖండించింది. కమిషనర్ల మధ్య భిన్నాభిప్రాయాలు, రాతపూర్వక అభిప్రాయాలు నమోదు కావడం అంతర్గత చర్చల్లో సాధారణమేనని స్పష్టం చేసింది. ఎస్ఐఆర్‌తో పాటు గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ ఏకగ్రీవంగానే తీసుకున్నామని ఎన్నికల సంఘం తెలిపింది.

## అభివృద్ధి హక్కు సాధించేందుకు కట్టుబడి ఉన్నాం

### యుఎన్‌లో తన వాదనను గట్టిగా వినిపించిన భారత్



**న్యూయార్కు, సెప్టెంబరు 24:** అభివృద్ధి అనేది ప్రతి మనిషికి ఉన్న విడదీయరాని మానవ హక్కు అని, దాన్ని సాధించేందుకు తాము కట్టుబడి ఉన్నామని ఐక్యరాజ్యసమితి వేదికగా భారత్ మరోసారి స్పష్టం చేసింది. సమ్మిళిత అభివృద్ధి, అంతర్జాతీయ సహకారం, బహుపాక్షిక సంస్కరణల పట్ల తమ నిబద్ధతను పునరుద్ఘాటించింది. ఈ మేరకు అభివృద్ధి హక్కుపై ఒప్పందాన్ని వీలైనంత త్వరగా ఆమోదించాలని భారత్ మద్దతు తెలిపింది. 40వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో భారత విదేశాంగ శాఖ కార్యదర్శి (పశ్చిమ దేశాలు) సిబి జార్జ్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఆయన భారత జాతీయ ప్రకటనను వినిపిస్తూ, దేశం వైఖరిని స్పష్టం చేశారు. ఈ విషయాన్ని విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్ ద్వారా ధ్రువీకరించారు. ఐక్యరాజ్యసమితి ప్రకారం ఈ అభివృద్ధి హక్కు అనేది ప్రతి వ్యక్తి, ప్రజలందరూ ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక, రాజకీయ అభివృద్ధిలో పాలుపంచుకోవడానికి, తోడ్పడటానికి, ఆ ఫలాలను ఆస్వాదించడానికి అధికారం కల్పిస్తుంది. దీని ద్వారానే అన్ని మానవ హక్కులు, ప్రాథమిక స్వేచ్ఛలు పూర్తిగా సాకారం అవుతాయి. గత 40 ఏళ్లలో ఈ ప్రకటన స్ఫూర్తితో ప్రపంచవ్యాప్తంగా సుస్థిర అభివృద్ధి, పేదరిక నిర్మూలన, విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి రంగాలలో గణనీయమైన పురోగతి నమోదైంది. కోట్లాది మంది ప్రజలు తీవ్ర పేదరికం నుంచి బయటపడ్డారు. అయినప్పటికీ, ఈ అభివృద్ధిలో చాలా అసమానతలు ఉన్నాయని, పురోగతి అందరికీ సమానంగా చేరలేదని ఐక్యరాజ్యసమితి ఒక ప్రకటనలో పేర్కొంది. అనేక దేశాలు తమ అభివృద్ధికి ఆటంకంగా ఉన్న వ్యవస్థాగత అడ్డంకులను, నిధుల కొరతను ఎదుర్కొంటున్నాయని తెలిపింది. ఈ నేపథ్యంలో 40వ వార్షికోత్సవం ప్రస్తుత ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడానికి, అందరికీ మరింత సమ్మిళిత, సమానమైన భవిష్యత్తును అందించడానికి ఒక ముఖ్యమైన అవకాశమని ఐరాస అభిప్రాయపడింది.

## ఆ సాఫ్ట్‌వేర్‌ను వెంటనే తొలగించండి

### ఇసికి ఎంపి శశిథరూర్ సూచనలు



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** ఎన్నికల సంఘం తీసుకొచ్చిన ఇసిఐనెట్ సాఫ్ట్‌వేర్‌పై మళ్లీ తీవ్ర వివాదం చెలరేగింది. కొత్త ఓటర్ల చేరిక, పేర్ల తొలగింపు వంటి నిర్ణయాలు ప్రధాన కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ స్థాయిలోనే జరుగుతున్నాయని, మిగతా ఇద్దరు కమిషనర్లకు సమాచారం కూడా అందడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ఎంపీ శశి థరూర్ ఆ సాఫ్ట్‌వేర్‌ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గోవాలో జరిగిన ఘటనే ఈ వివాదానికి కారణం. ప్రత్యేక సమగ్ర సవరణ సమయంలో కొన్ని పేర్లపై సాఫ్ట్‌వేర్ అభ్యంతరాలు చూపింది. క్షేత్రస్థాయిలో సరిగ్గా పరిశీలించిన తర్వాత 97 మంది ఓటర్లు అర్హులేనని స్థానిక అధికారులు నిర్ధారించారు. కానీ వారి పేర్లను తిరిగి చేర్చేందుకు అవసరమైన రోల్‌బ్యాక్ సౌకర్యం యాప్‌లో లేదు. దీంతో గోవా ప్రధాన ఎన్నికల అధికారి ఢిల్లీలోని ఎన్నికల సంఘానికి పదేపదే అభ్యర్థనలు పంపారు. అయినా అనుమతి రాకపోవడంతో ఆ పేర్లు జాబితాలోకి రాలేకపోయాయి. యాప్‌పై పూర్తి నియంత్రణ ఢిల్లీ వద్దే ఉందని సమాచారం. ఓటరు జాబితాలో పేరు లేకపోతే కేవలం ఓటు మాత్రమే కాదు గోవా మెడిక్లెయిమ్ పథకం కింద డయాలసిస్, గుండె శస్త్రచికిత్స, అవయవ మార్పిడి, కీమోథెరపీ వంటి కీలక చికిత్సలకు కూడా అవకాశం దక్కదు. ఈ పథకం రాష్ట్ర ఓటర్లకే పరిమితం కావడంతో నిరుపేదలు తీవ్ర ఇబ్బందుల్లో పడుతున్నారని థరూర్ ఆందోళన వ్యక్తం చేశారు. తన సోషల్ మీడియా పోస్టులో ఆయన "ఇది కేవలం రాజకీయ సమస్య కాదు. పౌరుల ప్రాథమిక హక్కులు, ప్రాణాలు ప్రమాదంలో పడుతున్నాయి. ఇలాంటి అమానుష వ్యవస్థను కొనసాగించకూడదు. ఎన్నికల సంఘం వెంటనే క్షమాపణ చెప్పి, ఈ సాఫ్ట్‌వేర్‌ను రద్దు చేయాలి. జరిగిన నష్టాన్ని సరిదిద్దాలని స్పష్టం చేశారు.

## అంటార్కిటికాలో మంచుగణేశ్!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** స్వదేశానికి వేల కిలోమీటర్ల దూరంలో, అత్యంత శీతల ఖండమైన అంటార్కిటికాలో భారత శాస్త్రవేత్తలు వినాయక చవితి పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో, వినూత్నంగా జరుపుకున్నారు. అక్కడి భారత పరిశోధన కేంద్రమైన మైత్రిలో పనిచేస్తున్న శాస్త్రవేత్తల బృందం, మంచుతోనే గణనాథుడి విగ్రహాన్ని స్వయంగా తయారు చేసి, ప్రత్యేక పూజలు నిర్వహించి తమ సంప్రదాయంపట్ల ఉన్న గౌరవాన్ని చాటుకున్నారు. ఈ అపురూప వేడుక ఇప్పుడు సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. నేషనల్ సెంటర్ ఫర్ పోలార్ అండ్ ఓషన్ రీసెర్చ్‌కు చెందిన ఈ పరిశోధకులు, గడ్డకట్టే చలిలో తమకు అందుబాటులో ఉన్న మంచును ఉపయోగించి ఒక సుందరమైన గణపతి రూపాన్ని తీర్చిదిద్దారు. ఎలాంటి అచ్చులు లేకుండా, కేవలం చేతులతోనే ఈ విగ్రహాన్ని రూపొందించడం వారి సృజనాత్మకతకు, భక్తికి నిదర్శనంగా నిలిచింది. అనంతరం హిందూ సంప్రదాయం ప్రకారం విగ్రహానికి హారతి ఇచ్చి, పూజలు చేశారు. నైవేద్యంగా మోదకాలు వంటి ప్రసాదాలను సమర్పించి పండుగ వాతావరణాన్ని సృష్టించారు. ఈ వేడుకలో అత్యంత ప్రత్యేకమైన ఘట్టం నిమజ్జనం. అంటార్కిటికాలోని సున్నితమైన, కాలుష్యరహిత పర్యావరణానికి ఎలాంటి హాని కలగకూడదనే గొప్ప ఉద్దేశంతో వారు పర్యావరణ హితమైన పద్ధతిని ఎంచుకున్నారు. బయట సహజ నీటి వనరులలో కాకుండా, పరిశోధన కేంద్రం లోపలే ఒక బకెట్‌లో నీటిని తీసుకుని, అందులో మంచు గణపతి విగ్రహాన్ని ఉంచారు. కొద్దిసేపటికే మంచు పూర్తిగా కరిగి విగ్రహం నీటిలో కలిసిపోయింది. ఈ విధంగా వారు పర్యావరణ నిబంధనలను పాటిస్తూనే తమ సాంప్రదాయాన్ని పూర్తిచేశారు.

## భారీ విస్తరణ దిశగా ఫోన్‌పే

### 20 వేల మందికిపైగా ఉద్యోగావకాశాలు

**ముంబయి, సెప్టెంబరు 24:** ప్రముఖ డిజిటల్ చెల్లింపుల సంస్థ ఫోన్‌పే భారత్‌లో తన కార్యకలాపాలను భారీ స్థాయిలో విస్తరించేందుకు సిద్ధమైంది. దేశంలోని మారుమూల గ్రామాలు, చిన్న పట్టణాలకు కూడా డిజిటల్ చెల్లింపుల సేవలను తీసుకెళ్లడమే లక్ష్యంగా భారీ ప్రణాళిక ప్రకటించింది. ఈ విస్తరణలో భాగంగా రాబోయే ఏడాది కాలంలో 20వేలమందికిమందికి పైగా ఫ్రంట్‌లైన్ సేల్స్ సిబ్బందిని నేరుగా నియమించుకోనున్నట్లు గురువారం వెల్లడించింది. ఈ ప్రణాళిక కింద, వచ్చే 12 నెలల్లో దేశవ్యాప్తంగా 50 లక్షలకు పైగా పేమెంట్ డివైజ్‌లను ఏర్పాటు చేయాలని ఫోన్‌పే లక్ష్యంగా పెట్టుకుంది. వీటిలో స్మార్ట్‌స్పీకర్‌లు, పీఓఎస్ మెషీన్లు వంటివి ఉంటాయి. ముఖ్యంగా ఈ పరికరాల్లో సుమారు 50 శాతం, అంటే 25 లక్షల డివైజ్‌లను టైర్6 పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని వ్యాపారులకు అందించడంపై దృష్టి సారించనుంది. తద్వారా డిజిటల్ చెల్లింపుల వ్యవస్థను అట్టడుగు స్థాయికి తీసుకెళ్లాలని భావిస్తోంది. ఇటీవల ప్రభుత్వం ప్రకటించిన మర్చంట్ డిస్కౌంట్ రేట్ (ఎండీఆర్) ఫ్రేమ్‌వర్క్, ఫోన్‌పే విస్తరణ ప్రణాళికలకు ఊతమిచ్చింది. ఈ విధానం వల్ల, మర్చంట్ల విస్తరణపై దీర్ఘకాలిక పెట్టుబడులు పెట్టేందుకు కంపెనీకి వెసులుబాటు కలిగింది. ఎండీఆర్ ద్వారా వసూలైన మొత్తంలో 5 శాతాన్ని ప్రత్యేక నిధిగా కేటాయించి, దానిని చిన్న వ్యాపారుల నెట్‌వర్క్‌ను పెంచేందుకు వినియోగిస్తున్నారు. గతేడాది ప్రవేశపెట్టిన నూతన కార్మిక చట్టాలు (లేబర్ కోడ్స్) కూడా నియామక ప్రక్రియను వేగవంతం చేశాయని, పెద్ద సంఖ్యలో ఉద్యోగులను సులభంగా నియమించుకునేందుకు దోహదపడ్డాయని కంపెనీ పేర్కొంది. ఈ విస్తరణ ద్వారా దేశంలోని లక్షలాది మంది చిరు వ్యాపారులను అధికారిక ఆర్థిక వ్యవస్థ పరిధిలోకి తీసుకురావాలని ఫోన్‌పే ఆశిస్తోంది.

## మంటల్లో స్లీపర్ బస్సు

### గ్రేటర్ నోయిడాలో ఘోర ప్రమాదం - 9 మంది సజీవదహనం



**గ్రేటర్ నోయిడా,సెప్టెంబరు 24:** ఉత్తరప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడా పరిధిలో యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై బుధవారం అర్ధరాత్రి ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. ప్రయాణికులతో వెళ్తున్న స్లీపర్ టూరిస్ట్ బస్సులో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో ఓ మహిళ సహా కనీసం 9 మంది సజీవ దహనమయ్యారు. పలువురు ప్రయాణికులు గాయపడ్డారు. బస్సులో మొత్తం 35 మంది ప్రయాణికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు. నోయిడా నుంచి ఉత్తరప్రదేశ్‌లోని మహోబాకు వెళ్తున్న ఈ బస్సు యమునా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రయాణిస్తుండగా మంటలు అంటుకున్నాయి. ప్రమాదం జరిగిన సమయంలో ఎక్కువ మంది ప్రయాణికులు నిద్రలో ఉన్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తు ప్రకారం బస్సులోని ఎయిర్ కండిషనింగ్ (ఏసీ) వ్యవస్థలో పేలుడు సంభవించడం వల్ల మంటలు చెలరేగినట్లు తెలుస్తోంది. ఈ మంటలు ఇంజిన్‌లోని లూబ్రికేటింగ్ ఆయిల్‌కు అంటుకోవడంతో వేగంగా మొత్తం బస్సుకు వ్యాపించినట్లు అధికారులు తెలిపారు. మంటలు ఒక్కసారిగా వ్యాపించడంతో బస్సులో ఉన్న ప్రయాణికుల్లో తీవ్ర భయాందోళనలు నెలకొన్నాయి. కొందరు ప్రాణాలు కాపాడుకునేందుకు బస్సు కిటికీల నుంచి బయటకు దూకారు. మంటలు బస్సును పూర్తిగా చుట్టుముట్టడంతో పరిస్థితి అత్యంత విషమంగా మారింది. సమాచారం అందుకున్న వెంటనే ఫైర్ బ్రిగేడ్ సిబ్బంది, జేవర్ పోలీస్ స్టేషన్ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రధానమంత్రి జాతీయ సహాయ నిధి నుంచి ఒక్కొక్కరికి రూ.2 లక్షల పరిహారం ప్రకటించారు. గాయపడిన వారికి ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున ఆర్థిక సహాయం అందించనున్నట్లు తెలిపారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఘటనపై ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50 వేల చొప్పున పరిహారం అందించాలని సీఎం ఆదేశించారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా సహాయం అందించాలని అధికారులకు సూచించారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. బస్సు డ్రైవర్, కండక్టర్‌ను అరెస్ట్ చేసినట్లు అధికారులు తెలిపారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

## మాపై యుద్ధానికి 47 దేశాల పౌరులు

### రష్యా కుట్రలను తెలుసుకోవాలని జెలెన్‌స్కీ పిలుపు



**న్యూయార్కు, సెప్టెంబరు 24:** ఉక్రెయిన్‌పై సాగిస్తున్న యుద్ధంలో రష్యా విదేశీ పౌరులను కూడా వాడుకుంటోందని, ఈ జాబితాలో భారతీయులు కూడా ఉన్నారని ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీ సంచలన ఆరోపణలు చేశారు. బుధవారం న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ ఈ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. రష్యా తమ సైన్యంలోకి భారత్ సహా మొత్తం 47 దేశాల పౌరులను నియమించుకుని, వారిని యుద్ధ రంగంలోకి దించుతోందని ఆరోపించారు. ఈ జాబితాలో ఘనా, నేపాల్, తజికిస్థాన్, భారత్, యెమెన్, కెన్యా, జింబాబ్వే, క్యూబా, బెలారస్, సుడాన్, దక్షిణాఫ్రికా వంటి దేశాల పేర్లను జెలెన్‌స్కీ ప్రస్తావించారు. మోసపూరిత మార్గాల్లో, జిమ్మిక్కులు చేసి ఈ దేశాల పౌరులను రష్యా తమ దేశానికి రప్పించుకుంటోందని, ఆ తర్వాత వారిని బలవంతంగా సైనిక సేవలోకి దించుతోందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రష్యా చేస్తున్న ఈ చర్యల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయా దేశాలకు పిలుపునిచ్చారు. ఈ 47 దేశాల ప్రతినిధులతో నేను నేరుగా మాట్లాడాలనుకుంటున్నాను. రష్యా మీ ప్రజలతో ఏం చేస్తోందో మీకు తెలుసు. వారు మీ పౌరులు. వారిని జాగ్రత్తగా చూసుకోండి. వారిని మరో యుద్ధ క్షేత్రంలోకి నెట్టవద్దు. ఈ యుద్ధంలోకి పుతిన్ మిమ్మల్ని లాగకుండా చూసుకోండని జెలెన్‌స్కీ విజ్ఞప్తి చేశారు.

ఇదే సమయంలో ఉత్తర కొరియాతో రష్యా సైనిక సహకారంపైనా జెలెన్‌స్కీ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఉక్రెయిన్ సైన్యం ఇద్దరు ఉత్తర కొరియా సైనికులను యుద్ధ ఖైదీలుగా పట్టుకుందని, వారిని దక్షిణ కొరియాకు అప్పగించామని తెలిపారు. మరోవైపు, ఉక్రెయిన్ తన రక్షణ భాగస్వామ్యాలను విస్తరించుకుంటోందని, ఇందులో భాగంగా ఫిన్‌లాండ్‌తో డ్రోన్ల ఒప్పందం, ఆస్ట్రేలియాతో భద్రతా ఒప్పందం కుదుర్చుకున్నట్లు వివరించారు. యుద్ధాన్ని కొనసాగించే రష్యా సామర్థ్యాన్ని పరిమితం చేసేందుకు అంతర్జాతీయ సమాజం మరింత కఠినమైన చర్యలు తీసుకోవాలని ఆయన తన ప్రసంగం ద్వారా కోరారు.

# సంక్షిప్త వార్తలు

## బీహార్‌లో మరో యువతిపై లైంగిక వేధింపులు

**పాట్నా,సెప్టెంబరు 24:** బిహార్‌లో మరో యువతిని కొందరు వేధించిన ఘటన వెలుగులోకి వచ్చింది. జముయ్‌లో పదో తరగతి బాలికపై వేధింపుల ఘటన జరిగిన కొన్ని రోజులకే సమస్తిపూర్‌లో ఇలాంటి ఘటన చోటుచేసుకున్నట్లు ఆరోపణలు వచ్చాయి. యువతిని కొందరు చుట్టుముట్టి వేధిస్తున్న దృశ్యాలతో కూడిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఐదుగురిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. సమస్తిపూర్ జిల్లా కేంద్రానికి కొన్ని కిలోమీటర్ల దూరంలోని జగత్‌సింగ్‌పూర్ గ్రామం వద్ద బైపాస్ రోడ్డుపై ఘటన జరిగినట్లు పోలీసులు చెబుతున్నారు.

## స్తంభాన్ని ఢీకొన్న కారు.. మంటల్లో ఇద్దరు సజీవదహనం



**గువాహతి, సెప్టెంబరు 24:** ఒక వాహనం అదుపు తప్పింది. డివైడర్‌తో పాటు స్ట్రీట్‌లైట్ పోల్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో ఆ వాహనంలో మంటలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో అందులో ఉన్న ఇద్దరు వ్యక్తులు సజీవ దహనమయ్యారు. తీవ్రంగా కాలిన గాయాలైన మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. అసోంలోని నాగావ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నలుగురు వ్యక్తులు అరుణాచల్ ప్రదేశ్ నుంచి గువాహతికి కియా కారులో ప్రయాణమయ్యారు. అది డివైడర్‌ను ఢీ కొట్టింది. ఆ తర్వాత డివైడర్ మధ్యలోని వీధిలైట్ స్తంభాన్ని ఢీకొట్టి పల్టీలు కొట్టింది. కాగా, ఈ ప్రమాదం ధాటికి ఆ కారులో మంటలు చెల రేగాయి. ప్రయాణిస్తున్న నలుగురు అందులో చిక్కుకుపోయారు. ఇద్దరు వ్యక్తులు సజీవదహన మయ్యారు.

## అఫ్ఘాన్‌లోని పది చోట్ల పాక్ వైమానిక డ్రోన్లతో దాడి



కాబూల్, సెప్టెంబరు 24: పాకిస్థాన్‌అఫ్ఘానిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తీవ్రరూపం దాల్చాయి. అఫ్ఘాన్ భూభాగంలోని 10 ప్రాంతాలపై పాకిస్థాన్ వైమానిక, డ్రోన్ దాడులు చేసింది. అఫ్గానిస్థాన్ నుంచి తమ భూభాగంపై జరిగిన డ్రోన్ దాడులకు ప్రతిస్పందనగానే తాజా దాడులు చేసినట్టు పాకిస్థాన్ పేర్కొంది. డ్రోన్లను నిల్వ చేయడం, ప్రయోగించడం కోసం ఆ ప్రాంతాలను ఉపయోగిస్తున్నారని పాకిస్థాన్ పేర్కొంది. పాకిస్థాన్ సమాచార శాఖ మంత్రి అత్తావుల్లా తరార్ గురువారం ఈ దాడుల విషయాన్ని వెల్లడించారు.

## పండుగల వేళ అదుపులోనే చక్కెర ధరలు!

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** దసరా, దీపావళి పండుగల వేళ చక్కెర ధరలు అదుపులో ఉండేలా ప్రభుత్వం, చక్కెర పరిశ్రమ కలిసి పనిచేస్తున్నాయని ఇండియన్ షుగర్ అండ్ బయోఎనర్జీ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఇస్మా) డైరెక్టర్ జనరల్ దీపక్ బల్లానీ తెలిపారు. పండుగల సమయంలో డిమాండ్ పెరిగినా వినియోగదారులకు అందుబాటులో ధరల్లో చక్కెర అందేలా చూడటం తమ ప్రధాన లక్ష్యమని చెప్పారు. దేశీయ మార్కెట్లో చక్కెర నిల్వలు, సరఫరా తగినస్థాయిలో ఉన్నాయని పేర్కొన్నారు. రిటైల్ మార్కెట్లో చక్కెర ధరలు ఇప్పటికే తగ్గుముఖం పట్టాయని బల్లానీ తెలిపారు.

## వేల్స్‌లో కుప్పకూలిన రాయల్ ఎయిర్‌ఫోర్స్ విమానం



**లండన్, సెప్టెంబరు 24:** యూకేకు చెందిన రాయల్ ఎయిర్ ఫోర్స్ విమానం వేల్స్ నగరంలో ప్రమాదానికి గురైంది. ఈ ప్రమా దంలో ఇద్దరు పైలట్లు స్వల్పంగా గాయపడ్డారు. ది హాక్ 2 ఎయిర్ క్రాఫ్ట్ యాంగ్లెసీలోని రాయల్ ఎయిర్‌ఫోర్స్ వ్యాలీ నుంచి బయల్దేరిన కొద్దిసేపటికి ప్రమాదవశాత్తూ వేల్స్ లోని పెన్ కార్నిసియోంగ్ ప్రాంతంలో కుప్పకూలింది. ఆ తర్వాత విమానం మంటల్లో చిక్కుకుని పూర్తి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో గాయపడిన ఇద్దరు పైలట్స్ ను సమీప ఆస్పత్రికి తరలించినట్లు నార్త్ వేల్స్ పోలీసులు స్పష్టం చేశారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతాం

## 'సర్'పై ఎన్నికల సంఘం ప్రజలకు పూర్తి స్పష్టత ఇవ్వాలి

### ఓటర్ల హక్కులపై ఎలాంటి అనుమానాలకు తావులేకుండా పారదర్శకత అవసరం: మంత్రి పొన్నం

**హైదరాబాద్ సెప్టెంబరు 24,ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యానికి పునాది వంటి ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విషయంలో వ్యవహరిస్తున్న తీరుపై ఇటీవల వెలుగులోకి వచ్చిన అంశాలు ప్రజల్లో అనేక సందేహాలు, అనుమానాలను కలిగిస్తున్నాయని, ప్రతి అర్హుడైన పౌరుడికి ఓటు హక్కు ఉండేలా చూడటం అనే కీలక బాధ్యతనుఎన్నికల సంఘం విస్మరిస్తోందనే అభిప్రాయం బలపడుతోందని రవాణా మరియు బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతామనీ ఆయన వయోజనులకు హామి ఇచ్చారు. ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి దాదాపు 14 సార్లు అభ్యంతరాలు తెలిపినా వాటిని పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా ఓటర్ల జాబితా సవరణ ఒక రాజకీయపార్టీకి లబ్ధి కలిగించేలా చేశారని ప్రజలు అనుమాన పడుతున్నారనీ ఇది ప్రజాసామ్య వ్యవస్థపై నమ్మకం లేకుండా చేస్తోందని ఆయన ఆవేదన చెందారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఓటర్ల డేటాబేస్ నిర్వహణ, ఎన్నికల జాబితా సాఫ్ట్‌వేర్‌కు లోపభూయిష్టంగా ఉందనే మిగితా ఎన్నికల కమీషర్‌ల అభిప్రాయం కూడా లెక్కలోకి తీసుకొని ఇప్పటికైనా మళ్ళీ ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయాలని ఆయన కోరారు. కొత్తగా ఓటు హక్కు పొందే పౌరులు ఉపయోగించే ఫారం6లో సర్‌కు సంబంధించిన ప్రశ్నలను చేర్చడంపై ఇద్దరు ఎన్నికల కమిషనర్లు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు నివేదికలు చెబుతున్నాయని మంత్రి అన్నారు.ఫారం6 అనేది నిబంధనల ప్రకారం నిర్దేశించిన చట్టబద్ధమైన ఫారం అయితే, అందులో మార్పులు చేయడానికి ఏ ప్రక్రియ అనుసరించారు? ఎవరి అనుమతితో మార్పులు చేశారు? ఆ మార్పులకు చట్టపరమైన ఆధారం ఏమిటి? అనే విషయాలను ఎన్నికల సంఘం ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలని డిమాండ్ చేశారు.



ముఖ్యంగా తొలిసారి ఓటు హక్కు పొందే యువతకు ఎలాంటి అనవసర ఇబ్బందులు కలగకుండా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందన్నారు.
ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న అనుమానాలకు తావులేకుండా వ్యవహరించాలి కానీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ నాయకత్వంలోని ఎన్నికల సంఘం ఎవరి ప్రయోజనాల కోసం పనిచేస్తుందన్న ప్రశ్నలు ప్రజల్లో తలెత్తిందని ఆయన ఆవేదన చెందారు. ప్రతి నిర్ణయం చట్టబద్ధంగా, పారదర్శకంగా, జవాబుదారీతనంతో ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు.అదే సమయంలో, ఎన్నికల సంఘం అన్ని నిర్ణయాలు ముగ్గురు కమిషనర్ల ఏకాభిప్రాయంతోనే జరిగాయని ఎన్నికల సంఘం వర్గాలు స్పష్టం చేసిన విషయాన్ని కూడా ప్రస్తావిస్తూ, వివిధ స్థాయిల్లో నమోదైన అభ్యంతరాలపై పూర్తి వివరాలను బహిరంగపరచడం ద్వారా ప్రజలకు స్పష్టత ఇవ్వాలని కోరారు.తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు హక్కును కాపాడుతామనీ ఆయన తెలిపారు.
తెలంగాణలో అర్హత కలిగిన ప్రతి పౌరుడి ఓటు హక్కు కాపాడబడేలా ప్రభుత్వం అప్రమత్తంగా ఉంటుందని మంత్రి స్పష్టం చేశారు.ఒక్క అర్హుడైన ఓటరు పేరు కూడా పొరపాటున తొలగించకుండా చూడటం ఎంత ముఖ్యమో, అనర్హమైన పేర్ల విషయంలో చట్టం, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం కూడా అంతే ముఖ్యమని అన్నారు.
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత కీలకమైన రాజ్యాంగ హక్కు అని, అందువల్ల ఓటర్ల జాబితా తయారీ, సవరణ, పేర్ల తొలగింపు, కొత్త ఓటర్ల నమోదు, డేటా మార్పులు వంటి ప్రతి దశలో పారదర్శకత, చట్టబద్ధత, జవాబుదారీతనం తప్పనిసరిగా ఉండాలని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.



గురువారం శిల్పకళావేదికలో శ్రీరామ్‌గ్రూప్ నిర్వహించిన మిషన్ 10వ తరగతి-రివార్డ్ అండ్ రికగ్నిషన్ కార్యక్రమంలో ఓ విద్యార్థినికి ప్రోత్సాహకం అందజేస్తున్న గవర్నర్ శివప్రతాప్‌శుక్లా

# పెద్ద కలలు కనండి.. లక్ష్యాలను సాధించండి

## పరిస్థితులు ప్రతిభకు అడ్డంకులు కావు: గవర్నర్ శివప్రతాప్ శుక్లా

### 632 మంది ఎస్సెస్సీ టాపర్లకు రూ.2.27 కోట్ల ప్రోత్సాహకాలు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** పదో తరగతి ఫలితాలు జీవితానికి ముగింపు కాదని.. ఉన్నత లక్ష్యాల వైపు సాగేందుకు తొలి అడుగు మాత్రమేనని గవర్నర్ శివప్రతాప్ శుక్లా అన్నారు. విద్యార్థులు పెద్ద కలలు కనాలని, కష్టపడి వాటిని సాకారం చేసుకోవాలని సూచించారు. ప్రతిభకు ఆర్థిక పరిస్థితులు, వనరుల కొరత అడ్డంకులు కావని స్పష్టం చేశారు. గురువారం హైటెక్ సిటీలోని శిల్పకళావేదికలో శ్రీరామ్‌గ్రూప్ నిర్వహించిన మిషన్ 10వ తరగతి-రివార్డ్ అండ్ రికగ్నిషన్ కార్యక్రమానికి గవర్నర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తెలంగాణ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 632 మంది ఎస్సెస్సీ టాపర్లకు సుమారు రూ.2.27 కోట్ల ప్రోత్సాహకాలను అందిస్తున్న శ్రీరామ్ గ్రూప్‌ను గవర్నర్ అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి గవర్నర్ మాట్లాడుతూ.. మీరు ఎక్కడి నుంచి వచ్చారో, ఎలాంటి పరిస్థితుల్లో పెరిగారో మీ కలలకు అది పరిమితి కాకూడదు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థి తాను అనుకున్నది సాధించగలడు అని పేర్కొన్నారు. విద్యతోపాటు జిజ్ఞాస, క్రమశిక్షణ, మంచి వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుంటూ చదవాలని, ప్రశ్నలు అడుగుతూ నిరంతరం నేర్చుకోవాలని చెప్పారు. తమ విజయానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల కృషిని విద్యార్థులు ఎప్పటికీ మర్చిపోవద్దని గవర్నర్ సూచించారు. భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు చేరుకున్న తర్వాత తమ పాఠశాలలకు, సమాజానికి తిరిగి సేవ చేయాలని ఆకాంక్షించారు. పెద్దకలలు కనండి.. కష్టపడి పనిచేయండి, అత్యుత్తమ ప్రతిభ కనబరిచి తెలంగాణకు పేరు తీసుకురండి అని విద్యార్థులకు గవర్నర్ పిలుపునిచ్చారు.

# ఎస్ఐ వెంకన్న మరణం పోలీసు శాఖకు తీరని లోటు

## ప్రమాదానికి కారణమైన నిందితుడిపై చట్టపరంగా చర్యలు: సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** హైదరాబాద్ గణేశ నిమజ్జనం బందోబస్తు విధుల్లో ఉన్న కొత్తగూడెం టూటౌన్ ఎస్ఐ కె. వెంకన్న గుర్తుతెలియని వాహనం ఢీకొన్న దుర్ఘటనలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందడం అత్యంత బాధాకరమని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో అంకిత భావంతో విధులు నిర్వర్తిస్తూ ప్రాణాలు కోల్పోవడం విషాదకరమని వ్యాఖ్యానించారు. వెంకన్న మరణం ఆయన కుటుంబానికే కాకుండా మొత్తం పోలీసు శాఖకు తీరని లోటని అన్నారు. వెంకన్న పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుడిని ప్రార్థిం చారు. ఈ విషాదకరమైన సమయంలో వెంకన్న కుటుంబ సభ్యులకు ముఖ్యమంత్రి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.వెంకన్న కుటుంబాన్ని ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలబడుతుందని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. బాధ్యతారాహిత్యంగా వాహనం నడిపి ఈ ప్రమాదానికి కారణమైన నిందితుడిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి పోలీసు అధికారులను ఆదేశించారు.



ఎస్ఐ కె.వెంకన్న (ఫైల్)

# జూరాల ఆయకట్టుకు వారాబందీతో సాగునీరు

## రైతులను కాపాడుకునే బాధ్యత ప్రభుత్వానిదే

### జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వం: మంత్రి వాకిటి శ్రీహరి

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** జూరాల ప్రాజెక్టు ఆయకట్టు రైతులకు వారాబందీ విధానంలో సాగునీటిని అందిస్తామని రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య,యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. రైతులకు సాగునీటి విషయంలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చూస్తామని తెలిపారు. వనపర్తి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఉమ్మడి పాలమూరు జిల్లా ఇరిగేషన్ శాఖ అధికారులతో మంత్రులు వాకిటి శ్రీహరి, జూపల్లి కృష్ణారావు, ఎంపి మల్లు రవి, ఎమ్మెల్యేలు సమీక్ష సమావేశం నిర్వహించారు. జూరాల ప్రాజెక్టు ఆయకట్టుకు సాగునీటి విడుదల, నీటి లభ్యత, ఆయకట్టు అవసరాలు, పంటలకు నీటి సరఫరా తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రస్తుత నీటి పరిస్థితిపై అధికారుల నుంచి వివరాలు తీసుకుని, రైతులకు సకాలంలో సాగునీరు అందించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు.అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ రైతులపై నిజమైన ప్రేమ కాంగ్రెస్ ప్రభుత్వానికే ఉందన్నారు. రైతులను కాపాడుకునే బాధ్యత ప్రజా ప్రభుత్వంపై ఉందని, ఒక్క ఎకరా కూడా ఎండిపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పారు.కృష్ణా నదిలో నీటి లభ్యత, జూరాల ఆయకట్టు అవసరాలను దృష్టిలో ఉంచుకుని వారాబందీ పద్ధతిలో సాగునీటిని అందిస్తామని తెలిపారు. వచ్చే వేసవిలో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పాలమూరురంగారెడ్డి ప్రాజెక్టుపై తగిన శ్రద్ధ చూపలేదని మంత్రి విమర్శించారు. ఎన్నికల ముందు నార్లాపూర్ వద్ద ఒక్క పంపును ఆన్ చేసి ప్రాజెక్టు పూర్తయినట్లు ప్రచారం చేశారని ఆరోపించారు. పాలమూరు రైతుల ప్రయోజనాల కోసం గతంలో వరద నీటిని వినియోగించడంపై, కృష్ణా-భీమా నదులపై అవసరమైన బ్యారేజీల నిర్మాణంపై ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.కర్ణాటక ప్రభుత్వంతో చర్చలు జరిపి జూరాలకు నీటిని తీసుకురావడంపై ప్రభుత్వం ముందుగానే చర్యలు చేపట్టిందని, అయితే దీనిపై ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని మంత్రి పేర్కొన్నారు.రైతులకు సాగునీటిని వారాబందీలో ఇస్తామన్నారు.రైతులను కాపాడుకునే బాధ్యత మాదని తేల్చి చెప్పారు . జిల్లాలో ఒక్క ఎకరా కూడా ఎండనివ్వమని,వచ్చే వేసవిలో తాగునీటి సమస్య రాకుండా కూడా చర్యలు తీసుకుంటామని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు.జూరాల ప్రాజెక్టు నిర్మాణ నాణ్యతను ప్రస్తావిస్తూ, భారీ వరద ప్రవాహాలు వచ్చిన సందర్భాల్లోనూ ప్రాజెక్టు నిలకడగా ఉందని మంత్రి పేర్కొన్నారు. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు

# బస్సు కిందపడి చిన్నారి మృతి

**చిన్నశంకరంపేట, సెప్టెంబరు 24,ప్రభాతవార్త:** స్కూల్ బస్సు కింద పడి చిన్నారి మృతి చెందిన ఘటన చిన్నశంకరంపేట మండల పరిధి జంగరాయి గ్రామంలో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. ఎస్ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన బొమ్మరబోయిన కృష్ణ, లావణ్య దంపతులకు ముగ్గురు కుమార్తెలు. మూడవ కుమార్తె కీర్తన(6), మండల కేంద్రంలోని సరస్వతి పాఠశాలలో యూకేజీ చదువుతుంది. రోజూ మాదిరిగానే పాఠశాలకు వెళ్లి సాయంత్రం బస్సు దిగి ఇంటికి వెళ్తున్న సమయంలో నలుగురు పిల్లలు బస్సు దిగి ముందుకు నడుస్తుండగా డ్రైవర్ నిర్లక్ష్యంగా బస్సు ముందుకు పోనివ్వగా, క్లీనర్ ఆపమని చెప్పిన డ్రైవర్ వినిపించుకోలేదు. దీంతో చిన్నారి కీర్తన బస్సు ముందు బంపర్‌కు తగిలి వెనుక టైర్ల కిందపడటంతో తలకు తీవ్ర గాయాలు కాగా, వెంటనే 108 వాహనంలో తూప్రాన్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందింది. తండ్రి కృష్ణ ఫిర్యాదు మెరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.



చిన్నారి కీర్తన (ఫైల్)

# తెలంగాణ ఏరోస్పేస్, రక్షణ రంగాల సత్తాను చాటనున్న రక్షా ఎక్స్‌పో 2026

## రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్‌జాజు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** డిసెంబరు 7 నుండి 9 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీలో జరగనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 లో భాగంగా తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా "రక్షా ఎక్స్‌పో 2026ను నిర్వహించనున్నట్లు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జజు గురువారం ప్రకటించారు. ఢిల్లీలో జరిగిన న్యూస్18 డిఫ్‌కాన్ 2026 సదస్సులో ఆయన ప్రసంగిస్తూ.. ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, రక్షణ రంగ కంపెనీలు, భారతీయ తయారీదారులు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, టెక్నాలజీ డెవలపర్లు ఈ ఎక్స్‌పోలో పాల్గొని తెలంగాణలో ఉన్న అవకాశాలను అన్వేషించాలని ఆహ్వానించారు.
ఈ ఎక్స్‌పో ప్రధానంగా వ్యాపార వృద్ధిపై దృష్టి పెట్టనుంది. గ్లోబల్ ఒరిజినల్ ఎక్విప్‌మెంట్ తయారీదారులు, భారతీయ కంపెనీలు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌లు, ప్రొక్యూర్‌మెంట్ బృందాల మధ్య ప్రత్యేకంగా బిజినెస్‌టుబిజినెస్ (బి2బి) సమావేశాలు, ప్రత్యక్ష చర్చలు జరుగుతాయని తెలిపారు. ఈ వేదిక వెండార్ల అభివృద్ధికి, సాంకేతిక భాగస్వామ్యాలకు, భారతీయ సరఫరాదారులను దేశీయ, అంతర్జాతీయ సప్లై చైన్‌లలో అనుసంధానించడానికి ఎంతగానో దోహదపడుతుందని పేర్కొన్నారు. తెలంగాణలో తయారీ కేంద్రాలు, గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు , ప్రత్యేక ఇంజనీరింగ్ టెస్ట్ బెడ్‌లు, జాయింట్ వెంచర్ల ఏర్పాటుకు భారతీయ సరఫరాదారులను ఎంపిక చేసుకోవాలని గ్లోబల్ కంపెనీలను ప్రోత్సహించనున్నట్లు స్పష్టం చేశారు. పాల్గొనే కంపెనీలకు, కాబోయే వ్యాపార భాగస్వాములకు మధ్య ముందే నిర్ధారించిన సమావేశాలను ఏర్పాటు చేయడానికి మిలిటరీ అటాచ్‌లు, కౌన్సులర్ ట్రేడ్ ఆఫీసులు కూడా సహకరిస్తాయని వివరించారు.
రక్షా ఎక్స్‌పో 2026లో ప్రత్యేకంగా ఏరోస్పేస్, డిఫెన్స్ అండ్ స్పేస్ కాంక్లేవ్, అధునాతన సాంకేతిక ప్రదర్శన, ఎయిర్ షో మరియు లైవ్ ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. కంపెనీలు తమ డ్రోన్లు, కౌంటర్‌డ్రోన్ సిస్టమ్స్, అటానమస్ ప్లాట్‌ఫారమ్‌లు, ల్యాండ్‌బేస్డ్ రక్షణ పరికరాలను ప్రదర్శించవచ్చని అన్నారు. వివిధ దేశాలకు చెందిన పెవిలియన్‌లతో పాటు, భారతీయ ఎంఎస్ఎంఈలు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక టెక్నాలజీ జోన్‌లను కూడా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.
ఈ ప్రసంగంలో, 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణ ఏరోస్పేస్, రక్షణరంగ ఎగుమతులలో సాధించిన 103 శాతం వృద్ధిని, అలాగే వ్యూహాత్మక పరిశోధనా సంస్థలు, డిఫెన్స్ పీఎస్‌యూలు, దాదాపు 1,500 నుండి 2,000 ప్రెసిషన్ ఇంజనీరింగ్ ఎంఎస్ఎంఈలతో కూడిన బలమైన పర్యావరణ వ్యవస్థను ప్రధాన కార్యదర్శి హైలైట్ చేశారు. డ్రోన్లు, కౌంటర్‌డ్రోన్ సిస్టమ్స్, ఏవియానిక్స్, అధునాతన మెటీరియల్స్, ప్రొపల్షన్, స్పేస్ టెక్నాలజీస్ మరియు ఎయిర్‌క్రాఫ్ట్ మెయింటెనెన్స్, రిపేర్ అండ్ ఓవర్‌హాల్ రంగాలలో రాష్ట్రం తన సామర్థ్యాలను విస్తరిస్తోందని ఆయన తెలిపారు.ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ 2026 కు హాజరుకావాల్సిందిగా రక్షా ఎక్స్‌పో 2026ను ప్రారంభించాల్సిందిగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇటీవల న్యూఢిల్లీలో కేంద్ర రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వ్యక్తిగతంగా ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు.ఏరోస్పేస్ మరియు రక్షణ రంగాలలో సోర్సింగ్ భాగస్వామ్యాలు, సాంకేతిక సహకారం, పెట్టుబడులు మరియు దీర్ఘకాలిక వ్యాపార సంబంధాలను సులభతరం చేసే ఫలితాధారిత పారిశ్రామిక వేదికగా రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు పేర్కొన్నారు.

# పవర్‌ప్లాంట్లలో అవినీతికి పాల్పడి ఇప్పుడు బిఆర్ఎస్ గగ్గోలు

## ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** పవర్ ప్లాంట్ల పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అవినీతి పాల్పడి ఇప్పుడు అదే థర్మల్ పవర్ ప్లాంట్ల వద్దకు వెళ్లి గగ్గోలు పెడుతున్నారని ఎంపి చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. గాంధీ భవన్‌లో విలేఖరులతో మాట్లాడుతూ యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌కు నాణ్యమైన బొగ్గు సరఫరాకు బిఆర్ఎస్ ప్రభుత్వంలో సరైన చర్యలు తీసుకోలేదనీ ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకే యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌ను పూర్తి స్థాయి వినియోగంలోకి తెచ్చామని వివరించారు. విద్యుత్ కొనుగోళ్లలో కమీషన్లు దండుకున్నారనీ సింగరేణిలో కోయగూడెం, సత్తుపల్లి బ్లాకులను బిఆర్ఎస్ హయాంలో ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో పెట్టారని ఆయన విమర్శించారు. 18 గనులు మూతపడే పరిస్థితి బిఆర్ఎస్ హయాంలో వచ్చిందని కాళేశ్వరం పరిస్థితి లాగానే థర్మల్ పవర్‌ప్లాంట్ల పరిస్థితి ఉందన్నారు. సింగరేణిలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత బొగ్గు ఉత్పత్తి పెరిగిందని తెలిపారు. కొత్త గనులు సింగరేణికి వచ్చేవిధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు తీసుకుందనీ, సింగరేణిలో బొగ్గు 90 శాతం తెలంగాణకు వాడుతున్నామని దాదాపు 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గులో 36 లక్షల మెట్రిక్ టన్నులు తెలంగాణ విద్యుత్ అవసరాలకు వాడుతున్నామని ఆయన గణాంకాలతో వివరించారు.
బిఆర్ఎస్ హయాంలో సింగరేణికి 35 వేల కోట్ల బకాయిలు పెట్టారని ఆవేదన చెందారు. ఎకరం నీళ్లు పారని కాళేశ్వరానికి లక్షన్నర కోట్లు ఖర్చు పెట్టారనీ కార్పొరేషన్ల పేరుతో ఇష్టం వచ్చినట్లు అప్పులు తీసుకున్నారని అన్నారు. బిఆర్ఎస్ హయాంలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాగ్ బుక్ లు చెక్ చేస్తే విద్యుత్ సప్లై రైతులకు 12 గంటలు కనీసం ఇవ్వలేదని తేలిందని బిఆర్ఎస్ చేసిన అప్పులకు ప్రతి నెలకు 8 వేల కోట్ల వడ్డీ కడుతున్నామని ఆయన అన్నారు. బషీర్‌బాగ్ కాల్పుల సమయంలో కెసిఆర్ చంద్రబాబు వెంట ఉన్నారని ఆయన విద్యుత్ కష్టాలపై మాట్లాడే అర్హతలేదని, ఉచిత విద్యుత్ కాంగ్రెస్ పేటెంట్ అనీ కెటిఆర్ ఏం చెప్పినా తెలంగాణ ప్రజలు నమ్మరని ఆయన ధీమా వ్యక్తంచేశారు. విద్యుత్‌లో దోపిడీకి జగదీశ్‌రెడ్డి కారణం.. తెలంగాణ సమాజాన్ని బిఆర్ఎస్ పక్క దారి పట్టించింది అని అన్నారు. రాష్ట్రంలో వర్షాలు పడకుండా రైతులు ఇబ్బంది పడాలని కెటిఆర్ మొక్కులు మొక్కుతున్నారని అన్నారు.
మీరు పూజలు చేసినంత మాత్రాన ప్రజలకు కరువు రాదని ఆయన తెలిపారు. ప్రజలకు కాంగ్రెస్ పై కోపం వస్తే నేను ముఖ్యమంత్రి కావాలని కెటిఆర్ కలలు కంటున్నారని ఆయన అన్నారు.సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తున్నాం, అన్ని సందర్భంలో కోర్టులు జోక్యం చేసుకోవాలని అన్నారు, లోక్‌సభలో, రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ ఎంపిలు ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని ఆయన కోరారు. ఆమ్ ఆద్మీ పార్టీ రాజ్యసభ ఎంపీలను బిజెపిలో చేర్చుకున్నారని గుర్తుచేశారు.

# ఉద్యాన శాఖ సమస్యలు పరిష్కరించాలి

## అధికారుల కొరత తీర్చాలి

### అక్టోబరు 5లోగా పరిష్కరించకుంటే నిరసనలు

### రాష్ట్ర ఉద్యాన శాఖ అధికారుల సంఘం అల్టిమేటం

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** తమ డిమాండ్ల సాధనకై రాష్ట్రంలో ఉద్యాన శాఖ అధికారులు ఆందోళనలకు సిద్దమవుతున్నారు. అక్టోబర్ 5లోగా తమ సమస్యలు పరిష్కరించి. ఉద్యానశాఖను బలోపేతం చేయాలని, లేనిపక్షంలో నిరసనలకు దిగుతామని రాష్ట్ర ఉద్యానశాఖ అధికారుల సంఘం సర్కార్‌ను హెచ్చరించింది. ఈ మేరకు హైదరాబాద్‌లో ఉద్యానశాఖ డైరెక్టర్ యాస్మిన్ బాషాను కలిసి వినతిపత్రం అందజేసినట్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షులు రావుల విద్యాసాగర్, అసోసియేట్ అధ్యక్షులు పీ అనంతరెడ్డి, ప్రధాన కార్యదర్శి చింతల రోహిత్ మాట్లాడుతూ ఉద్యాన శాఖ అధికారుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించి, శాఖను బలోపేతం చేయాలని, ఆయిల్‌పామ్, మైక్రోఇరిగేషన్, ఇతర కార్యక్రమాల బాధ్యతలకు అనుగుణంగా సిబ్బందిని నియమించాలని, ప్రతీ మండలానికి ఒక ఉద్యాన విస్తరణ అధికారి, రెండు, మూడు మండలాలకు ఒక ఉద్యాన అధికారిని నియమించాలని, అర్హత కలిగిన ఉద్యాన అధికారులకు పదోన్నతులు కల్పించాలని, జిల్లా స్థాయిలో అవసరమైన పరిపాలనా, సాంకేతిక, సహాయ సిబ్బందిని నియమించాలనే డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. వాతావరణ మార్పులు, ఎల్ నినో ప్రభావం, నీటికొరత నేపథ్యంలో తకువ నీటితో అధిక దిగుబడి, అధిక ఆదాయం పొందే ఉద్యాన పంటల వైపు రైతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదన్నారు. ఉద్యాన శాఖలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో ఉన్న అధికారులపై మరింత పనిభారం పెరిగి రైతులకు అందాల్సిన సేవలపై ప్రభావం పడుతున్నదని వెల్లడించారు. రాష్ట్రంలో ప్రధానంగా ఉద్యాన పంటల సాగుకు అనుకూలమైన భూములు, వాతావరణ పరిస్థితులు, నీటి వనరులు, మార్కెట్ అవకాశాలు ఉన్నా యన్నారు. ఈ అవకాశాలు ఉన్నప్పటికీ రైతులను ఉద్యానపంటల వైపు ప్రోత్సహించేందుకు అవసరమైన క్షేత్రస్థాయి యంత్రాంగం లేదని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో ఒకో ఉద్యాన అధికారి సుమారు 5 నుంచి 10 మండలాల బాధ్యతలు చూడాల్సి వస్తుందని, దీంతో పంటల పరిశీలన, పథకాల అమలు, రైతుశిక్షణ వంటి సేవలను సకాలంలో అందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు.

# దీన్‌దయాళ్ ఆశయాలు నేటికీ ఆదర్శం

## జయంతి సందర్భంగా గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ఘన నివాళి

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** ఈ నెల 25న పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా గవర్నర్ శివప్రతాప్‌శుక్లా ఆయనకు నివాళులు అర్పించారు. పండిట్ దీన్‌దయాళ్‌జీ గొప్ప దేశభక్తుడు, దూరదృష్టి కలిగిన మేధావి, జాతి సేవకే అంకితమైన మహనీయుడని గవర్నర్ కొనియాడారు. పేద, అణగారిన వర్గాల సంక్షేమం కోసం ఆయన తన జీవి తాన్ని త్యాగం చేశారని గుర్తుచేశారు. ఆయన అందించిన ఏకాత్మ మానవ వాదం, అంత్యోదయ దర్శనం , సమాజంలో చివరి వ్యక్తికి కూడా అభివృద్ధి ఫలాలు అందాలన్న ఆలోచన నేటికీ దేశ సమ్మిళిత అభివృద్ధికి, స్వావలం బనకు మార్గదర్శకంగా నిలుస్తోందని పేర్కొన్నారు.సాధారణ జీవనం, త్యాగ నిరతి, జాతీయ సేవ పట్ల నిబద్ధత, మాతృభూమి పట్ల అచంచల భక్తి విషయంలో దీన్‌దయాళ్‌జీ తరతరాలకు స్ఫూర్తిగా నిలుస్తారని గవర్నర్ అన్నారు. పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆశయాలకు అనుగుణంగా కరుణ, చిత్తశుద్ధి, సేవాభావంతో ప్రతి ఒక్కరూ పునరంకితమై బలమైన, సమ్మిళిత, స్వావలంబన భారత నిర్మాణానికి కృషి చేయాలని గవర్నర్ పిలుపునిచ్చారు.



రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న నేరెళ్ల శారద

# మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా నేరెళ్ల శారద బాధ్యతల స్వీకరణ

## అభినందించిన కమిషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులు

**హైదరాబాద్ (బేగంపేట), సెప్టెంబరు 24, ప్రభాతవార్త :** రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రెండోసారి నేరెళ్ల శారద అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ముందుగా మహిళా కమిషన్ కార్యాలయం, బుద్ధభవన్‌కు చేరుకున్న చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు కమిషన్ కార్యదర్శి పద్మజరమణ, సిబ్బంది వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ఘనస్వాగతం పలికారు. తమ ఛాంబర్‌లో ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం నేరెళ్ల శారద చైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించారు. తనపై ఎంతో నమ్మకంతో రెండోసారి మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, సహకరించిన అందరికి కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో మహిళలకు ఎలాంటి సమస్య ఎదురైనా మహిళా కమిషన్ అండగా ఉంటుందని చైర్‌పర్సన్ తెలిపారు.
ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ మహిళలపైన దాడులు జరిగితే సహించేది లేదని స్పష్టం చేశారు. అనంతరం చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన నేరెళ్ల శారదకు ప్రభుత్వ సలహాదారు హర్కర వేణుగోపాల్‌రావు, బిసి కమిషన్ చైర్మన్ జి.నిరంజన్, టిజిఐఐసి చైర్‌పర్సన్ నిర్మలజగ్గారెడ్డి, మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యదర్శి శృతిఓజా, శాసన మండలి విప్ బల్మూర్ వెంకట్ ఆలిండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ చైర్మన్ మధుగౌడ్‌యాష్కి, మహిళా కమిషన్ సభ్యులు చిట్యాల శ్వేత, ఉజ్మా ఆషయ్ షాకీర్, ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరిగారి ప్రీతం, బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌గౌడ్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు అన్వేష్‌రెడ్డి, పిసిసి ప్రధాన కార్యదర్శి సింగం చరణ్‌కౌశిక్‌యాదవ్, గౌడ సంఘం నాయ కులు, మహిళా కమిషన్ ఎస్ఒలు, కౌన్సిలర్లు, కార్యకర్తలు అభిమానులు అధికసంఖ్యలో పాల్గొని చైర్‌పర్సన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# అండర్‌గ్రౌండ్ విద్యుత్ కేబుల్‌కు శ్రీకారం

## ప్రిబిడ్ సమావేశానికి 50 సంస్థలు హాజరు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** హైదరాబాద్, దాని పరిసర ప్రాంతాల్లో విద్యుత్ పంపిణీ వ్యవస్థను మరింత ఆధునికంగా, విశ్వసనీయంగా, అంతరాయ రహితంగా తీర్చిదిద్దే లక్ష్యంతో చేపట్టనున్న ప్రతిష్టాత్మక అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్‌కు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించి హైదరాబాద్‌లో గురువారం జరిగిన ప్రిబిడ్ సమావేశానికి వివిధ సంస్థలకు చెందిన దాదాపు 50 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ యూజీ కేబుల్ ప్రాజెక్టుకు సంబంధించి వివిధ రాష్ట్రాల నుంచి కేబుల్ తయారీ సంస్థలు, జాయింటింగ్ కిట్ తయారీదారులు, నిర్మాణ సంస్థలు, ప్రాజెక్టు అమలు సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. ప్రాజెక్టుకు సంబంధించిన సాంకేతిక, ఆర్థిక, అమలు, నాణ్యతా ప్రమాణాల అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఇందులో విద్యుత్ అధికారులు ప్రాజెక్టు లక్ష్యాలు, అమలు విధానం, నాణ్యతా ప్రమాణాలు, సమయపాలన, విశ్వసనీయత పెంపుపై సమగ్ర వివరణ అందించారు. హైదరాబాద్ నగర ప్రతిష్టకు సంబంధించిన ఈ ప్రాజెక్టులో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని, అత్యుత్తమ ప్రమాణాలతో పనులు చేపట్టనున్నట్లు సంస్థ సిఎండి జితేష్ పాటిల్ తెలిపారు. ప్రాజెక్టు అమలు విధానం, సాంకేతిక ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ చర్యలు, ఫీల్డ్ స్థాయి సవాళ్లు మరియు టెండర్ నిబంధనలపై సమగ్ర వివరణ అందించారు. ఈ యూజీ కేబుల్ ప్రాజెక్టు అమలుతో చెట్ల కొమ్మలు, ప్రతికూల వాతావరణ పరిస్థితులు, పక్షులు మరియు ఇతర జంతువుల కారణంగా ఏర్పడే విద్యుత్ అంతరాయాలు గణనీయంగా తగ్గనున్నాయన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధి కార్యక్రమాలకు అనుగుణంగా అమలు కానున్న ఈ ప్రాజెక్టు దేశంలోని ఇతర మెట్రో నగరాలకు ఆదర్శంగా నిలుస్తుందన్నారు. టెండర్ నిబంధనలు, అర్హత ప్రమాణాలు, మొబిలైజేషన్ అడ్వాన్స్, బ్యాంకు గ్యారంటీలు, సాంకేతిక స్పెసిఫికేషన్లు, జాయింటింగ్ కిట్లు, అండర్‌గ్రౌండ్ కేబుల్ వ్యవస్థలు, పోర్టల్ సంబంధిత అంశాలపై పలువురు ప్రతినిధులు సూచనలు చేశారు.


హైదరాబాద్‌లో గురువారం వైఎస్ షర్మిల కుమార్తె నిశ్చితార్థ వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితదితరులు

## హైదరాబాదులో ఘనంగా షర్మిల కుమార్తె నిశ్చితార్థం

### హాజరైన సిఎం రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (పీసీసీ) అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ఇంట పెళ్లి సందడి మొదలైంది. ఆమె కుమార్తె అంజలిరెడ్డి, సోమల రఘురామ్‌రెడ్డి నిశ్చితార్థ వేడుక గురువారం హైదరాబాద్ శివారులోని కొత్వాల్‌గూడలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సతీసమేతంగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కాబోయే వధూవరులను ఆయన ఆశీర్వదించారు. ఈ నిశ్చితార్థ వేడుకలో సీఎం రేవంత్ రెడ్డితో పాటు తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సహా పలువురు రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు, ఆత్మీయులు పాల్గొన్నారు. నూతన జంటకు వారు శుభాకాంక్షలు తెలియజేశారు. కాగా, తన కుమార్తె వివాహానికి సంబంధించిన కీలక తేదీలను షర్మిల కొద్ది రోజుల క్రితమే స్వయంగా ప్రకటించారు. సెప్టెంబరు 24న నిశ్చితార్థం, నవంబరు 25న వివాహం, డిసెంబరు 5న రిసెప్షన్ ఉంటుందని ఆమె ఎక్స్ వేదికగా వెల్లడించారు. వివాహ వేడుకకు సంబంధించిన మొదటి ఆహ్వాన పత్రికను ఇడుపులపాయలోని తన తండ్రి, దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ఘాట్ వద్ద ఉంచి ఆశీస్సులు తీసుకున్నారు. ఈ క్రమంలో, వివాహ ఆహ్వానం కోసం తన సోదరుడు వైఎస్ జగన్‌ను కలవడంపై వస్తున్న రాజకీయ ఊహాగానాలను షర్మిల ఖండించారు. తన కుమార్తె వివాహానికి అన్ని రాజకీయ పార్టీల అధినేతలను ఆహ్వానిస్తానని, ఇందులో ఎలాంటి రాజకీయ కోణాలు చూడవద్దని ఆమె స్పష్టం చేశారు.

## తెలంగాణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ రోడ్ అండ్ రైల్‌సేఫ్టీ బ్యూరో ఏర్పాటు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణ, వాహనదారుల్లో క్రమశిక్షణ పెంపొందించేందుకు ప్రభుత్వం కొత్తగా ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ రోడ్ అండ్ రైల్ సేఫ్టీ బ్యూరో (టిజి టిఎంఆర్ ఎస్‌బీ) పేరిట కొత్త విభాగాన్ని ఏర్పాటు చేసింది. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ సంజయ్ జాజు గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విభాగం పోలీస్, రవాణా శాఖల ఆధ్వర్యంలో పనిచేస్తాయని ఉన్నతాధికారులు ఇప్పటికే చెప్పడం తెలిసిందే. జాతీయ రహదారులపై పెరిగిపోతున్న ప్రమాదాల నివారణకు కొత్త విభాగం ఆధ్వర్యంలో హైవేపై గస్తీలు నిర్వహిస్తారు. దీంతో పాటు ప్రమాదాల నివారణ నిపుణుల సూచనలను అమల్లోకి తెస్తుంది. ఈ విభాగం అదనపు డిజి లేదా ఐజి స్థాయి అధ్వర్యంలో డిజిపి కార్యాలయం కేంద్రంగా పనిచేస్తుంది.

## మీ కిడ్నీలు జర భద్రం..

>> సమయంలో కిడ్నీ దాతలు లభించడం లేదు. అనేక సందర్భాల్లో కిడ్నీ దాతలు లభించక రోగులు ప్రాణాలు వదులుతున్నారు. కిడ్నీ మార్పిడికి అనేక ఆంక్షలు ఉండటంతో దాతలు ముందుకు రావడంలేదు. కేవలం రక్త సంబంధీకులు, జీవితభాగస్వామి మాత్రమే కిడ్నీ దానం ఇచ్చేవిధంగా నిబంధనలు అమలులో ఉన్నాయి. దీనితో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు కిడ్నీ రాకెట్‌కు తెరలేపుతున్నాయి. ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించి కిడ్నీలను నిరుపేదలు, డబ్బు అవసరం ఉన్నవారి నుంచి సేకరించి లక్షల్లో విక్రయిస్తున్న సందర్భాలు అధికం అవుతున్నాయి.

ప్రధానంగా ఫ్లోరైడ్ నీరు, కలుషిత నీరు కిడ్నీ ఫెయిల్యూర్‌కు కారణంగా నిలుస్తోంది. కిడ్నీ ఫెయిల్ కావడానికి అనేక కారణాల్లో ఇది ప్రధానమైనదిగా వైద్యులు పేర్కొంటున్నారు, తెలుగు రాష్ట్రాల్లో పరిస్థితిని సమీక్షిస్తే శ్రీకాకుళంలోని ఉద్దానం, ప్రకాశం జిల్లాలోని మార్కాపురం, తెలంగాణలో నల్గొండ ప్రాంతాల్లో కిడ్నీ వ్యాధిబారిన పడుతున్న వారి సంఖ్య అధికంగా ఉంటోంది. ఇటీవల నిర్వహించిన ఒక సర్వేలో హైదరాబాద్‌లో కూడా గత రెండు సంవత్సరాలుగా కిడ్నీ వ్యాధిగ్రస్తులు పెరుగుతున్నారని నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. 2020లో ప్రచురితమైన జనాభా ఆధారిత అధ్యయనంలో ఉద్దానం పరిసరాల్లోని 67 గ్రామాల నుంచి 2,402 మంది పెద్దలను పరీక్షించగా, 21.07 శాతం మందిలో కిడ్నీ సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. వయస్సు, లింగం ఆధారంగా కిడ్నీ ప్రాబల్యం 18.7 శాతంగా అంచనా వేశారు. పురుషుల్లో ఇది 21.3 శాతం, మహిళల్లో 16.2 శాతంగా ఉంది. ఈ అధ్యయనంలో కిడ్నీ సమస్య ఉన్న వారిలో చాలామందికి డయాబెటిస్, అధిక రక్తపోటు వంటి సాధారణ కారణాలు స్పష్టంగా కనిపించకపోవడం గమనార్హం.

ఆంధ్రప్రదేశ్‌లో 2.57 లక్షల మంది డయాలసిస్ సేవలను గత సంవత్సరంలో పొందారు. మొత్తం 26 జిల్లాల్లో డయాలసిస్ కేంద్రాలు పిపిపి విధానంలో అమలు చేస్తున్నారు. 2025 అక్టోబరు 31 నాటికి 59 కేంద్రాల్లో 716 యంత్రాలు పనిచేస్తున్నాయని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో 33 జిల్లాలకు డయాలసిస్ సేవలు అందుబాటులో తీసుకువచ్చారు. తెలంగాణలో 33 జిల్లాల్లో 99 డయాలసిస్ కేంద్రాలు, 747 యంత్రాలు పనిచేస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం 2025-26కు సంబంధించిన సమాచారంలో తెలిపింది. తర్వాత 2025-26 ఆర్థిక సంవత్సరానికి తెలంగాణలో కేంద్రాల సంఖ్య 101కు చేరినట్లు కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 21,504 మంది రోగులు ఉచిత డయాలసిస్ సేవలను పొందుతున్నారు. అయితే సేవల విస్తరణతోపాటు సిబ్బంది కొరత కూడా సమస్యగా ఉంది. 2026లో వెలువడిన ఒక నివేదిక ప్రకారం తెలంగాణ జిల్లా ఆసుపత్రుల్లో నెఫ్రాలజిస్టులు, యూరాలజిస్టులు, డయాలసిస్ టెక్నీషియన్లకు సంబంధించిన మానవవనరుల లోటును ఒక పార్లమెంటరీ కమిటీ కూడా ప్రస్తావించింది.

**ప్రభుత్వ ఆసుపత్రులపై పెరుగుతున్న ఒత్తిడి**

తెలంగాణలో ప్రభుత్వ డయాలసిస్ కేంద్రాలు రోగుల సంఖ్య పెరుగుదలతో ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు 2025లో వైద్య రంగంపై వచ్చిన నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. హైదరాబాద్‌తోపాటు జిల్లాల్లోని కొన్ని ప్రభుత్వ కేంద్రాల్లో సామర్థ్యానికి మించి డిమాండ్ ఉండటంతో పెరిటోనియల్ డయాలసిస్, ఇంటి వద్ద చేసే డయాలసిస్ వంటి ప్రత్యామ్నాయాలను విస్తరించాల్సిన అవసరంపై నెఫ్రాలజిస్టులు సమీక్షించారు. 2026లో తెలంగాణ ప్రభుత్వం మరో 79 కొత్త డయాలసిస్ కేంద్రాలు, 416 పడకలను ఏర్పాటు చేయడానికి చర్యలు చేపట్టినట్లు నివేదికలు వెల్లడించాయి. అదనంగా ఇప్పటికే ఉన్న 67 కేంద్రాల్లో 155 పడకలను పెంచే ప్రతిపాదన కూడా ఉంది.

**అసలు సమస్య ముందస్తు గుర్తింపు**

కిడ్నీ వ్యాధి ప్రారంభదశల్లో చాలామందికి స్పష్టమైన లక్షణాలు ఉండకపోవచ్చు. ఫలితంగా వ్యాధి తీవ్రదశకు చేరిన తర్వాతే ఆసుపత్రికి వచ్చే పరిస్థితి ఏర్పడుతుంది. నిపుణుల సూచనల ప్రకారం అధిక ప్రమాదంలో ఉన్న వ్యక్తులు క్రమం తప్పకుండా రక్తపోటు పరీరక్తంలో క్రియాటినిన్ పరీక్ష, మూత్రంలో ప్రోటీన్/ఆల్బుమిన్ పరీక్షలు, రక్తంలో చక్కెర పరీక్ష చేయించుకోవడం ద్వారా వ్యాధిని ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. వ్యాధి సోకిన తరువాత రోగులు అనేక ఇబ్బందులకు గురౌతారు. డయాలసిస్ కేంద్రాలు పెరగడం చికిత్స అందుబాటును మెరుగుపరుస్తుంది. కానీ అసలు ప్రజారోగ్య లక్ష్యం కిడ్నీ వైఫల్యానికి వెళ్లే కొత్త కేసులను తగ్గించడం. అందుకు ముందస్తు స్క్రీనింగ్ ప్రమాద కారకాల నియంత్రణ, కిడ్నీ వ్యాధి ప్రారంభ దశలోనే చికిత్స వంటి చర్యలు కొంతవరకు వ్యాధి పురోగతిని అడ్డుకోగలుగుతాయి. అవసరమైన వారికి సమయానికి డయాలసిస్/ట్రాన్స్‌ప్లాంట్ అనే సమగ్ర విధానం అవసరం. అదేవిధంగా కిడ్నీ మార్పిడి అవసరం ఉన్న రోగులకు అనుకూలంగా నిబంధనల్లో కొన్ని మార్పులు తీసుకురావాలి.

# మానవ నియంత్రణలోనే ఏఐ అభివృద్ధి జరగాలి

### వైట్‌హౌస్‌లో జరిపిన సమావేశంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్

### ట్రంప్‌తో వ్యక్తిగత అనుబంధం

**వాషింగ్టన్, సెప్టెంబరు 24:** కృత్రిమ మేధస్సు అభివృద్ధి, నిర్వహణలో చైనా, అమెరికా కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంతో ఉందని చైనా అధ్య క్షుడు జిన్‌పింగ్ అన్నారు. ఏఐ ఎల్లప్పుడూ మానవుల నియంత్రణలో ఉండేలా, ప్రజల సంక్షేమానికి ఉపయోగపడేలా చూడాలని ఆయన పేర్కొన్నారు. వైట్‌హౌస్‌లో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో గురు వారం జరిగిన సమావేశంలో జిన్‌పింగ్ ఈ వ్యాఖ్యలు చేశారు. చైనా, అమెరికా రెండూ కృత్రిమ మేధస్సు రంగంలో అగ్రశక్తులుగా ఉన్నాయని, వేగంగా అభివృద్ధి చెందుతున్న ఈ సాంకేతికతను సమర్థవంతంగా నిర్వహించేందుకు ఇరు దేశాలు కలిసి పనిచేయాలని అన్నారు. చైనా, అమెరికా రెండూ కృత్రిమ మేధస్సులో అగ్రగామి దేశాలు. ఏఐని ప్రజల మేలు కోసం అభివృద్ధి చేయడం, నిర్వహించడం, దాని అభివృద్ధి ఎల్లప్పు డూ మానవుల నియంత్రణలో ఉండేలా చూడడం మన సామర్థ్యం మాత్రమే కాదు.. బాధ్యత కూడా' అని జిన్‌పింగ్ అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అత్యాధునిక ఏఐలో ఆధిపత్యం కోసం చైనా, అమెరికా మధ్య పోటీ కొనసాగుతున్న నేపథ్యంలో ఈ అంశం ఇరు దేశాల నేతల చర్చల్లో కీలకంగా మారింది. అదే సమయంలో అత్యంత సామర్థం కలిగిన ఏఐ వ్యవస్థల వల్ల తలెత్తే ప్రమాదాలపై కూడా ఇరు దేశాలు దృష్టి సారిస్తు న్నాయి. ట్రంప్ కూడా ఏఐ అంశం తమ చర్చల్లో ప్రధానంగా ఉంటుందని గతంలో వెల్లడించారు. సూపర్ ఇంటెలిజెన్స్ చర్చల్లో పెద్ద అంశంగా ఉంటుంది. ప్రస్తుతం ఉన్న విధానంలో ఎలాంటి మార్పులు చేయాలని నేను కోరుకోవడం లేదని ట్రంప్ పేర్కొన్నారు. ఇదే చైనా వైఖరి కూడా అని ఆయన అన్నారు. 'చైనా, అమెరికా మధ్య ఉన్న ఆర్థిక సంబంధాలను కూడా జిన్‌పింగ్ ప్రస్తావించారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న సమస్యల పరిష్కారానికి ఇరు దేశాల మధ్య సహకారం అవసరమని అన్నారు. మనం నిజాయితీతో కలిసి పనిచేయాలి. చైనా, అమెరికా ప్రయోజనాలు పరస్పరం లోతుగా ముడిపడి ఉన్నాయి. కలిసి పనిచేయడానికి విస్తృత అవకాశాలు ఉన్నాయని జిన్‌పింగ్ చెప్పారు. చైనా అమెరికా సహకారం ప్రపంచంలోని ప్రతి సమస్యను పరిష్కరించకపోవచ్చు. అయితే మన సహకారం లేకుండా ప్రపంచంలోని అనేక సమస్యలకు పరిష్కారం కనుగొనడం కష్టమేనని పేర్కొన్నారు. చైనా, అమెరికా మధ్య పలు అంశాల్లో విభేదాలు ఉన్నప్పటికీ ఇరు దేశాలు పరస్పర సంభాషణను మరింత బలోపేతం చేసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు. చైనా, అమెరికా జాతీయ పరిస్థితులు వేర్వేరని, నిజాయితీతో, లోతుగా, నిరంతరం చర్చలు జరపడం ద్వారా ఇరు దేశాలు ఒకరినొకరు మరింత మెరుగ్గా అర్థం చేసుకోవచ్చు. విభేదాలను పక్కనపెట్టి ఉమ్మడి అంశాలపై దృష్టి సారించడం ద్వారా పరస్పర విశ్వాసాన్ని పెంచుకోవచ్చని అన్నారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో తనకు ఏర్పడిన వ్యక్తిగత సంబంధాన్ని కూడా జిన్‌పింగ్ ప్రస్తావించారు. ఇది ఇరు ప్రభుత్వాల మధ్య కమ్యూనికేషన్‌ను కొనసాగించేందుకు దోహద



పడుతుందని అన్నారు. అధ్యక్షుడు ట్రంప్, నేను ఒకరినొకరం గౌరవిం చుకుంటాం. మాకు వ్యక్తిగత అనుబంధం ఏర్పడింది. మేము పరస్పరం సంప్రదింపులు కొనసాగిస్తున్నామని చెప్పారు. ఇరు దేశాల ప్రభుత్వ విభాగాలు మరింత విస్తృతంగా సంప్రదింపులు జరపాలని ఆయన సూచించారు. విదేశాంగం, ఆర్థిక వ్యవహారాలు, ఆర్థిక సహకారం, చట్ట అమలు, ప్రజల మధ్య సంబంధాలు వంటి రంగాల్లో సంబంధాలను బలోపేతం చేయాలని కోరారు.

# 2030కి రాష్ట్రంలో పేదరిక నిర్మూలన


హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం భట్టివిక్రమార్క

### అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థగా తెలంగాణ

### ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు: డి.సిఎం భట్టి

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** తెలంగాణను 2030 నాటికి పేదరిక రహిత రాష్ట్రంగా, 2033 నాటికి దేశంలోనే తొలి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి కార్యాచరణకు మరింత వేగం పెంచనుందని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క తెలిపారు. హైదరాబాద్‌లో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ రాష్ట్ర దీర్ఘకాలిక ఆర్థిక, సామాజిక అభివృద్ధి లక్ష్యాలను వేగంగా సాధించేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళిక, అమలు వ్యవస్థలను మరింత బలోపేతం చేయడం, శాఖల మధ్య సమన్వయాన్ని పెంచడం, అభివృద్ధి ఫలితాలను నిరంతరం పర్యవేక్షించేలా వ్యవస్థలను రూపొందించడంపై దృష్టిసారించాలని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికా సంఘంను మరింత బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ప్రత్యేక ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్ ఏర్పాటు చేయనున్నట్లు తలిపారు. రాష్ట్ర ప్రాధాన్యతా అభివృద్ధి కార్యక్రమాలకు వ్యూహాత్మక ప్రణాళిక రూపొందించడం, వివిధ శాఖల మధ్య సమన్వయం, కార్యక్రమాల అమలు, పర్యవేక్షణ, పురోగతిని వేగవంతం చేయడం వంటి బాధ్యతలను ఈ యూనిట్ నిర్వహించనుందని చెప్పారు. పేదరికానికి గురయ్యే కుటుంబాలను గుర్తించి, వారికి అందాల్సిన వివిధ ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయడంతో పాటు స్థిరమైన జీవనోపాధి కల్పించే దిశగా చర్యలు చేపడతామన్నారు. పేదరిక నిర్మూలన కార్యక్రమాల ఫలితాలను కొలిచేందుకు, పర్యవేక్షించేందుకు ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయి అభివృద్ధి లక్ష్యాలను జిల్లాల స్థాయిలో కొలిచే వీలున్న ఫలితాలుగా మార్చేందుకు సమగ్ర జిల్లా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. 2033 నాటికి అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థ కలిగిన రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వేగవంతమైన, కేంద్రీకృత అభివృద్ధి వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు. వ్యూహాత్మక ప్రణాళిక, డేటా ఆధారిత నిర్ణయాలు, సాంకేతిక పరిజ్ఞానం, నాలెడ్జ్ సపోర్ట్, సామర్థ్య నిర్మాణం, పర్యవేక్షణ, కీలక అభివృద్ధి కార్యక్రమాల వేగవంతమైన అమలుకు ప్రతిపాదనను సిద్ధం చేయాలన్నారు.

ప్రభుత్వ సంస్థాగత సామర్థ్యాన్ని పెంచేందుకు వివిధ రంగాల్లో ప్రత్యేక పరిజ్ఞానం కలిగిన నిపుణులు, కన్సల్టెంట్ల సేవలను వినియోగించుకోనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ శాఖలు, రంగాల నిపుణులు, పరిశ్రమలు, విద్యా సంస్థలు, అభివృద్ధి సంస్థలు, ఇతర కీలక భాగస్వాములను ఒకే వేదికపైకి తీసుకురావడానికి ఏడు సెక్టోరల్ గ్రోత్ ల్యాబ్స్‌ను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. అభివృద్ధి అవకాశాలను గుర్తించడం, అమలులో ఉన్న అవరోధాలను పరిష్కరించడం, రంగాల వారీ వ్యూహాలను రూపొందించడం, ప్రాధాన్యతలను కాలపరిమితితో కూడిన, కొలిచే వీలున్న కార్యాచరణ ప్రణాళికలుగా మార్చడం గ్రోత్ ల్యాబ్స్ ప్రధాన ఉద్దేశంగా ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ఆర్థిక ప్రణాళిక శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# వికసిత్ భారత్ లక్ష్యానికి కొత్త ఊపు

### మంత్రులతో ప్రధాని మోడీ చింతన్ శిబిర్

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అధ్యక్షతన నిర్వహించిన రెండు రోజుల చింతన్ శిబిర్‌తో వికసిత్ భారత్ లక్ష్యానికి మరింత కదలికవచ్చింది. గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన ఈ శిబిరంలో అనేక అంశాలు ప్రస్తావనకు వచ్చాయి.

కొత్తగా ఏర్పాటు చేసిన పీఎంవో కార్యాలయం సేవా తీర్థ్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కేబినెట్ పునర్వ్యవస్థీకరణకు ముందు ప్రభుత్వం చేపట్టిన కీలక కసరత్తుగా అధికార వర్గాల్లో చర్చ జరిగినప్పటికీ, భవిష్యత్తులో మరిన్ని చింతన్ శిబిర్‌లు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తదుపరి చింతన్ శిబిర్‌ను ఈనెల 30, అక్టోబర్ 1 తేదీల్లో నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. చాలా రోజులుగా ప్రణాళికలో ఉన్న ఈ చింతన్ శిబిర్ గతంలో ప్రభుత్వం నిర్వహించిన సమావేశాలకు భిన్నంగా సాగింది. వికసిత్ భారత్ లక్ష్యాన్ని కేంద్రంగా చేసుకుని విధానాల రూపకల్పనకు దిశానిర్దేశం చేయడంతో పాటు, ప్రతి మంత్రి మరియు ఆయన శాఖ పనితీరు, ప్రభుత్వ కార్యక్రమాల ప్రయోజనాలను సమీక్షించడంపై దృష్టి పెట్టారు. ఈ కార్యక్రమంలో మొత్తం 68 మంది కేంద్ర మంత్రులు పాల్గొన్నారు. వారిని నాలుగు గ్రూపులుగా విభజించగా, ఒక్కో గ్రూపులో 17 మంది మంత్రులు ఉన్నారు. ప్రతి గ్రూపులో చర్చలకు ముందు అంశాలను వివరించేందుకు ఇద్దరు యాంకర్ మంత్రులను నియమించారు. గురువారం జరిగిన తొలి సెషన్‌కు స్వ కా వికాస్ అనే పేరు పెట్టారు.

ఇందులో మంత్రుల పాలనాపరమైన బాధ్యతలు, రాజకీయ అంశాలు, వ్యక్తిగత అంశాలతో పాటు ఆయా మంత్రిత్వ శాఖల పనితీరుపై చర్చించారు. తమ శాఖలకు సంబంధించి కొత్త, వినూత్న పథకాలను తీసుకురావాలని మంత్రులను ఆదేశించారు.

ఇప్పటికే అమలవుతున్న ప్రభుత్వ పథకాల పురోగతిని కూడా సమీక్షించారు. పథకాల క్షేత్రస్థాయి ప్రభావం, ప్రజల జీవన సౌలభ్యం, సేవల పంపిణీ వ్యవస్థలో మెరుగుదల, వివిధ మంత్రిత్వ శాఖల మధ్య సమన్వయం, సమయ నిర్వహణ, పథకాల సకాలంలో పూర్తి చేయడం, మౌలిక వసతుల ప్రాజెక్టులు, గతి శక్తి వంటి కీలక కార్యక్రమాలపై చర్చ జరిగింది.

ఇప్పటివరకు కేంద్ర మంత్రుల మండలి ముందు ఎనిమిది ప్రెజెంటేషన్లు మాత్రమే జరిగిన సందర్భాలు ఉండగా, ఈసారి మొత్తం 68 మంది మంత్రులను భాగస్వామ్యం చేస్తూ విస్తృత స్థాయిలో కసరత్తు చేపట్టారు. మంత్రులపై అధిక పనిభారం ప్రభావం, వారి ఆరోగ్యం, ఒత్తిడిని ఎదుర్కొనే విధానాలపై కూడా చర్చ జరిగింది. ఒక్కో సెషన్ 90 నిమిషాల పాటు కొనసాగగా, విరామం అనంతరం మరో అంశంపై మరో 90 నిమిషాల సెషన్ నిర్వహించారు. మంత్రులు తొలుత ఒకే గదిలో సమావేశమైనప్పటికీ, అనంతరం స్పష్టమైన చర్చల కోసం వారిని మూడు గ్రూపులుగా విభజించారు. రెండో సెషన్‌కు జనవిశ్వాస్ సే జనాధార్ అనే థీమ్‌ను నిర్ణయించారు.

## దానం అనర్హతపై సుప్రీం తీర్పు.. రాహుల్, రేవంత్‌కు చెంపపెట్టు

### ఒక వికెట్ పడింది, త్వరలో మరిన్ని వికెట్లు : కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** దానం నాగేందర్ అనర్హత వ్యవహారంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు రాహుల్‌గాంధీ, సీఎం రేవంత్‌రెడ్డికి చెంపపెట్టు వంటిదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అనర్హత నుంచి తప్పించుకునేందుకు దానం నాగేందర్ చేసిన ప్రయత్నాన్ని సుప్రీంకోర్టు తిరస్కరించిందని, హైకోర్టు ఇచ్చిన అనర్హత తీర్పును సమర్థిస్తూ స్పష్టమైన నిర్ణయం వెలువరించిందని పేర్కొన్నారు.

ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవించకుండా పార్టీ ఫిరాయింపుల ద్వారా ప్రజల మద్దతును కాజేయాలని రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి భావించారని కేటీఆర్ విమర్శించారు. ఫిరాయింపుదారులను స్పీకర్ వ్యవస్థను అడ్డుపెట్టుకుని కాపాడుకోవచ్చని వారు భావించారని ఆరోపించారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఆ ప్రయత్నాలకు గట్టి ఎదురుదెబ్బ తగిలిందన్నారు. ఖైరతాబాద్ ప్రజలు త్వరలో తమ తీర్పును ఇవ్వబోతున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. మూడు సంవత్సరాల మోసం, విఫలమైన హామీలు, ప్రజలకు ఇచ్చిన మాటలను నిలబెట్టుకోకపోవడం, పాలనా వైఫల్యాలపై ఖైరతాబాద్ ప్రజలు తమ తీర్పును చెప్పనున్నారని అన్నారు.దానం నాగేందర్ అనర్హతతో ఒక వికెట్ పడిందని, ఇక ముందు మరిన్ని వికెట్లు పడనున్నాయని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఒక వికెట్ పడింది.. త్వరలో మరిన్ని వికెట్లు పడనున్నాయి అంటూ ఆయన పేర్కొన్నారు.

## వ్యవసాయ్న వర్సిటీ ఆగ్రోఫారెస్ట్రీలో 400 అరుదైన మొక్కలు నాటిన అధికారులు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** రాజేంద్రనగర్‌లోని రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం (పీజేటీఎస్ఏయూ) అగ్రోఫారెస్ట్రీ క్షేత్రంలో వివిధ అటవీ జాతులకు చెందిన 400 అరుదైన మొక్కలను నాటారు. రెండేళ్లుగా విశ్వవిద్యాలయం 2 వేల అరుదైన అటవీ మొక్కలను నాటినట్లు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించింది. అలాగే ఔషధ మొక్కలు, పండ్ల చెట్లు, సహజ రంగులు ఇచ్చే మొక్కలు, మిశ్రమ అటవీ జాతులు, మహోగని, చందనం వంటివి కలిగిన తోటలను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. విశ్వవిద్యాలయంలో పచ్చదనం క్షీణతను పరిష్కరించేందుకు, హెచ్ఎండిఏ, వివిధ స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ కంపెనీల సహకారంతో అరుదైన అటవీ జాతులను నాటడం ద్వారా పచ్చదనాన్ని పెంచడానికి పరిపాలన విభాగం ప్రాధాన్యత ఇస్తోంది.

# మహాదేవ్ యాప్ కేసులో ఎట్టకేలకు పట్టుబడిన కీలక సూత్రధారి అభిషేక్

### దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు రాగా శంషాబాద్‌లో పట్టుకున్న సిబిఐ

### రూ.94 వేల కోట్ల గోల్‌మాల్ కేసులో నిందితుడు రాయ్‌పూర్‌కు తరలింపు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** దేశ వ్యాప్తంగా సంచలనం రేపిన మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ గోల్‌మాల్ కేసులో కీలక సూత్రధారి అభిషేక్ కుమార్ ఎట్టకేలకు పట్టుబడ్డాడు. దుబాయ్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నట్లు అందిన సమాచారంపై సిబిఐ అధికారులు పక్కా సమాచారంతో శంషాబాద్ విమానాశ్రయంలో గురువారం నాడు అరెస్టు చేసి వెంటనే ఛత్తీస్‌ఘడ్‌లోని రాయ్ పూర్‌కు తరలించారు. ఛత్తీస్‌ఘడ్ కేంద్రంగా మహాదేవ్ బుక్ పేరిట పదేళ్లకు పైగా కొనసాగుతున్న మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లో లక్షల మంది బాధితులు వుండగా ఆ రా ష్ట్రంతో పాటు బెంగాల్, ఎపిలో దీనికి సంబంధించి కేసులు నమోదయ్యాయి. ఈ యాప్ అక్రమాలపై ఓవైపు సిబిఐ విచారిస్తుండగా మరో వై పు మనీలాండరింగ్ కోణంలో ఈడీ విచారిస్తోంది. 94 వేల కోట్ల రూపాయలకు పైగా ప్రజా ధనాన్ని మహాదేవ్ ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్ దోచు కుందని సిబిఐ పేర్కొంది. భారత్‌లో అయాయకుల నుం చి దోచుకున్న వేల కోట్ల రూపాయలతో అభిషేక్ కుమార్ సహా ఇతర నిందితులు దు బాయ్‌లో విలాసవంతమైన విల్లాలతో పాటు ఆస్తులను కొనుగోలు చేసినట్లు ఈడీ చెబుతోంది. ఇందులో బూర్జు ఖలీఫాలోని ఖరీదైన విల్లాలతో పాటు దుబాయ్‌లో కీలక ఆస్తులను సిబిఐ జప్తు చేసింది. ఇదే సమయంలో దుబాయ్‌లోని సౌరభ్, రవికి సంబంధించిన 1700 కోట్ల రూపాయ ల ఆస్తులను ఈడీ జప్తు చేసింది. ఈ కేసుకు సంబంధించి 2022 అక్టోబరులో బెంగాల్‌లో మొదటి ఎఫ్ఐఆర్ నమోదు కాగా ఆ తరువాత ఛ త్తీస్‌ఘడ్‌లో నమోదయ్యింది. అనంతరం ఈ కేసులను సిబిఐకి బదలాయించా రు. ఇప్పటి వరకు వంద మంది నిందితులపై ఎనిమిది ఛార్జిషీట్లను సిబిఐ దాఖలు చేసింది. అయితే విదేశాలకు పారిపోయిన వారిని భారత్‌కు రప్పించేందుకు ఏడు రెడ్ కార్నర్ నోటీసులు జారీ చేయగా ఇ ందులో కొందరు పట్టుబడ్డారు. అభిషేక్ కుమార్ మాత్రం దుబాయ్‌లో మకాం వేసి అక్కడి నుంచి గోల్‌మాల్ దందాను సాగిస్తున్నాడు. ఈ కే సులో అభిషేక్ కుమార్ పట్టుబడడంతో విచారణ మరింత వేగం పుంజుకునే వీలుంది.

## సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నాం

### బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడాన్ని సంపూర్ణంగా స్వాగతిస్తున్నామని బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్ రావు అన్నారు. ఇది ముమ్మాటికీ ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగ నైతికతకు దక్కిన చారిత్రక విజయం. సత్యమేవ జయతే ప్రజాస్వామ్యంలో ఎంతటివారైనా రాజ్యాంగానికి తలవంచాల్సిందేనని, అంతిమంగా సత్యమే గెలుస్తుందని సుప్రీంకోర్టు తీర్పుతో మరోసారి రుజువైందన్నారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు మా బిజెపి శాసనసభా పక్షం చేసిన రాజీలేని న్యాయపోరాటం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని, చట్టసభలు ఆయారాం, గయారాంలకు అడ్డా కాకూడదని, ఘర్ వాపసీల పేరుతో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయలేరని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు కాంగ్రెస్ అహంకారానికి గట్టి చెంపపెట్టు. ఇదే స్ఫూర్తితో కాంగ్రెస్ ప్రభుత్వం సాగిస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టుల్లో న్యాయపోరాటాన్ని, క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలను మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్తామన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని పకడ్బందీగా అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించింది. స్పీకర్ కార్యాలయాన్ని అడ్డుపెట్టుకుని రాజ్యాంగానికి వ్యతిరేకంగా లబ్ధి పొందాలని చూసినా న్యాయం ముందు ఎవరూ తప్పించుకోలేరని తేలిపోయింది. రాజ్యాంగ ద్రోహానికి పాల్పడిన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని, కాంగ్రెస్ కండువా కప్పుకున్న ఫిరాయింపు ఎమ్మెల్యేలందరితో తక్షణమే రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలని డిమాండ్ చేస్తున్నాం. దమ్ముంటే ప్రజాతీర్పును ఎదుర్కోవాలి. దేశమంతా తిరుగుతూ చేతిలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని సంవిధాన్ బచావో అని దొంగ నాటకాలాడుతున్న రాహుల్ గాంధీ, మరో పార్టీ బిఫారంతో గెలిచిన ఎమ్మెల్యేకు కాంగ్రెస్ ఎంపి టికెట్ ఇచ్చి పోటీ చేయించడం ఆయన నయవంచనకు, కపట రాజకీయాలకు నిలువెత్తు నిదర్శనం.

## గజల్ శ్రీనివాస్‌కు 'విశ్వసంగీత శాంతిదూత్త పురస్కారం

### అవార్డు ప్రదానం చేసిన మారిషస్ అధ్యక్షుడు ధరమ్‌బీర్‌గోకుల్

**విజయవాడ, సెప్టెంబరు 24, ప్రభాతవార్త ప్రతినిధి:** ట్రిపుల్ గిన్నీస్ బుక్ ప్రపంచ రికార్డుల గ్రహీత డాక్టర్ గజల్ శ్రీనివాస్‌కు 'విశ్వ సంగీత శాంతి దూత్త పురస్కారం లభించింది. మారిషస్ దేశంలోని పోర్టులూయిస్‌లో 108 అడుగుల శ్రీ వెంకటేశ్వర స్వామి అతి పెద్ద విగ్రహం ఉన్న హరిహర దేవస్థాన ప్రాంగణంలో గజల్ శ్రీనివాస్‌కు అవార్డును మారిషస్ దేశాధ్యక్షులు ధరమ్ బీర్‌గోకుల్ ప్రదానం చేసి, సత్కరించారు. గజల్ శ్రీనివాస్ వివిధ ప్రపంచ భాషలలో గానం చేసి సనాతన ధర్మం, అహింసా, సత్యాగ్రహ సిద్ధాంతాలను ప్రచారం చేయడం ఎంతో స్ఫూర్తి దాయకమని ధరమ్ బీర్ గోకుల్ వ్యాఖ్యానించారు.


డాక్టర్ గజల్ శ్రీనివాస్‌ను 'విశ్వసంగీత శాంతి దూత' పురస్కారం అందజేస్తున్న మారిషస్ దేశాధ్యక్షుడు ధరమ్‌బీర్ గోకుల్

## సింగరేణిలో రూ.1,600 కోట్ల కుంభకోణం

### సిఎండికి బిఆర్ఎస్ నేతల వినతిపత్రం

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** సింగరేణిలో బొగ్గు ఉత్పత్తి పడిపోయిందని, అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ ప్రభుత్వంపై బిఆర్ఎస్ ఫ్యాక్ట్ ఫైండింగ్ కమిటీ తీవ్ర స్థాయిలో మండిపడింది. మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ తదితర నేతలు గురువారం సింగరేణి సీఎండీకి వినతి పత్రం సమర్పించారు. గతంలో 70 మిలియన్ టన్నులున్న ఉత్పత్తి ఇప్పుడు 58కి పడిపోవడం, థర్మల్ ప్లాంట్ కు నాసిరకం బొగ్గు సరఫరా చేస్తూ పొరుగు రాష్ట్రాలకు మేలైన బొగ్గును అమ్ముకోవడం వల్లే రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభం తలెత్తిందని వారు ఆరోపించారు. సంస్థలో ఏకంగా రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గు మాయం కావడంపై సీఏజీతో సమగ్ర విచారణ జరిపించాలని, రాష్ట్ర ప్లాంట్లకు తక్షణమే నాణ్యమైన బొగ్గును సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజల పక్షాన న్యాయ పోరాటం చేస్తామని బిఆర్ఎస్ నేతలు హెచ్చరించారు.

## ఐ బొమ్మ రవికి నాంపల్లి కోర్టులో స్వల్ప ఊరట

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** టాలీవుడ్, బాలీవుడ్ రంగాన్ని పైరసీ సీడిలతో వణికించిన ఐ బొమ్మ వెబ్‌సైట్ నిర్వాహకుడు ఇ మ ంది రవి అలియాస్ ఐ బొమ్మ రవికి నాంపల్లి కోర్టులో స్వల్ప ఊరట లభించింది. పోలీసులు జప్తు చేసిన బ్యాంకు ఖాతాలను నిర్వహించుకునేం దుకు రవికి నాంపల్లి కోర్టు అనుమతించింది. అయితే ఈ ఖాతాల్లో జప్తు అయిన మూడు కోట్ల రూపాయలను వాడుకునేందుకు మాత్రం న్యాయ స్థానం అనుమతించలేదు. ఈ నగదు పోలీసుల విచారణ ముగిసి, కోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసే వరకు అలాగే వుంటుందని కోర్టు పేర్కొ ంది. సినీ పైరసీ కేసులో అరెస్టయిన ఎన్ఆర్ఐ కొన్ని నెలలుగా హైదరాబాద్‌లో వుంటుండడం తెలిసిందే. కరేబియన్ దీవుల పౌరసత్వం తీసు కున్న ఇతను అక్కడి నుంచి పైరసీ దందాను సాగిస్తుండడం విదితమే. 2015 నంబారు 15వ తేదీన రవి విదేశాల నుంచి హైదరాబాద్‌కు ఇక్క డ వున్న తన ఆస్తులను అమ్మేందుకు రాగా పక్కా సమాచారంతో సిసిఎస్ పోలీసులు అరెస్టు చేసి జైలుకు తరలించారు. ఈ కేసులో మూడు నెలలకు పైగా జైల్లో వున్న రవి బెయిలుపై వున్నాడు. అయితే బ్యాంకుల ఖాతాలు జప్తు అవడం, అందులోని నగదు జప్తు అవడంతో తనకు రోజువారి ఖర్చులకు కూడా ఇబ్బందిగా మారిందని, కుటుంబ పోషణ కష్టమయ్యిందని రవి కోర్టును వేడుకోగా దీనిపై విచారించిన న్యాయస్థానం కొంత మేరట ఊరటన్చింది.

## ఎన్నికల ప్రధాన కమిషనర్‌పై
# కోర్టుధిక్కార చర్యలు!



**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** సుప్రీంకోర్టు గతంలో పలు కేసుల్లో ఇచ్చిన తీర్పుల్ని ఉల్లంఘిస్తూ తీసుకున్న నిర్ణయాలపై ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ కు కోర్టు ధిక్కార చర్యల ముప్పు పొంచి ఉంది. దేశవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణ సందర్భంగా ఎన్నికల సంఘంలో ఇతర కమిషనర్ల అంగీకారం లేకుండా ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న జ్ఞానేష్.. అదే సమయంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల్ని బేఖాతరు చేశారు. తోటి కమిషనర్ల అభ్యంతరాలను లెక్కచేయకుండా కోర్టు తీర్పుల్ని ఉల్లంఘించిన వ్యవహారంలో సీఈసీ జ్ఞానేష్ పై కోర్టు ధిక్కార చర్యలకు రంగం సిద్ధమవుతోంది. సీఈసీ జ్ఞానేష్ కుమార్ గతంలో సుప్రీంకోర్టు వివిధ సందర్భాల్లో ఇచ్చిన తీర్పుల్ని ఉల్లంఘించడం ద్వారా కోర్టు ధిక్కారానికి పాల్పడ్డారని, ఆయనపై క్రిమినల్ కోర్టు ధిక్కార చర్యల కోసం పిటిషన్ దాఖలు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ అటార్నీ జనరల్ వెంకట రమణిని సుప్రీంకోర్టు లాయర్ బ్రజేష్ సింగ్ కోరారు. తాజాగా ఆంగ్లపత్రిక పరిశోధనాత్మక కథనంలో పేర్కొన్న విధంగా జ్ఞానేష్.. తోటి కమిషనర్ల కంటే ప్రత్యేకంగా భావిస్తూ, ఏకపక్షంగా తీసుకున్న కోర్టు ధిక్కార నిర్ణయాలపై సమీక్ష అవసరమని బ్రజేష్ సింగ్ తెలిపారు. గతంలో టీఎన్ శేషన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా, అనూప్ బరన్వాల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసుల్లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుల్ని జ్ఞానేష్ కుమార్ స్పష్టంగా ఉల్లంఘించారని బ్రజేష్ సింగ్ ఏజీకి తెలిపారు. అలా కాకుండా ఇతర కమిషనర్లను బైపాస్ చేసి ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 141 ఉల్లంఘనే అవుతుందని ఆయన తెలిపారు. బహుళ కమిషనర్లతో కూడిన స్వతంత్ర వ్యవస్థ అయిన ఈసీని జ్ఞానేష్ నియంతృత్వంగా మార్చారని, తద్వారా ఎన్నికల సంఘం గౌరవాన్ని సైతం తగ్గించారని ఆరోపించారు. ఇది నిష్పాక్షికంగా ఎన్నికల ప్రక్రియకు నేరుగా ముప్పు కలిగించడమే అన్నారు. ఇప్పుడు బ్రజేష్ సింగ్ కు కోర్టు ధిక్కార పిటిషన్ వేసేందుకు కేంద్రం అనుమతి ఇస్తుందా లేక తప్పించుకుంటుందా అన్నది ఉత్కంఠ రేపుతోంది. ఇప్పటికే తాము కోరుకున్న సీఈసీని నియమించుకుని, ఆయన సాయంతో ఎన్నికలు గెలుస్తున్నారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న కేంద్రానికి ఈ నిర్ణయం మరో పరీక్ష కానుంది.

# అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తెలంగాణ

## పరిరక్షణ, ఆదాయ పెంపునకు ప్రణాళికలు - డిప్యూటీ సీఎం భట్టి



**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త:** తెలంగాణలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేసి అంతర్జాతీయ కేంద్రంగా చేసే లక్ష్యంతో ముందుకెళ్లాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచించారు. హైదరాబాద్‌లో గురువారం పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి నిర్వహించిన సమావేశంలో రాష్ట్రంలోని పర్యాటక ప్రాజెక్టులు, శాఖ పరిధిలోని ఆస్తుల వినియోగం, బడ్జెట్ కేటాయింపులు, ప్రైవేట్ పెట్టుబడులు, చారిత్రక కట్టడాల పరిరక్షణ, పర్యాటక బ్రాండింగ్ తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు సమగ్ర కార్యాచరణ రూపొందించాలన్నారు. కేవలం పర్యాటక ప్రదేశాలను అభివృద్ధి చేయడం మాత్రమే కాదని, తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచానికి పరిచయం చేయడం కూడా అందులో భాగమేనని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో పెట్టుబడులు, ఉపాధి, ఆదాయ అవకాశాలను పెంచుతూ రాష్ట్ర పర్యాటక రంగాన్ని కొత్త స్థాయికి తీసుకెళ్లాలని సూచించారు. పర్యాటక రంగంలో ప్రభుత్వ పెట్టుబడులతో పాటు ప్రైవేట్ భాగస్వామ్యాన్ని విస్తృతం చేయాలని, పబ్లిక్- ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ విధానంలో కొత్త ప్రాజెక్టులను అభివృద్ధి చేయాలని చెప్పారు. ప్రభుత్వ నిధులపై మాత్రమే ఆధారపడకుండా పర్యాటక శాఖకు చెందిన ఆస్తులను సమర్థంగా వినియోగించుకోవాలన్నారు. భవనాలు ఉన్న ఆస్తులు, ఖాళీ స్థలాలు, బిఓటి విధానంలో అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి జాబితా రూపొందించాలని తెలిపారు. ఆదాయాన్ని సమకూర్చే విధంగా ఆస్తులను అభివృద్ధి చేయడంతో పాటు, ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే చర్యలు చేపట్టాలని సూచించారు. తెలంగాణలో టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం, హిల్ టూరిజం తదితర విభాగాలను సమగ్రంగా అభివృద్ధి చేయాలని అన్నారు. రాష్ట్రంలోని చారిత్రక, సాంస్కృతిక, ఆధ్యాత్మిక, ప్రకృతి పర్యాటక ప్రాంతాలను ప్రపంచ పర్యాటక పటంలో నిలిపేలా విస్తృత స్థాయిలో బ్రాండింగ్, మార్కెటింగ్ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. హైదరాబాద్‌కు వచ్చే దేశీయ, విదేశీ పర్యాటకులను రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలకు ఆకర్షించేలా ప్రత్యేక పర్యాటక సర్క్యూట్లను అభివృద్ధి చేయాలని చెప్పారు. రామప్ప వంటి చారిత్రక ప్రదేశాల్లో పరిరక్షణ, నిర్వహణ, మౌలిక వసతుల కల్పనకు అవసరమైన ప్రభుత్వ సహకారం అందిస్తామన్నారు. కొత్త పర్యాటక ప్రాజెక్టుల ద్వారా ఆదాయాన్ని పెంచుకునే మార్గాలను అన్వేషించాలని చెప్పారు. విద్యార్థుల్లో తెలంగాణ చరిత్ర, సంస్కృతి, పర్యాటక ప్రాంతాలపై అవగాహన పెంపొందేలా తెలంగాణ దర్శిని కార్యక్రమాన్ని సమర్థంగా అమలు చేయాలన్నారు. పర్యాటక ప్రాజెక్టులకు ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించే విషయంలో ఉన్న సమస్యలను గుర్తించి పరిష్కరించాలని తెలియజేశారు. లీజు విధానాలు, ప్రాజెక్టుల ఆర్థిక సాధ్యత, పెట్టుబడిదారుల ఆసక్తి వంటి అంశాలను సమగ్రంగా పరిశీలించి అవసరమైన మార్పులపై ప్రతిపాదనలు సిద్ధం చేయాలని స్పష్టం చేశారు. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత కాలవ్యవధిలో కార్యాచరణను ముందుకు తీసుకెళ్లాలన్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి, ప్రకృతి వైభవాన్ని ప్రపంచానికి పరిచయం చేస్తూ, పెట్టుబడులు, ఉపాధి, ఆదాయం పెరిగేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేయడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, టూరిజం ప్రిన్సిపల్ సెక్రెటరీ వాణి, ఫైనాన్స్ ప్లానింగ్ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, ఫైనాన్స్ సెక్రెటరీ స్మిత్రా పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఇతర దేశాల ఉపగ్రహాలను బ్లాక్ చేస్తున్న బ్రిటన్



**లండన్, సెప్టెంబరు 24:** అంతరిక్షంలో ఆధిపత్యం కోసం అగ్రరాజ్యాలు కొన్నేళ్లుగా చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. ఆయుధాలను అంతరిక్షంలోనూ మోహరించినట్లు ఇటీవల అమెరికా తొలిసారి అంగీకరించిన విషయం తెలిసిందే. తాజాగా బ్రిటన్ కూడా ఇతర దేశాలకు చెందిన ఉపగ్రహాలను జామింగ్ లేదా బ్లాక్ చేస్తున్నట్లు తెలిపింది. అయితే, ఇది కేవలం ఆత్మరక్షణ కోసమేనని పేర్కొంది. ఈ మేరకు బ్రిటన్ పబ్లిక్ సర్వీస్ బ్రాడ్‌కాస్టర్ బిబిసి వెల్లడించింది. భూ ఉపరితలం నుంచే ప్రత్యేక సాంకేతికతను ఉపయోగించి శత్రుదేశానికి చెందిన ఉపగ్రహాలు సమాచారాన్ని సేకరించకుండా ది రాయల్ ఎయిర్ ఫోర్స్(యుకె వాయుసేన) ప్రత్యేక చర్యలు చేపబడుతున్నట్లు తెలిపింది. ముఖ్యంగా అణు నిల్వలు, అణు జలాంగర్గాముల కదలికలు, దేశ రక్షణతో సంబంధమున్న సున్నితమైన ప్రదేశాలకు సంబంధించిన సమాచారం శత్రు శాటిలైట్లకు చిక్కకుండా యుకె చర్యలు తీసుకున్నట్లు పేర్కొంది. బ్రిటన్‌కు చెందిన ఉపగ్రహాలను రక్షించుకునేందుకు ది రాయల్ ఎయిర్‌ఫోర్స్ (రాఫ్) తాజాగా మిలిటరీ స్పేస్ స్క్వాడ్రన్‌ను ఏర్పాటు చేసింది. ఈ సందర్భంగా రాఫ్ అధిపతి మాట్లాడుతూ.. అంతరిక్షంలోనూ శత్రువుల నుంచి తీవ్ర ముప్పు ఉందని వ్యాఖ్యానించారు. బ్రిటన్ అమలు చేస్తున్న ఉపగ్రహాల జామింగ్ అంశాన్ని ప్రస్తావించారు. మరోవైపు అంతరిక్షం నుంచి దేశానికి సంబంధించి సమాచారం శత్రువులకు చిక్కకుండా స్పేస్ స్క్వాడ్రన్ రక్షిస్తుందని యుకె రక్షణ శాఖ వెల్లడించింది. శత్రుదేశాల క్షిపణి దాడుల గురించి ముందస్తుగా హెచ్చరించేందుకు, బ్రిటన్ ప్రయోంచిన ఉపగ్రహాలకూ ఈ స్క్వానరడాన్ రక్షణ కల్పిస్తుందని, నౌకలకు దిశానిర్దేశం చేస్తుందని తెలిపింది.



# జంషెడ్‌పూర్‌లో ఘోర ప్రమాదం

## జార్ఖండ్ మంత్రి దీపికా పాండే సింగ్ కుమార్తె సహా నలుగురు మృతి

**జంషెడ్‌పూర్, సెప్టెంబరు 24:** జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌లో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో జార్ఖండ్ గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి దీపికా పాండే సింగ్ కుమార్తె కూడా ఉన్నట్లు పోలీసులు తెలిపారు. సోనారీ పోలీస్ స్టేషన్ పరిధిలోని మెరైన్ డ్రైవ్ రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. రోడ్డుపై నిలిపి ఉంచిన ఓ ట్రక్కును ప్రయాణికులతో వెళ్తున్న కారు ఢీకొనడంతో ఈ విషాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న నలుగురు అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసు అధికారి వెల్లడించారు. మృతుల్లో మంత్రి దీపికా పాండే సింగ్ కుమార్తె ఉన్నట్లుతెలిపారు. ఈ ఘటనపై జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. సామాజిక మాధ్యమం ద్వారా స్పందించిన హేమంత్ సోరెన్ ఈ ఘటన అత్యంత విషాదకరమని పేర్కొన్నారు. దీపికా పాండే సింగ్ కుమార్తెతో పాటు ఇతరులు మృతి చెందడం తనను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. మంత్రి కుటుంబంతో పాటు మిగిలిన మృతుల కుటుంబాలకు తన సానుభూతిని తెలియజేశారు. బిడ్డను కోల్పోవడం ఏ తల్లిదండ్రులకైనా, కుటుంబానికైనా భరించలేని వేదన అని సోరెన్ పేర్కొన్నారు. ఈ కష్టకాలాన్ని తట్టుకునే శక్తిని బాధిత కుటుంబాలకు ప్రసాదించాలని ఆకాంక్షించారు. మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని మారాంగ్ బురును ప్రార్థించిన ముఖ్యమంత్రి ఈ విషాదాన్ని తట్టుకునే ధైర్యాన్ని వారి కుటుంబ సభ్యులకు ప్రసాదించాలని కోరారు.

# పార్టీ ఫిరాయింపుల చట్టం ఉల్లంఘనపై సుప్రీం తీర్పు చెంపపెట్టు

## - దానం కేసులో సుప్రీంకోర్టు తీర్పును మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నా - ఖైరతాబాద్ ఉప ఎన్నికలో.. రెండు ఫిరాయింపు పార్టీలకు ప్రజలు బుద్ధి చెబుతారు - బిజెపి ఘనవిజయం ఖాయం: కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 24 ప్రభాతవార్త:** పార్టీ ఫిరాయింపులకు పాల్పడి ప్రజాతీర్పును అపహాస్యం చేసిన ఖైరతాబాద్ బిఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ శాసనసభ సభ్యత్వాన్ని రద్దు చేయాలన్న తెలంగాణ హైకోర్టు తీర్పును.. సుప్రీంకోర్టు సమర్థించి.. హైకోర్టు తీర్పును అమలు చేయాలని ఇచ్చిన ఆదేశాన్ని మనస్ఫూర్తిగా స్వాగతిస్తున్నామని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. దానం నాగేందర్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడంతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానానికి ఉప ఎన్నిక జరగనుందన్నారు. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ నుంచి దానం నాగేందర్ బిఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, 2024లో కాంగ్రెస్ తరపున గత పార్లమెంటు ఎన్నికల్లో.. ఎంపి అభ్యర్థిగా సికింద్రాబాద్ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. దీనిపై బిజెపి తెలంగాణ హైకోర్టును ఆశ్రయిస్తే.. 2024 ఏప్రిల్ 23 నుంచి ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా హైకోర్టు ప్రకటించిందన్నారు. దీన్ని సుప్రీంకోర్టు ఇప్పుడు సమర్థించిందన్నారు. ఈ తీర్పు ఒక్క కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అంశం మాత్రమే కాదు. తెలంగాణలో కాంగ్రెస్, బిఆర్ఎస్ రెండు పార్టీలు చట్టవ్యతిరేకంగా అనుసరిస్తున్న పార్టీ ఫిరాయింపుల రాజకీయాలకు ఇది ఒక గుణపాఠం అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష ఎమ్మెల్యేలను తమ పార్టీలో చేర్చుకోవడం.. వారికి మంత్రిపదవులు ఇవ్వడం తెలంగాణ రాజకీయాల్లో ఈ రెండు పార్టీలు ఒక దురదృష్టకరమైన సంస్కృతిగా మార్చారు. ప్రజాతీర్పును కాలరాయడంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలు తెలంగాణలో పోటీ పడుతూ.. ప్రజాస్వామ్యాన్ని కాలరాస్తున్నారన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ ఫిరాయింపులను విమర్శించడం అధికారంలోకి వచ్చాక అదే ఫిరాయింపులను ప్రోత్సహించడం ఈ రెండు పార్టీల రాజకీయ ద్వంద్వ వైఖరికి అద్దం పడుతుంది. ప్రజాతీర్పును తమ రాజకీయ అవసరాలకు అనుగుణంగా కాలరాస్తున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు సుప్రీంకోర్టు తీర్పు స్పష్టమైన హెచ్చరిక అన్నారు. దానం నాగేందర్ అనర్హతతో ఖైరతాబాద్ అసెంబ్లీ స్థానం ఖాళీ అయిందన్నారు. ఇప్పుడు ఖైరతాబాద్ ప్రజలు.. అవకాశవాద, స్వార్థ, ఫిరాయింపు రాజకీయాలకు వ్యతిరేకంగా తమ ప్రతినిధిని ఎన్నుకునే అవకాశం రానుంది. ప్రజాస్వామ్యంలో అంతిమ నిర్ణేతలు ప్రజలే. ఈ రెండు పార్టీల కుళ్లు రాజకీయాలకు తగిన బుద్ధి చెప్పి.. ఖైరతాబాద్ అసెంబ్లీ ప్రజలు.. వచ్చే ఉప ఎన్నికలో బిజెపికి పట్టంగట్టడం ఖాయం అన్నారు.

# 34 యేళ్ల తర్వాత శ్రీనగర్‌లో చారిత్రక శీతల్‌నాథ్ ఆలయం పునఃప్రారంభం



**శ్రీనగర్, సెప్టెంబరు 24:** జమ్మూ కశ్మీర్‌లోని శ్రీనగర్‌లో చారిత్రక ప్రాధాన్యత కలిగిన శీతల్‌నాథ్ ఆలయం 34 ఏళ్ల తర్వాత భక్తుల కోసం తిరిగి తెరుచుకుంది. మూడు దశాబ్దాలకు పైగా మూసివున్న ఈ ఆలయం పునఃప్రారంభం కావడం కశ్మీరీ పండిట్ సమాజంతో పాటు భక్తుల్లో ప్రాధాన్యతను సంతరించుకుంది. శ్రీనగర్‌లోని హబ్బా కదల్ ప్రాంతంలో ఉన్న శతాబ్దాల నాటి శీతల్‌నాథ్ ఆలయాన్ని జమ్మూ కశ్మీర్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అతల్ దుల్లూ బుధవారం ప్రారంభించారు. పునర్నిర్మించిన, ఆధునీకరించిన శీతల్‌నాథ్ జీ భైరవ్ ఆలయంలో ప్రత్యేక హవన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ ఆలయ పునరుద్ధరణ పనులు శ్రీనగర్ స్మార్ట్ సిటీ కార్యక్రమం కింద చేపట్టారు. ఆలయ పునఃప్రారంభ కార్యక్రమంలో మాట్లాడిన ప్రధాన కార్యదర్శి అతల్ దుల్లూ, శీతల్‌నాథ్ ఆలయం శ్రీనగర్ చారిత్రక, సాంస్కృతిక వారసత్వంలో అంతర్భాగమని పేర్కొన్నారు. ఇలాంటి చారిత్రక, ఆధ్యాత్మిక ప్రదేశాలను భవిష్యత్ తరాల కోసం సంరక్షించడం సమాజం బాధ్యత అన్నారు.

# రాష్ట్రంలో వర్షాలకు అస్తవ్యస్తం - దెబ్బతిన్న వంతెనలు

## - పలు చోట్ల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు - వివిధ జిల్లాల్లో స్కూళ్లకు సెలవు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త** రాష్ట్రంలోని పలు జిల్లాల్లో కురుస్తున్న వర్షాలతో ప్రజా జీవనం అస్తవ్యస్థమైంది. వర్షాలకు తోడు, బలమైన ఈదురు గాలులు వీయడంతో పలు చోట్ల చెట్లు, విద్యుత్ స్థంభాలు కూలిపోగా, వంతెనలు సైతం దెబ్బతిన్నాయి. దీంతో వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. గడచిన 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా సగటున 33.8 మిల్లీమీటర్లు నమోదు కాగా, అత్యధికంగా మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తిలో 123.6 మిల్లీమీటర్ల వర్షపాతం రికార్డయింది. అయితే ఉష్ణోగ్రతలు కూడా ఇదే స్థాయిలో ఉన్నాయి. రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిర్యాల జిల్లా వెలగనూర్‌లో 35.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు చోటు చేసుకున్నాయి భారీ వర్షాల నేపథ్యంలో, కొత్తగూడెం, మహబూబాబాద్ తదితక జిల్లాల యంత్రాంగాలు గురువారం పాఠశాలలకు స్థానిక సెలవు ప్రకటించాయి. ఖమ్మంలో ప్రజలకు సహాయపడేందుకు 1077, 9063211298 టోల్ ఫ్రీ నంబర్లతో ఒక కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇతర ప్రాంతాలలో కురిసిన భారీ వర్షం కారణంగా జన జీవనానికి అంతరాయం కలిగింది. ఇక రాష్ట్రంలోని కొత్తగూడెం జిల్లాలో సాయంత్రం ఈదురు గాలులు బీభత్సం సృష్టించాయి. భారీ వర్షాల కారణంగా ములకలపల్లి వద్ద అకేరు వాగుపై ఉన్న రాజూపేట వంతెన కూడా పాక్షి కంగా దెబ్బతినడంతో, పలు గ్రామాలకు రహదారి అనుసంధానానికి అంతరాయం ఏర్పడింది. నల్లటి మేఘాలు ఆ ప్రాంతాన్ని కమ్మేశాయి. దీనికి తగినట్లు బలమైన గాలులు వీయడంతో అనేక చెట్లను కూల్చివేసి, పలు ఇళ్ల రేకుల పైకప్పులను దెబ్బతీసింది. ఈ గాలుల కారణంగా నివాసితులు గంటకు పైగా ఇళ్లలోనే ఉండవలసి వచ్చింది. పలువురికి స్వల్ప గాయాలైనట్లు సమాచారం. ములకలపల్లి మండలం రాజుపేట వద్ద పాలవాగు వాగుపై వంతెన కూలిపోవడంతో పాలొంచదమ్మపేట రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సాయంత్రం పొద్దుపోయిన వేళ వాగులో వరద నీరు అకస్మాత్తుగా ఉప్పొంగడంతో వంతెనలోని కొంత భాగం కొట్టుకుపోయిందని, మరో భాగంలో భారీ పగులు ఏర్పడటంతో అది తీవ్రంగా దెబ్బతిందని తెలిసింది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. అలాగే ఉమ్మడి ఖమ్మం, వరంగల్ జిల్లాల్లోని ఎస్సీసీఎల్ ఓపెన్‌కాస్ట్ గనులలో ఓవర్‌బర్డెన్ తొలగింపునకు అంతరాయం కలిగించాయి. ఖమ్మం జిల్లాలోని కల్లూరులో 71.5 మిల్లీమీటర్లు, భూపాలపల్లి జిల్లాలోని టేకుమట్లలో ఉదయం 73.8 మిల్లీమీటర్ల భారీ వర్షపాతం నమోదైంది.

# దానంపై వేటు.. బిజెఎల్పీ పోరాటమే

## బిజెపి శాసనసభ పక్ష నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి

**హైదరాబాద్, సెప్టెంబరు 24 ప్రభాతవార్త** ఎమ్మెల్యే దానం నాగేందర్‌పై అనర్హత వేటు వేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు సమర్థించడం రాజ్యాంగ విజయమని బిజెఎల్పీ చేసిన న్యాయపోరాటం వల్లే ఈ విజయం దక్కిందని బిజెపి శాసనసభ పక్ష నాయకులు ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. ఇదే స్ఫూర్తితో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న రాజ్యాంగ వ్యతిరేక చర్యలపై కోర్టుల్లో న్యాయపోరాటం క్షేత్రస్థాయిలో ప్రజా పోరాటాలు కొనసాగిస్తామన్నారు. ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అమలు చేయాల్సిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఫిరాయింపులను ప్రోత్సహించడం కంచే చేను మేసిన వైనాన్ని తలపించిందన్నారు. ఎమ్మెల్యేల ఫిరాయింపులను ప్రోత్సహించి రాజ్యాంగ ద్రోహానికి పాల్పడిన సిఎం రేవంత్ రెడ్డి ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని పార్టీ ఫిరాయించిన ఎమ్మెల్యేల తోటి రాజీనామాలు చేయించి ఉప ఎన్నికలకు వెళ్లాలన్నారు.



# శబరిమల ఆలయంలో బంగారు కిరీటం మాయం

**తిరువనంతపురం, సెప్టెంబరు 24:** ప్రఖ్యాత పుణ్యక్షేత్రం శబరిమలలో తీవ్ర సంచలనం రేపిన ఘటన వెలుగు చూసింది. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారికి సమర్పించిన విలువైన బంగారు కిరీటం అదృశ్యమైనట్లు ఆలయ స్టాక్ వెరిఫికేషన్‌లో తేలింది. అసలు కిరీటం మాయమై, దాని స్థానంలో అచ్చం అలాగే కనిపించే ఒక నకిలీ కిరీటం ఉండటాన్ని అధికారులు గుర్తించారు. తమిళనాడకు చెందిన చార్టెర్డ్ అకౌంటెంట్లు భక్తితో ఆగస్ట 2012లో ఈ బంగారు కిరీటాన్ని స్వామివారికి కానుకగా సమర్పించారు. అప్పట్లో ఈ కిరీటాన్ని అయ్యప్ప స్వామి విగ్రహానికి అలంకరించి, ఆ తర్వాత స్ట్రాంగ్ రూమ్‌కు భద్రపరిచారు. ప్రస్తుతం హైకోర్టు నియమించిన అమికస్ క్యూరీ జస్టిస్ కేటీ శంకరన్ ఆధ్వర్యంలో శబరిమల స్టోర్‌రూమ్ అలాగే ఆరన్ముల స్ట్రాంగ్ రూమ్‌లో కూలంకషంగా స్టాక్ వెరిఫికేషన్ నిర్వహిస్తు న్నారు.

# అట్రాసిటీ కేసుల్లో జాప్యం వద్దు

## ఎస్సీ,ఎస్టీ కమిషన్ ఛైర్మన్ వెంకటయ్య

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త** రాష్ట్రంలోని అట్రాసిటీ కేసుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర ఛైర్మన్ బక్కి వెంకటయ్య తెలిపారు. కొంగరకలాన్లోని ఐడీఓసీ సమావేశ మందిరంలో గురువారం పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖల అధికారులతో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, హక్కుల పరిరక్షణ పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అట్రాసిటీ కేసుల దర్యాప్తు, బాధితులకు న్యాయం, పరిహారం చెల్లింపు తదితర అంశాలపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. కేసుల పరిష్కారంలో అనవసర జాప్యం లేకుండా పోలీసు, రెవెన్యూ, సంక్షేమ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీల భూ సమస్యలు, విద్య, ఉపాధి, సంక్షేమ పథకాలు, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీలో తాగునీరు, పారిశుద్ధం, విద్యుత్, రహదారులు తదితర సౌకర్యాలను అధికారులు నిరంతరం పర్యవేక్షి ంచాలని సూచించారు. అట్రాసిటీ నిరోధక చట్టం అమలుపై

# నాచారం పరిధిలో కాల్పుల కలకలం

## సుపారీ తీసుకుని హత్యకు యత్నం.. తుపాకీ మిస్‌ఫైర్‌తో తప్పిన ప్రమాదం

**నాచారం, సెప్టెంబర్ 24 ప్రభాతవార్త :** నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తిని హత్య చేసేందుకు సుపారీ తీసుకున్న ముఠా జరిపిన కాల్పులు కలకలం రేపాయి. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనకు సంభందించి వివరాలిలా ఉన్నాయి...గత నెల 3న మల్లాపూర్ ప్రధాన రోడ్డులో ఉన్న ఉషోదయ సూపర్ మార్కెట్ ఎదురుగా వ్యక్తి ఆయుధాలతో బెదిరింపు, కాల్పుల్పులు జరిపి పారిపోయాడు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని ఈ దర్యాప్తులో చేస్తున్న క్రమంలో నాచారం పోలీసులు నిందితుల కోసం భీహారం రాష్ట్రానికి వెళ్లి అక్కడి పోలీసులతో కలిసి కాల్పులకు పాల్పడిన వారిని అరెస్టు చేసినట్లు తెలిపారు. ఇందులో భాగంగా బీహార్ రాష్ట్రం, వెస్ట్ చంపారన్ జిల్లా కు చెందిన అశిష్ కుమార్ (22), చండీఘడ్‌కు చెందిన సందీప్ మహాజన్ (30),వెస్ట్ చంపారన్ జిల్లా, బీహార్ కు చెందిన శశి కుమార్, వయస్సు (23) నిందితుల ప్రమేయానికి సంబంధించిన ఆధారాలు వెలుగులోకి వచ్చాయి. వీరిని పోలీసులు అరెస్టు చేసినట్లు తెలిపారు.వారి కదలికలు, పరస్పర సంబంధాలు, హైదరాబాద్లో వారి బస మరియు ఘటనకు సంబంధించిన ఇతర అంశాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు. దర్యాప్తులో లభించిన సమాచారంపై బీహార్ రాష్ట్రంలో స్థానిక పోలీసుల సహకారంతో నిర్వహించిన శోధనలో ఆయుధం స్వాధీనం చేసుకున్నారు. మరో వైపు చౌతర్వా పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేశారు. ఆయుధాలకు కేసుతో సంబంధాన్ని నిర్ధారించాలన్నారు.

# రెవెన్యూ వసూళ్లలో వృద్ధి - పెరిగిన పన్నుల ఆదాయం

## - ఖజానాకు రూ.77,536 కోట్లు రాక - వార్షిక బడ్జెట్ అంచనాలో 32.14 శాతం నమోదు

**హైదరాబాద్, సెప్టెంబరు 24, ప్రభాతవార్త** కష్టాల్లో ఉన్న ప్రభుత్వ ఖజానాను గట్టెక్కించేందుకు రాష్ట్ర సర్కార్ అమలు చేస్తున్న ఆర్థిక నియంత్రణ విధానాలు సత్ ఫలితాలు ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర రెవెన్యూ వసూళ్లలో వృద్ధి చోటు చేసుకుంది. రాష్ట్ర ఆర్థిక శాఖ గణాంకాల ప్రకారం ప్రస్తుత 2026-27 మొదటి ఐదు నెలల్లో తెలంగాణ రెవెన్యూ వసూళ్లు బలంగా పుంజుకున్నాయి. ఏప్రిల్ నుండి అగస్టు నెలాఖరు వరకూ ఇవి రూ.77,536 కోట్లకు చేరుకుని రూ.2.41 లక్షల కోట్ల వార్షిక బడ్జెట్ అంచనాల్లో 32.14 శాతంగా ఉన్నాయి. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఆదాయ సమీకరణ వేగం ఎక్కువగా ఉంది. ఆగస్టు నాటికి వసూళ్లు వార్షిక అంచనాలో 27.52 శాతానికి చేరుకున్నాయి. ఇది రాష్ట్ర ఆదాయ పరిస్థితి మెరుగుపడిందనే అంశాన్ని సూచిస్తుంది. కేంద్ర పన్నులలో రాష్ట్ర వాటా రూ.8,946 కోట్లుగా ఉండగా, గ్రాంట్లు మరియు ఇతర విరాళాలు మొత్తం రూ.2,963 కోట్లుగా ఉన్నాయి. వసూళ్లకు పన్ను రాబడి ప్రధాన చోదకంగా కొనసాగింది, రాష్ట్ర ఖజానా వసూళ్లకు పన్ను రాబడి ప్రధాన అవకాశంగా కొనసాగి రూ.69,097 కోట్లకు చేరుకున్నాయి. ఇది రూ.1.81 లక్షల కోట్ల వార్షిక లక్ష్యంలో 38.1 శాతానికి సమానం. అయితే పన్నులు కాకుండా ఇతర వనరుల నుండి వచ్చే రాబడులు అంతంత మాత్రంగానే ఉన్నాయి. దీంతో పన్నేతర రాబడి రూ.5,476 కోట్ల వద్ద సాపేక్షంగా మందకొడిగా ఉండి, వార్షిక అంచనాలో కేవలం 15.32 గా ఉంది.

# ఇసిలో నియంతృత్వం - ప్రజాస్వామ్య పరిరక్షణ ఎక్కడుంది?:కెటిఆర్

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్యంగా చెప్పుకునే మన దేశంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన ఎన్నికల సంఘం తీరు దాదాపు నియంతృత్వ ధోరణిలోకి వెళ్తున్నదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ముగ్గురు ఎన్నికల కమిషనర్లలో ఇద్దరు పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నప్పుడు, ఎన్నికల సంఘం పనితీరును సరిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ముగ్గురిలో ఇద్దరు ఒక నిర్ణయానికి వ్యతిరేకంగా ఉన్నప్పుడు అది మెజారిటీ కాదా? ఇప్పటివరకు మెజారిటీ అంటే ఇదే కదా.. ఇప్పుడు దాని నిర్వచనం కూడా మారుతున్నట్టుందని కేటీఆర్ ప్రశ్నించారు. ఓటర్ల నమోదు, ఓట్ల తొలగింపు, తొలగించిన ఓట్లను తిరిగి చేర్చడం వంటి అంశాల్లో సందేహాలకు తావిచ్చేలా నిర్ణయాలు తీసుకుంటే, అసలు మనం ఇంకా ప్రజాస్వామ్యంలోనే ఉన్నామా? అని ఆయన ప్రశ్నించారు.

# చార్మినార్ మొదటి అంతస్తులోని పెచ్చు లూడిన డిజైన్‌కు మరమ్మతులు

**చార్మినార్,సెప్టెంబరు 24 ప్రభాతవార్త :** చారిత్రక చార్మినార్‌కు పడమర దిక్కున లాడ్‌బజార్ వైపు ఉన్న మొదటి అంతస్తు బయట డిజైన్‌లోని పెచ్చు లూడి పోయినచిన్న సైజు భాగానికి మరమ్మతులు చేయటానికి అధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.వర్షం జల్లులకు చార్మినార్ కట్టడంలోని పడమర వైపు ఉన్న మొదటి అంతస్తు డిజైన్‌లోని చిన్న సైజు పెచ్చులూడి పోయిన విషయం తెలిసిందే.కాగా గురువారం ఆర్కియాలజీ సర్వే ఆఫ్ ఇండియా డిప్యూటీ సూపరిండెంట్ కె.కృష్ణ చైతన్య,ఎఎస్ ఐ అసిస్టెంట్ ఇంజనీరు కిశోర్ కుమార్, చార్మినార్ కన్జర్ వేటర్ రాజేశ్వరీతో పాటు పలువురు ఎఎస్ఐకు చెందిన అధికారులు చారిత్రక చార్మినార్‌ను సందర్శించారు.చార్మినార్ కట్టడం మొదటి అంతస్తులో పెచ్చులూడి పోయిన చిన్న సైజు డిజైన్‌ను అధికారుల పరిశీలించారు. పెళ్ల కూలిన డిజైన్ చిన్న సైజుకు మరమ్మతులు చేయనున్నామని అధికారులు వెల్లడించారు.

# యూరప్‌తో హైదరాబాద్ వాయు కార్గో అనుసంధానం బలోపేతం

## - బ్రస్సెల్స్ విమానాశ్రయంతో జీహెచ్ఐఏఎల్ అవగాహన ఒప్పందం

**శంషాబాద్ సెప్టెంబరు24,ప్రభాతవార్త :** యూరప్‌తో హైదరాబాద్ వాయు కార్గో అనుసంధానాన్ని మరింత బలోపేతం చేసేందుకు జీఎంఆర్ శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం లిమిటెడ్ (జీహెచ్ఐఏఎల్), బ్రస్సెల్స్ విమానాశ్రయంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. హైదరాబాద్ అభివృద్ధి చెందుతున్న కార్గో సామర్థ్యాలను, యూరప్ వాయు కార్గో రంగంలో బ్రస్సెల్స్ విమానాశ్రయానికి ఉన్న అనుభవం, మౌలిక సదుపాయాలతో అనుసంధానించడం ఈ ఒప్పందం ప్రధాన ఉద్దేశం.ఎంఓయూలో భాగంగా ఇరు విమానాశ్రయాలు మార్గాల అభివృద్ధి, మార్కెట్ సమాచారం, కార్గో రంగంలోని ఉత్తమ విధానాల పరస్పర మార్పిడి, విమానయాన సంస్థలు, సరుకు రవాణా సంస్థలు, ఇతర భాగస్వాములతో సమన్వయం వంటి అంశాల్లో కలిసి పనిచేయనున్నాయి. హైదరాబాద్‌ను యూరప్‌లోని కీలక మార్కెట్లతో అనుసంధానించే అవకాశాలను సంయుక్తంగా గుర్తించనున్నారు.జీహెచ్ఐఏఎల్ సీఈఓ కధీర్ కధీరవన్ మాట్లాడుతూ.. హైదరాబాద్ వేగంగా విస్తరిస్తున్న ఆర్థిక వ్యవస్థ, వ్యూహాత్మక భౌగోళిక స్థానం అంతర్జాతీయ వాణిజ్యానికి కీలక ద్వారం.

# మహేశ్‌గౌడ్, అద్దంకి దయాకర్‌లపై పరువు నష్టం పిటీషన్లను కోర్టు స్వీకరించింది: హారీశ్‌రావు

**హైదరాబాద్,సెప్టెంబరు24,ప్రభాతవార్త:** తాను క్షుద్ర పూజలు చేశానంటూ తప్పుడు ప్రచారం చేసిన పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌లపై ఆధారాలతో క్రిమినల్ పరువు నష్టం పిటిషన్ దాఖలు చేయగా, కోర్టు విచారణకు స్వీకరించిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్ రావు తెలిపారు తెలిపారు. ఈ విషయంలో ఈనెల 30న తన స్టేట్‌మెంట్ రికార్డు చేసేందుకు కోర్టు అనుమతించిందని వెల్లడించారు. గురువారం నాంపల్లి ప్రజాప్రతినిధుల కోర్టుకు వెళ్లిన ఆయన అక్కడ మీడియాతో మాట్లాడారు.మహేశ్‌గౌడ్,దయాకర్‌లపై లీగల్ గా ముందుకు వెళ్తున్నాం. పరువు నష్టం దావా కేసు ఆధారాలతో సహా ఫైల్ చేసినం. కోర్టు వారు పిటీషన్ స్వీకరించారని చెప్పారు. దేవుళ్ల దగ్గరకు వెళ్తే కూడా క్షుద్ర పూజలు అంటూ పిచ్చి పిచ్చిగా మాట్లాడుతున్నారు.ఇంతకంటే దిగజారుడు రాజకీయాలు ఉండవు. దిగజారుడు వ్యాఖ్యలు ఉండవు.

# సిఇసి జ్ఞానేష్ కుమార్ దిష్టిబొమ్మదగ్ధం

**హైదరాబాద్, సెప్టెంబర్ 24ప్రభాతవార్త:** ఒక రాజకీయ పార్టీకి అనుకూలంగా ఓటర్ల జాబితా రూపొందిస్తున్న సిఇసి జ్ఞానేష్‌కుమార్ దిష్టి బొమ్మను దగ్ధం చేసి ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ నిరసన వ్యక్తంచేశారు.

సర్‌లో ఫారం6 మార్పులు, ఓటర్ల చేర్పులు తొలగింపులు ఎలక్టోరల్ రోల్ డేటా పై ఆందోళనల నేపథ్యంలో, సిఇసిజ్ఞానేష్ కుమార్ ను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

# ట్రంప్ మీడియా నిషేధం ఉత్తర్వులు రద్దుచేసిన ఫెడరల్ జడ్జి

**న్యూయార్కు, సెప్టెంబరు 24:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సీఎన్ఎన్, ఎంఎస్ నౌ, పొలిటికో మీడియా సంస్థల జర్నలిస్టులకు వైట్‌హౌస్ ప్రవేశాన్ని నిషేధించిన నిర్ణయాన్ని ఫెడరల్ న్యాయమూర్తి తిప్పికొట్టారు. ఈ నిషేధం రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంటూ, వెంటనే ప్రెస్ పాసులు పునరుద్ధరించాలని ఆదేశించారు. యుఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి టిమ్ కెల్లీ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. ఈనెల 18న ట్రంప్ ప్రకటించిన నిషేధాన్ని సవాలు చేస్తూ ఈ మూడు సంస్థలు దాఖలు చేసిన దావాలో ఈ తీర్పు వెలువడింది.

# మీ కూరల్లో పోషకాలు ఉన్నాయా?



చాలా మంది ఆహారంలో ఏం తింటున్నా మనే దానిపైన చేపేంత శ్రద్ధ.. వాటిని ఎలా వండుతున్నారనే దానిపై పెట్టరు. ఇదే చాలా ముఖ్యం. అందుకోసం కొన్ని జాగ్రత్తలు తెలుసుకుందాం..

సమయాభావంతోనో, పని వెసులుబాటు కోసమో కూరగాయలూ, పండ్లను ముందే ముక్కలుగా కోసి పెట్టుకుంటారు కొందరు. కానీ అది మంచి విధానం కాదంటారు నిపుణులు. పండ్లూ, కూరగాయల్ని కోసం ఉంచడంవల్ల. సమయం గడిచేకొద్దీ వాటిల్లోని విటమిన్లూ, ఖనిజ లవణాల విలువ తగ్గడం మొదలవుతుంది. ఫ్రోజెన్ వెజిటబుల్స్‌ని అమ్మే సంస్థలు వాటిలోని పోషకాలు పోకుండా కొన్ని చర్యలు చేపట్టినా.. వండే ముందు కోసిన వాటి లోనే పోషకాలు ఎక్కువ. కూర గాయల ముక్కలు రెడీమేడ్‌గా దొరుకు తున్నాయి. వీటిలో పోషకాల తరుగుదలతో పాటు పరి శుభ్రతా సమస్యగా ఉంటుందం టారు. అందుకని తాజా పండ్లూ, కూరగాయల్ని నేరుగా కొన్ని శుభ్రపరిచి తినడం, వండుకోవడం ముఖ్యం. ఇలా చేయడంవల్ల వాటిపైన ఉండే హానికర బ్యాక్టీరియా, రసాయనాలు పోవడమే కాదు, పోషకాల్నీ పూర్తిస్థాయిలో పొందొచ్చు. నిల్వ ఉండే పండ్లూ అందుబాటులో ఉన్నాయి. క్యాన్‌లో ఉంచే ఫైనాపిల్, స్ట్రాబెర్రీలు అలాంటివే. అయితే నిల్వ ఉండేందుకు వీటిలో హెచ్చుస్థాయిలో పంచదార, ఉప్పు కలుపుతారు. ఇవి ఆయా పదార్థాల పోషక విలువల్ని తగ్గిస్తాయి. వంట చేయడమంటే సమయాన్ని ఆదాచేయడం కాదు,మన ఆరోగ్యాన్ని పెంచుకోవడానికి పోషకాల్ని అందించడం. వండే విధానాన్నిబట్టీ పోషకాలు ఉండటం, తగ్గటం జరుగుతుంది. పదార్థాల్ని ఉడికించాక వాటినుంచి నీటిని వేరుచేస్తే ఆ నీటితోపాటు పోషకాలూ పోతాయి. కూరగాయల్ని ఆవిరి విధానంలో ఉడికిస్తే.. పోషకాలు తగ్గకుండా ఉంటాయి. కూరగాయల్ని పెద్ద ముక్కలుగా కోసి వండినప్పుడు వాటిలో పోషకాలు తగ్గే ముప్పు తక్కువ. చిన్నవిగా కనిపించినా ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసు కోవడంలో ఇవన్నీ చాలా ముఖ్యమైన అంశాలు. □

## రోజూ మస్కారా వాడాల్సొస్తే ?



కను రెప్పల్ని తీర్చిదిద్దు కోవడానికి చాలామంది మస్కారా వాడడం తెలిసిందే. అయితే రోజూ దీన్ని వాడడం వల్ల ఇందులోని రసాయనాలు కనురెప్పల ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయంటున్నారు నిపుణులు. ఒకవేళ వాడాల్సివస్తే ఈ జాగ్రత్తలు తీసుకోవడం మంచిదంటున్నారు. కనురెప్పలకు పోషణనందించడానికి, అవి పొడిబారకుండా చేయడానికి మస్కారా పెట్టుకునే ముందు మస్కారా ప్రైమర్ అప్లై చేసుకోవడం మంచిది. ఫలితంగా ఒతుగ్గా, అందంగా కనిపిస్తాయి. ఫార్మాల్డిహైడ్, సింథటిక్.. వంటి రసాయనాలు/ పదార్థాలు ఉపయోగించి తయారు చేసిన మస్కారాలు అస్సలు వాడకూడదు. సాధారణంగా మేకప్ ఉత్పత్తుల్ని ఏడాదికోసారి మార్చాల్సి ఉంటుంది. అదే మస్కారానైతే ఆరు నెలలకోసారి మార్చ మంటున్నారు నిపుణులు. అందుకే కొనే ముందే అవి ఎప్పుడు తయారయ్యాయి. వాటి గడువు తేదీ ఎప్పటి వరకు ఉంది. వంటి విషయాలను ఒకటికి రెండుసార్లు పరిశీలించాల్సి ఉంటుంది. కనురెప్పలు ఒత్తుగా పెరగాలన్నా, మస్కారా ప్రభావం వాటిపై పడకుండా ఉండాలన్నా.. ఆహార నియామాల్లోనూ పలు మార్పులు చేసుకోవాలి. ఈ క్రమంలో 'డి', 'ఇ' విటమిన్లు అధికంగా లభించే చేపలు, గుడ్లు, పుట్టగొడుగులు.. వంటివి ఎక్కువగా తీసుకోవాలి. మస్కారా కండిషనర్లు కూడా ప్రస్తుతం బయట దొరుకు తున్నాయి. వాటిలో నాణ్యమైనది ఎంచుకుంటే కనురెప్పల్ని తేమగా ఉంచుకోవచ్చు. ఒత్తుగా పెరిగేలా చేయచ్చు. కేవలం మస్కారా మాత్రమే అప్లై చేసుకున్న ప్పటికీ రాత్రి పడుకునే ముందు తొలగించ ుకోవడం మర్చిపోవద్దు. అలాగే మస్కారా బ్రష్‌లను కూడా వాడిని ప్రతిసారీ శుభ్రం చేయాల్సిందే! ఇదేం పెద్ద పని కాదు. సింపుల్‌గా వాటిని టిష్యూతో తుడిచేస్తే సరిపోతుంది. □

# మానసిక భద్రత అవసరం ..



**ఉదయాన్నే పిల్లల్ని స్కూలుకి సమయానికి పంపడంలో బిజీ. సాయంత్రం పనులు, వాళ్ల హోమ్‌వర్క్‌లతో హడావుడి. వాళ్ల చుట్టూనే తిరగుతున్నట్లు అనిపిస్తుంది. వాళ్లతో నిజంగానే గడుపుతున్నామా అంటే చెప్పడం కష్టమే. ఆ భావన వాళ్లకి కలగొద్దంటే.. వీటి గురించి కనుక్కోండి.**

చాలామంది తల్లిదండ్రులు అడిగే ప్రశ్నే. దానికి అవతలి నుంచి 'బాగానే ఉంది' అన్న సమాధానం రాగానే ఊరుకుంటాం అవునా? పిల్లల్ని బాగా అర్థం చేసుకోవాలంటే అంతటితో ఆగొద్దు. అదనపు ప్రశ్నలు వేయాలి. సంభాషణ కొనసాగించాలి. అప్పుడే పిల్లలకి పంచుకోవడం అలవాటు అవుతుంది. ఏదైనా ధైర్యంగా చెప్పడానికీ ముందుకొస్తారు. ఎంత చిన్న ప్రశ్నో! కానీ పిల్లలకు సానుకూలాలతలు చూడటం అలవాటు చేసినవారు అవుతారు. 'టీచర్ మెచ్చుకున్నారు' అనగానే 'వావ్' అని బదుల్విండి. చిన్న చినన విజయాలను ఆస్వాదించడం నేర్పినవారు అవుతారు. ఆనందకర సంఘటనలను పంచుకునేలా ప్రోత్సహించడం ద్వారా ఆశావాద దృక్పథం అలవడుతుంది. మంచి విషయాలను గమనించడం మొదలు పెడతారు. ఇది వాళ్లలో ఆత్మవిశ్వాసాన్నీ పెంచుతుంది. ఏ వయసుకి ఆ కష్టాలు. కాబట్టి, స్కూల్లో నచ్చని రోజులూ, సంఘటనలూ మామూలే. అందుకే దాన్నీ కనుక్కోవాలి. ఫ్రెండ్‌తో గిల్లికజ్జాలు, చదువు ఒత్తిడి, పాఠం అర్థం కాకపోవడం.. ఇలా వాళ్లని ఇబ్బంది పెట్టేవీ చాలానే. మీరలా అడుగుతూ ఉండండి. చెప్పే క్రమంలో మానసిక భరోసా పొందుతారు. లోలోపలే బాధ పడుతూ ఉండిపోక వాళ్ల అభద్రతనూ బాధల్నీ మీతో పంచుకుంటారు. పాఠం, నైపుణ్యం, క్రాఫ్ట్, జోక్.. బయటికి వచ్చేవి చాలానే. రోజూ అడుగుతూ ఉండండి. తెలుసుకోవలనే కోరిక, ఆత్మ విశ్వాసమే కాదు... వాళ్లలో నేర్చుకోవడంపై ఇష్టమూ పెరుగుతుంది. ఈ ప్రశ్నలో దయ, సహాను భూతి పిల్లలను పెంచుతుంది. వాళ్లకి సాయపడతారు. టీమ్ వర్క్ ను నేర్చుకుంటారు. అంతేనా, సాయం అవసరమైతే అడగాలి, సందే హించొద్దు అన్నదీ తెలుస్తుంది. మీర తారు కానీ ఇవి పిల్లలకు మానసిక భద్రతను ఇస్తాయి. తమకు ప్రాధాన్యముందని భావిసు_న్నారు. ఆలోచనలు, అనుభవాలు అన్నీ పంచు కుంటారు. సురక్షితంగా ఫీలవుతారు. పిల్లలకు కావాల్సింది సలహాలు కాదు. తాము చెప్పేది వినేవాళ్లు. అందుకే అడగండి, వినండి. మీ పిల్లలు సంతోషంగా, ఆత్మవిశ్వాసంతో ఎదగడం గమనిస్తారు. □

## లక్ష్మీదేవి ఆరాధన



జీవితంలో ఆర్థిక పరమైన ఇబ్బందులు అతి దుర్భరమైనవిగా అనిపిస్తూ ఉంటాయి. సమస్యలు .. ఆపదలు .. అనారోగ్యాలు పలకరించిన ప్పుడు, ఆర్థిక పరమైన స్థోమత బాగుంటే మిగతా వాటిని ఎదుర్కొనే ధైర్యం ఉంటుంది. ఆర్థిక పరమైన బలం లేనప్పుడు మనిషి మరింత బలహీనుడిగా మారి పోతాడు. అందుకే ఆర్థికపరమైన సామర్థ్యం కోసం ఎవరికివారు తమవంతు కష్టపడుతుంటారు. ఆర్థిక పరమైన ఇబ్బందుల నుంచి బయటపడా లంటే లక్ష్మీదేవి అనుగ్రహం వుండాలని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతున్నాయి. అమ్మవారి అనుగ్రహం కలగాలంటే ఆ తల్లికి ప్రీతి కలిగేలా ఆరాధం చాలి. శుక్రవారం అనేది అమ్మవారికి ప్రీతికరమైన రోజు అనే విషయం తెలిసిందే. ఆ రోజున అమ్మవారిని పంచామృతా లతో అభిషేకించి .. గులాబీలతో అర్చించి, ఆ తల్లికి ఇష్టమైన పాయసాన్ని నైవేద్యంగా సమర్పించవలసి ఉంటుంది. ఈ విధంగా చేయడం వలన ఆర్థిక పరమైన సమస్యలు తొలగిపోయి, సంపదలు చేకూరతాయని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి. □

## మిలన్ రిండ్ కర్రీ



పుచ్చకాయ ముక్కలు: ఎరుపు రంగు భాగం తీసేసినవి అయిదారుపచ్చిమిరపకాయలు:
నాలుగుఆవాలు: టీ స్పూన్‌మినప్పప్పు, పచ్చి శనగపప్పు, జీలకర్ర: అర టీ స్పూన్ చొప్పున
నూనె: టేబుల్ స్పూన్‌పసుపు : పావు స్పూను
ఆవపిండి: ఒక టీ స్పూన్ కొత్తిమీర:
నాలుగు రెబ్బలుఉప్పు: తగినంత

తయారీ :ముందుగా పుచ్చకాయను ముక్కలుగా తరిగి ఎరుపు రంగు తీసేయాలి, ఆ తర్వాత పైన ఉండే ఆకుపచ్చ రంగు భాగాన్ని కూడా చాకుతో తీసేసి తెలుపు రంగులో ఉండే ముక్కల్ని బాగా తురుము కోవాలి. గ్రేటర్‌లో పెద్ద రంధ్రాలు ఉండే భాగాన్ని అందుకోసం ఎంచుకోవాలి. ఇప్పుడు పొయ్యి మీద మూకుడు పెట్టి నూనె వేసి, అందులో ఆవాలు, జీలకర్ర వేసి చిటపటలాడ నివ్వాలి. మిన ప్పప్పు, పచ్చి శనగపప్పు, పచ్చి మిరపకాయలు కూడా జోడించి బాగా వేగనివ్వాలి. తర్వాత ఈ పుచ్చకాయ తురుమును వేసి తగినంత ఉప్పు, పసుపు కూడా వేసుకోవాలి. అందులో నీరు అంతా పోయేదాకా వేగనివ్వాలి. చిన్న గిన్నెలో ఆవపిండిని నీళ్లతో జారుడుగా కలిపి కూర పూర్తయ్యే ముందు వేసి బాగా కలుపుకోవాలి. ఆవ రుచి ఇష్టం లేని వాళ్లు దీన్ని వదిలేయవచ్చు. చివర్లో కొత్తిమీర వేసి దించుకుంటే పుచ్చకాయ చెక్కు కూర సిద్ధమైనట్టే! □

## మొక్కలకు సాయపడదాం !

తోట, బాల్కనీలో మొక్కలు ఆరోగ్యంగా పెరగడానికి ఎరువులెలా వేస్తామో, అవి సవ్యంగా ఎదిగేలా చేయడానికి సాయాన్నీ ఇవ్వాలి. ఇందుకోసం మార్కెట్‌లో పలురకాల 'గార్డెన్ స్టేక్స్' లభ్యమవుతున్నాయి.

**రింగ్ ఏర్పాటుతో..** ఇనుము లేదా ప్లాస్టిక్ తో తయారయ్యే ఈ స్టేక్స్ పొడవుగా ఉండి చివరలో రింగ్ ఉంటుంది. అవుట్‌డోర్ క్రోటన్స్, లిల్లీజాతి మొక్కలు, ఇండోర్ స్నేక్ ప్లాంట్ వంటివి నిటారుగా పెరగడానికి ఇవి సాయపడతాయి. మొక్క చివర్లో పూసే పూల కంకులు, చిగుర్లను స్టేక్‌కు చివర ఉన్న రింగ్‌లో సర్దితే పక్కకు వాలవు. అవసరమైనప్పుడు దీని పొడవు ను పెంచు కోవచ్చు కూడా. అలా మొక్క ఎదిగేకొద్దీ ఇది సాయపడు తుంది. అలాగే తీగజాతి పూలమొక్కలు తొట్టె నుంచి ఒకే ఎత్తులో పెరిగేలా చేయడానికి కంచెలా ఉండే స్టాండులు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. దీంతో పూలతోపాటు మొక్క దీని లోపలే పెరుగుతూ చూడముచ్చటగా ఉంటుంది. ఇదేరకమైన స్టేక్స్‌ను టొమాటో మొక్కను పెంచుతున్న తొట్టెకూ అమర్చొచ్చు.

**ఇండోర్‌లో...** మనీప్లాంట్ వంటి ఇండోర్ మొక్కలకు ఆసరా ఇవ్వడానికి ఇనుము, ప్లాస్టిక్ లేదా వెదురుతో తయారయ్యే స్టేక్స్ వస్తున్నాయి. గుండ్రని, జిగ్‌జాగ్, తేనెపట్టు తదితర డిజైన్లలో ఉంటాయివి. ఈటిని తొట్టెలో గుచ్చి మొక్క తీగలను అనుసంధానం చేస్తే చాలు. మొక్క అందంగా అల్లుకుంటూ పెరుగుతుంది. దాని ఎదుగుదలా సరైన రీతిలో సాగుతుంది. అలాగే పెద్ద పెద్ద ఆకులున్న క్రోటన్ మొక్కకు కాండాలవద్ద గుండ్రని రింగ్‌లాంటిది అమర్చొచ్చు. దీనివల్ల ఆకులన్నీ దగ్గరగా ఉండి చక్కగా పెరుగుతాయి. ఇండోర్‌ప్లాంట్స్‌లో తీగజాతి మొక్కలను గోడపై అందంగా పెంచడానికి బ్రాస్ చెయిన్ దొరుకుతోంది. గది గోడలకు పైనుంచి ఈ గొలుసును వేలాడదీసి, దీనికి మొక్కను అటాచ్ చేస్తే చాలు. ఇంట్లో కావాల్సినచోట మొక్క అందంగా పాకుతుంది. వీటితోపాటు మెటల్ ప్లాంట్ ట్రెల్లీస్ ఇప్పుడు మార్కెట్‌లో లభ్యమవుతున్నాయి. □

# తెర

## 'సిగ్మా'లో డిఫరెంట్ క్యారెక్టర్ చేశా : ఫారియా అబ్దుల్లా



**సిగ్మా జర్నీ గురించి?**
సిగ్మా నా ఫస్ట్ తమిళ్ సినిమా. లైకా లాంటి పెద్ద ప్రొడ్యూసర్స్ బ్యానర్‌లో అవకాశం రావడం చాలా హ్యాపీగా ఉంది. ఇది మంచి యాక్షన్‌అడ్వెంచర్ హీస్ట్ కామెడీ ఎంటర్టైనర్. మంచి టెక్నీషియన్స్, నటీనటులు ఈ సినిమాకి పనిచేశారు.
ఇందులో నా క్యారెక్టర్ రేడియో జాకీ. ఈ సినిమాలో నాకు మంచి ఎమోషన్స్ చూపించే అవకాశం దొరికింది. ఈ సినిమాలో అన్ని రకాల ఎమోషన్స్ ప్రజెంట్ చేశాను. ఫ్యామిలీతో కలిసి మీరు సినిమా చూడొచ్చు.

**మత్తు వదలరా నుంచి మీరు కాస్త యాక్షన్ వైపు ఆసక్తి చూపిస్తున్నారు అనిపిస్తుంది?**
యాక్షన్ నా పర్సనాలిటీకి కూడా నప్పుతుంది. నాకు అన్ని రకాల సినిమాలు చేయాలనుంది. యాక్షన్ సినిమాలు చేయడం కూడా ఇష్టపడతాను.

**సందీప్ కిషన్‌తో మీ కెమిస్ట్రీ ఎలా ఉంటుంది?**
సందీప్ గారు నాకు ఎప్పటినుంచో తెలుసు. మా ఇద్దరం కలిసి ఒక సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకున్నాము. ఫైనల్‌గా సిగ్మాతో కుదిరింది. ఇందులో మా క్యారెక్టర్స్ లో చాలా కొత్తదనం వుంటుంది.

**జేసన్ కథ చెప్పినప్పుడు ఎలా అనిపించింది?**
జేసన్ జూమ్ కాల్‌లో కథ చెప్పారు. కథ మొత్తం విన్న తర్వాత ఆయన ఏజ్ ఎంత అని అడిగాను. 24 ఏళ్ల అని చెప్పారు. నాకు చాలా ఇన్‌స్పైరింగ్‌గా అనిపించింది. తను విజయ్ అబ్బాయి. తనకు డైరెక్షన్ మీద మంచి కమాండ్ ఉంది. తొలి సినిమా అయినప్పటికీ ఎంతో క్లారిటీ ఉన్న విజన్‌తో తీశారు. తన సెట్‌ను హ్యాండిల్ చేసిన విధానం చాలా కూల్‌గా ఉంటుంది.

**ఈ ట్రైలర్ రాజమోళి రిలీజ్ చేశారు కదా.. ఆయన ఎలాంటి ఫీడ్‌బ్యాక్ ఇచ్చారు?**
ఒక మంచి కమర్షియల్ ఎంటర్టైనర్‌లా ఉంది అని చెప్పారు. ఈ సినిమా చేస్తున్నప్పుడు మీరందరూ చాలా ఫన్నీ ఎక్స్‌పీరియన్స్ చేసుంటారని అన్నారు. నిజంగానే మేము చాలా ఎంజాయ్ చేస్తూ చేశాం. నాకు సిగ్మా 2 కూడా చేయాలని ఉంది.

**తమిళ్‌కి వెళ్లారు కదా.. అక్కడి పరిశ్రమకు, ఇక్కడి పరిశ్రమకు ఏదైనా తేడా గమనించారా?**
పరిశ్రమ ఒకలాగే ఉంది. కాకపోతే ఆహారపు అలవాట్లు కొంచెం భిన్నంగా ఉన్నాయి. సిగ్మా లాంటి మంచి ప్రాజెక్ట్‌తో తమిళ్‌లో పరిచయం కావడం హ్యాపీగా ఉంది.

**తమన్ మ్యూజిక్ గురించి?**
తమన్ బీజీఎం నెక్స్ట్ లెవెల్‌లో ఉంటుంది. ఆయన సిగ్నేచర్ మీకు కనిపిస్తుంది. ఇందులో చివర్లో సిగ్మా స్టైల్ పాట ఉంది. ఆ పాటను చాలా ఎంజాయ్ చేస్తూ చేశాను. పాటలు రీచ్ అవ్వడం నాకు అడ్వాంటేజ్‌గా అయింది.

**దర్శకత్వం చేసే ఆలోచన వుంది?**
నాకు దర్శకత్వం పై ఆసక్తి ఉంది. కొన్ని కథలు రాస్తున్నాను. కాకపోతే దానికి ఇంకా సమయం వుంది. నేను దర్శకత్వం చేస్తే సినిమాలో నేను నటిస్తాను.

**తమిళ్‌లో కొత్త ఆఫర్స్ వచ్చాయా?**
కొన్ని కథలు విన్నాను. సిగ్మా రిలీజ్ అయిన తర్వాత వాటి గురించి ఒక నిర్ణయం తీసుకుంటాను.

## 'మండాడి' టీంను అభినందించిన కమల్ హాసన్



ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్‌ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ బ్యానర్ మీద సుహాస్, సూరి ప్రధాన పాత్రల్లో మతిమారన్ పుగళేంది తెరకెక్కించిన 'మండాడి' చిత్రం బ్లాక్ బస్టర్ హిట్ అయిన సంగతి తెలిసిందే. ఎల్రెడ్ కుమార్ నిర్మించిన ఈ మూవీలో సూరి, సుహాస్, మహిమా నంబియార్, సత్యరాజ్, రవీంద్ర విజయ్, మిథున్, బాల శరవణన్ తదితరులు కీలక పాత్రలను పోషించారు. ఏపీ, తెలంగాణ లో ఈ చిత్రాన్ని మైత్రి మూవీ డిస్ట్రిబ్యూటర్స్ ఎల్ఎల్‌పి సెప్టెంబర్ 10న రిలీజ్ చేశారు. ఆల్రెడీ వంద కోట్ల క్లబ్బులో చేరిన 'మండాడి' వరల్డ్ వైడ్‌గా ఇంకా దూసుకుపోతోంది. 'మండాడి' బ్లాక్ బస్టర్ అయిన సందర్భంగా ఇప్పటికే రజినీకాంత్ టీంకి అభినందనలు తెలియజేశారు. ఇక తాజాగా లోక నాయకుడు కమల్ హాసన్ 'మండాడి' టీంని అభినందించారు. ప్రత్యేకంగా టీంని కలిసి ప్రతీ ఒక్కరితో మాట్లాడి 'మండాడి' గురించి గొప్పగా ప్రశంసించారు. దర్శక, నిర్మాతలో పాటుగా సూరి, సుహాస్, రవీంద్ర విజయ్ అందరినీ కమల్ హాసన్ ప్రత్యేకంగా కలిసి, అందరితో మాట్లాడి, బెస్ట్ విషెస్‌ను తెలియజేశారు. నా జీవితంలో మర్చిపోలేని ఓ ఘటన. ఈ రోజుని ఎప్పటికీ గుర్తుండిపోతుంది. మా 'మండాడి' టీం మీద డా. కమల్ హాసన్ సర్ కురిపించిన ప్రేమ, ఆయన ఇచ్చిన ఆశీర్వాదం, చెప్పిన మాటలు మాకు ఎంతో ప్రత్యేకం. మాకు ఈ అవకాశం కల్పించిన మహేంద్రన్ అన్నకి, డిస్నీ బ్రదర్‌కి హృదయపూర్వక ధన్యవాదాలు అని సూరి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

## 'లవ్ వార్' రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్



సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ప్రతిష్టాత్మక చిత్రం 'లవ్ వార్' కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తు న్నారు. రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ వంటి ముగ్గురు స్టార్ హీరో హీరోయిన్లు కలిసి నటిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే భారీ అంచనా లు ఉన్నాయి. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన రణ్‌బీర్ కపూర్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. ఇందులో రణ్‌బీర్ పూర్తిగా కొత్త లుక్‌లో కనిపిస్తూ ఆకట్టుకుంటున్నారు. సంజయ్ లీలా భన్సాలీ సినిమాల్లో కనిపించే గ్రాండ్ విజువల్స్, రిచ్‌నెస్ ఈ పోస్టర్‌లోనూ స్పష్టంగా కనిపిస్తున్నాయి. రణ్‌బీర్ ఇప్పటివరకు కనిపించని కొత్త అవతార్‌లో కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. పోస్టర్‌కు జత చేసిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ కూడా విజువల్స్‌కు అద్భుతంగా సరిపోయింది. సంగీతం విషయంలో భన్సాలీ మార్క్ మరోసారి కనిపించింది.ఈ పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసిన మేకర్స్ వోహ్ రుత్బా, వోహ్ రౌబ్, వోహ్ జునూన్!' అంటూ క్యాప్షన్ ఇచ్చారు. 'లవ్ వార్' చిత్రం 2027 జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. రణ్‌బీర్ కపూర్, అలియా భట్, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాను హిందీతో పాటు తెలుగు, తమిళ భాషల్లోనూ విడుదల చేయనున్నారు.

## 'మిస్ కాళికా మిస్సింగ్' పోస్ట్ ప్రొడక్షన్ పూర్తి



జె ఎస్ వి వి ఎంటర్ టైన్ మెంట్స్ మరియు ఎస్ఎస్ ఆర్ట్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మిస్తున్న చిత్రం 'మిస్ కాళికా మిస్సింగ్'. సత్య ధనేకుల దర్శకత్వంలో రామకృష్ణ, పదిమల యమున సంయుక్తంగా నిర్మించిన ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమా లన్నీ పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా నిర్మా తలు రామకృష్ణ, యమునలు మాట్లాడుతూ "మా చిత్రం పూర్తి సస్పెన్స్‌తో సాగే ఎంటర్టైన్మెంట్ చిత్రం. మునిపెన్నడు చూడని కథనం తో ఈ మూవీ చిత్రీకరణ ప్రతి ఒక్కరిని ఆకట్టుకుంటుంది. మ్యూజిక్ పరంగా ఈ చిత్రం డెఫినెట్ గా మంచి మార్కులు తెచ్చుకుంటుంది. ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుంది .ఈ చిత్రాన్ని అక్టోబర్ నెలలో ప్రేక్షకులు ముందుకు తీసుకు రావడానికి సన్నాహాలు చేస్తు న్నాము" అని అన్నారు .ఈ చిత్రంలో హీరో హీరో యిన్స్‌గా వినీత్ చంద్ర, డాలీషాతో పాటు ఎస్తేర్, అజయ్ ఘోష్, బ్రహ్మాజీ ,ఆలీ ,జ్యోతి, నాగ మహేష్, గుండు సుదర్శన్ తదితరులు నటించారు.

## 'మత్స్య' గ్లింప్స్ రిలీజ్



యంగ్ టాలెంటెడ్ హీరో వివస్వాన్ నటిస్తున్న ఫోక్ లోర్ అడ్వెంచర్ ఫిలిం 'మత్స్య'. ఈ చిత్రంతో వివస్వాన్ టాలీవుడ్ లోకి అడుగుపెడుతున్నారు. ఈ చిత్రాన్ని జి.బి.ఆర్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై సంహిత గణపతి ఇంటూరి నిర్మిస్తున్నారు. రవి గోలి, తేజ కనకాల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ రోజు 'మత్స్య' సినిమా అఫీషియల్ గ్లింప్స్ ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ టాప్ క్వాలిటీ విజువల్స్, వీఎఫ్ఎక్స్‌తో ఒక కొత్త సినిమాటిక్ వరల్డ్ ను పరిచయం చేసింది.
అమ్మా కొత్త బెడ్ టైమ్ కథ చెప్పమ్మా..! అంటూ బాబు అమ్మను అడగగా, ఒక ఫిష్ కథ చెప్పనా అంటూ అమ్మ చెప్పే డైలాగ్‌తో 'మత్స్య' గ్లింప్స్ మొదలవుతుంది. ఎన్నో వింతలు, అద్భుతాలు, ఒక ట్రావెలర్ ఉండే ఆ కథను అమ్మ చెబుతుంటే హీరో క్యారెక్టర్ ను కలర్ ఫుల్ గా పరిచయం చేశారు. గ్లింప్స్ లో వివస్వాన్ స్టైలిష్ లుక్, అప్పీయరెన్స్, బాడీ లాంగ్వేజ్ తో ఆకట్టుకుంటున్నారు. ఈ చిత్రంతో ఒక ప్రామిసింగ్ యంగ్ హీరోగా వివస్వాన్ తెలుగు ప్రేక్షకుల ముందు కు వస్తున్న ఎక్స్ పెక్టే షన్స్ ఏర్పడు తున్నాయి. గ్లింప్స్ చివరలో హీరో ఉన్న బోట్ కింద నుంచి మిథికల్ ఫిష్ వెళ్లడం ఆసక్తి కలిగిస్తోంది. "మత్స్య" చిత్రంలో ఫోక్ లోర్, అడ్వెంచర్ వంటి అంశాలను మేళవించి ప్రేక్షకులకు ఒక కొత్త ప్రపంచాన్ని చూపించ బోతు న్నట్లు గ్లింప్స్ తో తెలుస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ మేకర్స్ త్వరలో వెల్లడించనున్నారు.

## 'జార్జ్ క్రిష్' లో హీరోయిన్‌గా మానస వారణాసి



'నారీ నారీ నడుమ మురారీ', 'బైకర్' విజయాలతో జోష్‌లో ఉన్న చార్మింగ్ స్టార్ శర్వానంద్, దర్శకుడు శ్రీను వైట్లతో తొలి సారిగా చేతులు కలిపారు. వీరి కాంబినేషన్‌లో 'జార్జ్ క్రిష్' పండుగ సీజన్‌లో కంప్లీట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా అలరించ బోతోంది. ఏటీవీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని అనిల్ సుంకర ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై రామబ్రహ్మాం సుంకర నిర్మిస్తుం డగా, అజయ్ సుంకర సహ నిర్మాతగా వ్యవహరి స్తున్నారు. ఈ చిత్రం 2027 జనవరి 14న సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో ఘనంగా విడుదల కానుంది. గతంలో విడుదల చేసిన టైటిల్ అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో కలర్‌ఫుల్ ఫెస్టివ్ లుక్ ఆకట్టుకుంది. అందులో శర్వానంద్ హీరోయిన్‌ను ఎత్తుకున్న సిల్హౌట్ ఆసక్తిని పెంచింది.తాజాగా ఈ సినిమాలో మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. 'కపుల్ ఫ్రెండ్లీ'తో సూపర్ హిట్ అందుకున్న మానస వారణాసి.. 'జార్జ్ క్రిష్'లో శర్వానంద్‌కు జోడీగా కనిపించనున్నారు. టైటిల్ పోస్టర్‌ను బట్టి సినిమాలో లవ్ స్టోరీకి కీలక ప్రాధాన్యత ఉండబోతోంది. మానస పాత్ర కథలో కీలకంగా ఉండనుంది. ఫస్ట్ బూస్టర్‌ను రేపు విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఈ చిత్రానికి అటాప్ టెక్నికల్ టీమ్ పనిచేస్తోంది. కేవీ గుహన్ సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరిస్తుండగా, అనూప్ రూబెన్స్ సంగీతం అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, అమర్ రెడ్డి కుడుముల ఎడిటర్‌గా పనిచేస్తున్నారు. నందు సవిరిగాన, గోపీ మోహన్ రైటింగ్ డిపార్ట్‌మెంట్‌లో భాగం కాగా, కిషోర్ గరికిపాటి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో శరవేగంగా జరుగుతోంది.

ఆట

## టి20 వరల్డ్ ర్యాంకింగ్స్‌లో
# నం.1 ఇషాన్ కిషన్
### నంబర్2గా అభిషేక్‌శర్మ







**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ క్రికెట్ మండలి తాజాగా విడుదల చేసిన నూతన ప్లేయర్ ర్యాంకింగ్స్‌లో ప్రపంచవ్యాప్తంగా ఉన్న పలువురు ప్రముఖ క్రీడాకారులు తమ అద్భుతమైన ప్రదర్శనలతో ముందంజ వేసి అగ్రస్థానాలను కైవసం చేసుకున్నారు. ముఖ్యంగా టీ20, వన్డే ఫార్మాట్లలో బ్యాటింగ్, బౌలింగ్ అలాగే ఆల్‌రౌండర్ విభాగాల్లో హోరాహోరీ పోటీ కొనసాగుతుండగా, ఈ తాజా ర్యాంకింగ్స్ ఆశ్చర్యపరచాయి. టీ20 ఐసీసీ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున ఇషాన్ కిషన్ 904 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, అభిషేక్ శర్మ 893 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. అలాగే పాకిస్థాన్‌కు చెందిన సాహిబ్జాదా ఫర్హాన్ మూడో స్థానంలో నిలిచాడు. ఇక టీ20 బౌలింగ్ విభాగంలో పాకిస్థాన్ ఆటగాడు అబ్రార్ అహ్మద్ 736 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానానికి చేరుకోగా, రషీద్ ఖాన్ రెండో స్థానానికి పడిపోయాడు. ఆస్ట్రేలియా స్పిన్నర్ జంపా మూడో స్థానంలో ఉన్నాడు. భారత బౌలర్లలో వరుణ్ చక్రవర్తి ఏడో స్థానంలో, జస్ప్రీత్ బుమ్రా పదో స్థానంలో నిలిచారు. ఇక ఆల్ రౌండర్ల విభాగంలో జింబాబ్వే ఆటగాడు సికందర్ రజా 321 రేటింగ్ పాయింట్లతో మొదటి స్థానంలో కొనసాగుతుండగా, పాకిస్థాన్‌కు చెందిన సాయిమ్ అయూబ్ రెండో స్థానంలో, ఇంగ్లాండ్ ఆటగాడు విల్ జాక్స్ మూడో స్థానంలో ఉన్నారు. భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఏడో స్థానంలో కొనసాగుతున్నారు. అలాగే వన్డే ఆల్‌రౌండర్ల విభాగంలో అఫ్గానిస్థాన్ ఆటగాడు అజ్మతుల్లా ఒమర్జాయ్ 337 రేటింగ్ పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, సికందర్ రజా రెండో స్థానంలో, బంగ్లాదేశ్ ఆటగాడు మెహిదీ హసన్ మిరాజ్ మూడో స్థానంలో నిలిచారు. భారత స్టార్ ఆటగాడు అక్షర్ పటేల్ తొమ్మిదో స్థానంలో కొనసాగుతున్నారు. ఈ తాజా ప్రదర్శనలు ఆటగాళ్ల మధ్య పోటీని మరింత ఆసక్తికరంగా మార్చాయి.

### ఆస్ట్రేలియాతో అనధికారిక టెస్ట్..
# విజయం దిశగా భారత్

**పుదుచ్చేరి:** ఆస్ట్రేలియాతో జరుగుతున్న తొలి అనధికారిక టెస్టులో భారత్ పట్టు బిగించింది. పుదుచ్చేరి వేదికగా గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో 363 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఆస్ట్రేలియాకు భారత్ బౌలర్లు షాకిచ్చారు. స్పిన్నర్ తనుష్ కొటియన్, పేసర్ తుషార్ దేశ్‌పాండేలు ఆసిస్ ఓపెనర్లు సామ్ కాన్‌స్టాస్ (20), క్యాంప్‌బెల్ కెల్లవే (0)లను పెవిలియన్‌కు పంపారు. దీంతో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఆస్ట్రేలియా తమ రెండో ఇన్నింగ్స్‌లో రెండు వికెట్ల నష్టానికి 55 పరుగులు చేసింది. ప్రస్తుతం క్రీజులో నాథన్ మెక్‌స్వీనీ (23), పీటర్ హ్యాండ్స్‌కోంబ్ (0) ఉన్నారు. ఈ మ్యాచ్‌లో భారత్ గెలవాలంటే మిగిలిన 8 వికెట్లు పడగొట్టాల్సి ఉంది. అంతకు ముందు భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 199 పరుగులకు ఆలౌట్ అయింది. ఓపెనర్ సాయి సుదర్శన్ 39 పరుగులతో, వన్‌డౌన్ బ్యాటర్, కెప్టెన్ దేవదత్ పడిక్కల్ అర్ధ శతకంతో ( 88 బంతుల్లో 59 పరుగులు) రాణించారు. అయతే తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం లభించడంతో వడిక్కల్ సేన ప్రత్యర్థి ముందు భారీగా లక్ష్యాన్ని ఉంచగలిగింది. ఈ మ్యాచ్‌లో తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 334 పరుగులు చేయగా, దానికి సమాధానంగా పర్యాటక జట్టు తమ తొలి ఇన్నింగ్స్‌లో 19 పరుగులకే కుప్పకూలింది.




# కబడ్డీలో అజేయ భారత్
### చైనీస్ తైపీ 37-21తో ఓటమి

**ఐచినగోయా:** ఆసియా క్రీడల పురుషుల కబడ్డీలో భారత్ వరుస విజయాలతో దూసుకుపోతోంది. టోకాయ్ జిమ్నాసియంలో గురువారం జరిగిన గ్రూప్ ఎ చివరి మ్యాచ్‌లో చైనీస్ తైపీని 37-21 తేడాతో ఓడించి, పురుషుల కబడ్డీ పోటీలలో భారత్ తన అజేయ పరంపరను కొనసాగించింది. భారత్ దూకుడుగా ఆటను ప్రారంభించగా, అస్లాం ఇనామ్‌దార్, రాహుల్ సేథ్‌పాల్ సమర్థవంతంగా కలిసికట్టుగా చైనీస్ తైపీ రైడర్లపై ఒత్తిడి తెచ్చారు. సేథ్‌పాల్ యొక్క యాంకిల్ హోల్డ్స్ ప్రత్యేకంగా ఉపయోగపడటంతో, భారత్ త్వరగా పట్టు సాధించి, తొలి దశలోనే ఆల్‌అవుట్ చేసింది. చైనీస్ తైపీ సూపర్ టాకిల్స్‌తో పోరాడి పోటీలో నిలిచింది, కానీ భారత్ రైడింగ్, డిఫెన్స్ రెండింటి ద్వారా పాయింట్లను జోడిస్తూనే ఉంది. రెండవ ఆల్‌అవుట్ భారత్ ఆధిక్యాన్ని మరింత పెంచింది, దీంతో అర్ధభాగం ముగిసేసరికి ఆ జట్టు 23-11తో ఆధిక్యంలో నిలిచింది. తర్వాత చైనీస్ తైపీ బోనస్ పాయింట్ల ద్వారా అంతరాన్ని తగ్గించుకోవడానికి ప్రయత్నించగా, దేవాంక్ దలాల్, అయన్ లోచ్‌చాబ్ భారత దాడిని కొనసాగించారు. భారత్ మరో ఆల్‌అవుట్ సాధించి, మ్యాచ్‌పై తమ పట్టును మరింత బలపరుచుకుంది. చివరి దశలలో భారత రక్షణ విభాగం క్రమశిక్షణతో వ్యవహరించి, రైడర్లు పాయింట్లు సాధిస్తూనే ఉన్నప్పటికీ చైనీస్ తైపీకి స్కోరింగ్ అవకాశాలను పరిమితం చేసింది. భారత్ మూడు బోనస్ పాయింట్లు, ఆరు ఆల్‌అవుట్ పాయింట్లతో ముగించగా, చైనీస్ తైపీ తొమ్మిది బోనస్ పాయింట్లు, రెండు సూపర్ టాకిల్స్‌ను నమోదు చేసింది.

### జిమ్నాస్టిక్స్ వాల్ట్ ఫైనల్‌లో
# నం.6లో ప్రణతి

**నాగోయా:** ఐచినాగోయా ఆసియా క్రీడల్లో గురువారం జరిగిన మహిళల వాల్ట్ ఫైనల్‌లో భారత జిమ్నాస్ట్ ప్రణతి నాయక్ ఆరో స్థానంలో నిలిచారు. 2023 హాంగ్‌జౌ ఎడిషన్‌లో ఆమె సాధించిన ఎనిమిదో స్థానంతో పోలిస్తే ఇది రెండు స్థానాలు మెరుగుపడింది. ఆసియా క్రీడలలో పోటీ పడుతున్న ఏకైక భారతీయ జిమ్నాస్ట్ అయిన 31 ఏళ్ల టోక్యో ఒలింపియన్, నగోయా సిటీ జనరల్ జిమ్నాసియంలోని



రెయిన్‌బో హాల్‌లో 13.100 మొత్తం స్కోరును నమోదు చేసింది. ప్రణతి తన రెండు వాల్ట్‌లలోనూ 12.900 సమానమైన స్కోరును సాధించింది. ఆమె మొత్తం స్కోరుకు 0.20 బోనస్ జోడించడానికి ముందు, ప్రతి ప్రయత్నానికి 4.4 క్లిష్టత స్కోరు మరియు 8.500 అమలు మార్కును పొందింది. అంతకుముందు క్వాలిఫికేషన్ రౌండ్‌లో 12.916 స్కోరుతో ఏడో స్థానంలో నిలిచిన ప్రణతి ఎనిమిది మంది జిమ్నాస్ట్‌లతో కూడిన ఫైనల్‌లో తన స్థానాన్ని ఖాయం చేసుకుంది. మెడల్ రౌండ్‌కు అర్హత సాధించేందుకు ఆమె తన మొదటి వాల్ట్‌లో 13.000, రెండవ వాల్ట్‌లో 12.433 స్కోరు సాధించింది.

## ఆసియా క్రీడలు:



# స్కిట్‌లో అనంత్‌జీత్, ధాలివాల్‌కు పతకం

**నగోయా:** 2026 ఆసియా క్రీడల్లో స్కీట్ మిక్స్‌డ్ టీమ్ ఈవెంట్‌లో భారత క్రీడాకారులు అనంత్‌జీత్ సింగ్ నరుకా–పరినాజ్ ధాలివాల్ ద్వయం కాంస్య పతకాన్ని కైవసం చేసుకుంది. ఐచినగోయాలో గురువారం జరిగిన ఈ క్రీడల్లో భారత జంట 48 షాట్లకు 44 హిట్లు సాధించి, దక్షిణ కొరియా స్కోరును సమం చేసింది. అయితే, క్వాలిఫైయింగ్ స్కోరు 143, భారత్ 138 కంటే ఎక్కువగా ఉండటంతో టైబ్రేకర్ ద్వారా కొరియా రజతాన్ని కైవసం చేసుకుంది. తొలి ఎనిమిది షాట్లలో ఏడు హిట్లు కొట్టి భారత్ పటిష్టంగా ప్రారంభించింది. నరుకా నాలుగు హిట్లతో నిలవగా, ధాలివాల్ ఒక హిట్‌ను మిస్ అయింది, చైనా, కొరియా రెండూ ఎనిమిది హిట్లతో తమ ఇన్నింగ్స్‌ను ప్రారంభించాయి. 16 షాట్‌ల తర్వాత, 14 హిట్‌లతో భారత్, దక్షిణ కొరియాతో సమంగా నిలిచింది. మూడో సిరీస్ తర్వాత, భారత్ 21 హిట్‌లతో ఖతార్ కంటే మూడు పాయింట్లు ముందుండగా, చైనా, కొరియాలు వరుసగా 23, 22 హిట్‌లు సాధించాయి. 32 షాట్ల తర్వాత చైనా, కొరియా 30 పాయింట్లతో సమంగా నిలవగా, భారత్ 29 పాయింట్లతో ఒక హిట్ వెనుకబడింది. జాంగ్ కూ నాలుగు టార్గెట్‌లను కొట్టడంతో కొరియా కూడా 44 పాయింట్లతో ముగించింది. ఫైనల్ సిరీస్‌లో చైనా ఐదు హిట్స్ జోడించి 45 పాయింట్లతో ముగించింది. టై అవ్వడంతో మెరుగైన క్వాలిఫైయింగ్ స్కోరు కారణంగా కొరియా రజతం, భారత్ కాంస్యం కైవసం చేసుకుంది.



# మహిళల 'వుషు'లో రోషిబినాకు రజతం

**నగోయా, జపాన్:** మహిళల వుషులో భారత్ క్రీడాకారిణి రోషిబినా దేవి రజత పతకాన్ని సాధించింది. గురువారం జరిగిన ఫైనల్‌లో చైనాకు చెందిన జాంగ్ జియావోయు చేతిలో 0-2 తేడాతో ఓడిపోయిన రోషిబినా నవోరెమ్, ఆసియా గేమ్స్ 2026 మహిళల 60 కేజీల సాండా ఈవెంట్‌లో రజతాన్ని కైవసం చేసుకుంది. రోషిబినా తన ప్రచారాన్ని మకావుకు చెందిన చూ మాన్ సిన్‌పై క్వార్టర్ ఫైనల్‌లో 5-0 తేడాతో విజయంతో ప్రారంభించి, ఆ తర్వాత సెమీఫైనల్‌లో ఇండోనేషియాకు చెందిన థానియా కుసుమానింగ్‌త్యాస్‌ను 2-0 తేడాతో ఓడించి స్వర్ణ పతక పోరులో తన స్థానాన్ని సురక్షితం చేసుకుంది. అయితే, జాంగ్ ఫైనల్‌లోని రెండు రౌండ్లలోనూ 5-0 తేడాతో గెలిచి స్వర్ణాన్ని కైవసం చేసుకుంది. దీంతో రెండో స్థానంలో ఉన్న రోషిబినాకు రజతం లభించింది. ఆమె సాధించిన రజత పతకంతో ఐచినగోయా క్రీడల్లో భారతదేశపు పతకాల సంఖ్య 14కు చేరింది. ఇందులో ఒక స్వర్ణం, ఆరు రజతాలు, ఏడు కాంస్యాలు ఉన్నాయి. ఆసియా క్రీడల్లో వుషులో భారతదేశానికి ఇది 11వ పతకం, ఇందులో ఒక స్వర్ణం, రెండు రజతాలు, ఎనిమిది కాంస్యాలు ఉన్నాయి. మణిపూర్‌లోని బిష్ణుపూర్ జిల్లాలోని క్వాసిఫైకి చెందిన రోషిబినా ఒక వ్యవసాయ కుటుంబం నుండి వచ్చింది. ఆమె ఇంఫాల్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా యొక్క విదివీనిలో కోచ్ మైబమ్ ప్రేమ్‌కుమార్ సింగ్ ఆధ్వర్యంలో మహిళల 60 కేజీల సాండా విభాగంలో శిక్షణ పొందుతోంది.

# ఎన్‌ఎస్‌ఇ షేర్లకు భారీ జోరు
### దేశంలో 10వ అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా అవతరణ




**ముంబై, సెప్టెంబరు 24:** నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా షేర్లు స్టాక్ మార్కెట్లో లిస్టింగ్ అయిన కొద్దిసేపటికే భారీగా పుంజుకున్నాయి. దీంతో ఎన్‌ఎస్‌ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.5 లక్షల కోట్లను దాటి, దేశంలో 10వ అత్యంత విలువైన లిస్టెడ్ కంపెనీగా నిలిచింది. గురువారం దలాల్ స్ట్రీట్‌లో ఎన్‌ఎస్‌ఇ షేర్లు స్వల్ప ప్రీమియంతో లిస్టయ్యాయి. బిఎస్‌ఇలో ఒక్కో షేర్ రూ.1,800 వద్ద లిస్టింగ్ కాగా, ఇది ఇష్యూ ధర రూ.1,785తో పోలిస్తే 0.84 శాతం ప్రీమియం. లిస్టింగ్ సమయంలో కంపెనీ మార్కెట్ విలువ సుమారు రూ.4.45 లక్షల కోట్లుగా ఉంది. అయితే లిస్టింగ్ అనంతరం ఎన్‌ఎస్‌ఇ షేర్లలో కొనుగోళ్ల జోరు పెరిగింది. షేర్ ధర 5 శాతానికి పైగా పెరిగి రూ.1,878 గరిష్ఠ స్థాయిని తాకింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.56 లక్షల కోట్లను దాటింది. ఈ పెరుగుదలతో ఎన్‌ఎస్‌ఇ మార్కెట్ విలువ పరంగా హిందుస్థాన్ యూనిలీవర్, సన్ ఫార్మాస్యూటికల్ ఇండస్ట్రీస్, టైటాన్ కంపెనీ వంటి ప్రముఖ సంస్థలను అధిగమించింది. బిఎస్‌ఇ మార్కెట్ క్యాపిటలైజేషన్ ప్రస్తుతం సుమారు రూ.1.31 లక్షల కోట్లుగా ఉంది. దీంతో రెండు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల మధ్య మార్కెట్ విలువలో గణనీయమైన వ్యత్యాసం కనిపిస్తోంది. ఎన్‌ఎస్‌ఇ ఐపిఒ ఈనెల 17 నుంచి 21 వరకు సబ్‌స్క్రిప్షన్‌కు అందుబాటులో ఉంది. మొత్తం ఇష్యూ 5.71 రెట్లు సబ్‌స్క్రైబ్ అయింది. రూ.22,568.94 కోట్ల ఇష్యూ పరిమాణానికిగాను రూ.90,287.33 కోట్ల విలువైన బిడ్లు వచ్చాయి. 2024లో హ్యుందాయ్ మోటార్ ఇండియా తీసుకొచ్చిన రూ.27,870 కోట్ల ఐపిఒ తర్వాత, భారతదేశంలో ఇది రెండో అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా నిలిచింది. 2022లోవచ్చిన ఎల్‌ఐసి రూ.21,000 కోట్ల ఐపిఒ మూడో అతిపెద్ద ఇష్యూగా ఉంది.

అయితే హ్యుందాయ్ మోటార్ ఇండియా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా షేర్లు లిస్టింగ్ సమయంలో డిస్కౌంట్‌తో ప్రారంభం కాగా, ఎన్‌ఎస్‌ఈ షేర్లు మాత్రం దాదాపు 1 శాతం ప్రీమియంతో లిస్టయ్యాయి. మరోవైపు, ఎన్‌ఎస్‌ఇ షేర్లలో ఈ ర్యాలీ కొనసాగుతున్న సమయంలోనే దేశీయ స్టాక్‌మార్కెట్‌లో భారీ పతనం నమోదైంది. గురువారం బెంచ్‌మార్క్ సూచీలు రెండూ సుమారు 1.6శాతం చొప్పున పడిపో యాయి. బీఎస్‌ఈ సెన్సెక్స్ 1,100 పాయింట్లకు పైగా పతనం కాగా, ఎన్‌ఎస్‌ఇ నిఫ్టీ 50 సూచీ 23,100 స్థాయి దిగువకు జారింది. మార్కెట్ మొత్తం ఒత్తిడిలో ఉన్నప్పటికీ, ఎన్‌ఎస్‌ఇ షేర్లు మాత్రం లిస్టింగ్ అనంతరం కొనుగోళ్ల మద్దతుతో గణనీయంగా లాభపడ్డాయి.

## బీమా సంస్థల నిర్వహణ వ్యయాలపై ఐఆర్‌డిఎఐ నజర్




**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** బీమా రంగంలో పంపిణీ వ్యవస్థలో సంస్కరణలకు సంబంధించి భారత బీమా నియంత్రణ, అభివృద్ధి ప్రాధికార సంస్థ ఐఆర్‌డిఎఐ కీలక ప్రతిపాదనలు చేసింది. బీమా సంస్థల స్థాయిలో నిర్వహణ వ్యయాలు విధించే పరిమితులను దశలవారీగా తగ్గించేందుకు ఐదేళ్ల ప్రణాళికను ప్రతిపాదించింది. ప్రతిపాదిత విధానం ప్రకారం, సాధారణ బీమా సంస్థలకు ప్రస్తుతం ఉన్న స్థూల ప్రత్యక్ష ప్రీమియం ఆదాయంలో 30 శాతంగా ఉన్న ఈవోఎం పరిమితిని 20 శాతానికి తగ్గించే అవకాశం ఉంది. జీవిత బీమా సంస్థల విషయంలో ఈవోఎం పరిమితిని ఎంజిడిపిఐలో 12.5 శాతానికి తీసుకురావాలని ఐఆర్‌డిఎఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న ఉత్పత్తిస్థాయి పరిమితులకు బదులుగా ఈ సంస్థ స్థాయి పరిమితిని తీసుకురావాలని సూచించింది. అదే సమయంలో ఈవోఎంను లెక్కించే విధానంలోనూ మార్పులు చేయాలని నియంత్రణ సంస్థ ప్రతిపాదించింది. అలాగే తప్పనిసరి వ్యయ ఆడిట్లు, ప్రజలకు వెల్లడించాల్సిన వివరాలు వంటి నిబంధనలను ప్రవేశపెట్టాలని పేర్కొంది. బీమా సంస్థలు నిర్దేశిత పరిమితులను ఇతర మార్గాల ద్వారా తప్పించుకోకుండా చూడటంతో పాటు, వ్యయాల్లో మరింత పారదర్శకత తీసుకురావడం ఈ చర్యల ప్రధాన ఉద్దేశంగాఉంది. డిస్ట్రిబ్యూటర్లకు చెల్లించే కమిషన్లు, రివార్డులపై స్పష్టమైన పరిమితులు విధించే ప్రతిపాదననుకూడా చేసింది. ఈ విధానంలో డిస్ట్రిబ్యూటర్లకు చెల్లించే పారితోషికం పలుఅంశాల ఆధారంగా నిర్ణయించబడుతుంది. ఉత్పత్తి సంక్లిష్టత, దానిని విక్రయించేందుకు అవసరమైనకృషి, పంపిణీవ్యవస్థ,సంబంధిత ఉత్పత్తిలేదా వ్యాపారవిభాగం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించింది. డిస్ట్రిబ్యూటర్లకుచేసే అన్ని రకాల చెల్లింపులను సంబంధితపరిమితిని నిర్ణయిం చేటప్పుడు లెక్కలోకి తీసుకోవాలని ప్రతిపాదించింది.

# స్టాక్ మార్కెట్లలో భారీ పతనం
## 1,200 పాయింట్లు కోల్పోయిన సెన్సెక్స్




**ముంబయి, సెప్టెంబరు 24:** భారత స్టాక్ మార్కెట్లు గురువారం భారీ నష్టాలను చవిచూ శాయి. ప్రధాన సూచీలు 1.5 శాతానికి పైగా పడిపోగా, సెన్సెక్స్ ఏకంగా 1,200 పాయింట్లకు పైగా నష్టపోయింది. ఇన్వెస్టర్ల సంపద సుమారు ఐదు లక్షలకోట్లకుపైగా ఆవిరి అయింది. సెన్సెక్స్ 1,247.17పాయింట్లు క్షీణించి 73,580.54 వద్ద కొనసాగింది. నిఫ్టీ 383.70 పాయింట్లు నష్టంతో 23,063.10 వద్ద ఉంది. దాదాపు అన్ని ప్రధాన రంగాల సూచీలు నష్టాల్లో కొనసాగాయి. నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ 1.53శాతం, నిఫ్టీ మిడ్ క్యాప్ 100 సూచీ 2.08 శాతం పడిపోయాయి. గురువారం ముడిచమురు ధరలు దాదాపు 3 శాతం పెరిగి మరోసారి బ్యారెల్‌కు 106 డాలర్ల స్థాయిని తాకాయి. అధిక చమురు ధరలు భారత్‌కు ప్రతి కూలంగా మారే అవకాశం ఉంది. దీనివల్ల దిగుమతి బిల్లు పెరగడంతో పాటు ద్రవ్యోల్బణ భయాలు తీవ్రమవుతాయి. అదే సమయంలో కంపెనీల లాభదాయకతపై కూడా ఒత్తిడి పెరిగే అవకాశం ఉంది. అమెరికాలో సెప్టెంబర్‌లో వ్యాపార కార్యకలాపాలు ఐదేళ్లకు పైగా కాలంలో అత్యంత వేగంగా వృద్ధి చెందినట్లు గణాంకాలు వెల్లడిం చాయి. కొత్త ఆర్డర్లలో భారీ పెరుగుదల ఇందుకు ప్రధాన కారణంగా నిలిచింది. ఈ గణాంకాల ప్రభావంతో అమెరికా 10 యేళ్ల ట్రెజరీ బాండ్ ఈల్డ్ 2007 తర్వాత అత్యధిక స్థాయికి చేరింది. మరోసారి వడ్డీ రేట్ల పెంపు జరిగే అవకాశాలపై మార్కెట్లలో అంచనాలు పెరిగాయి. దీనితో పెట్టుబడిదారుల్లో రిస్క్ తగ్గించే ధోరణి కనిపించింది. బ్యాంకులు, బీమా సంస్థల షేర్లు మార్కెట్ పతనానికి ప్రధానంగా కారణమయ్యాయి. పాలసీ కమీషన్ల చెల్లింపులపై పరిమితులు విధించడంతో పాటు, ఉత్పత్తి సంక్లిష్టతకు అనుగుణంగా కమీషన్లను నిర్ణయించడం, లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీల కమీషన్లను పాలసీ మొదటి సంవత్సరానికే పరిమితం కాకుండా విస్తరించేలా నిబంధనల్లో మార్పులు చేయాలని ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆఫ్ ఇండియా ప్రతిపాదించింది. మధ్యాహ్నం ట్రేడింగ్‌లో బ్యాంకింగ్, ఫైనాన్షియల్ షేర్లు 2 శాతం వరకు నష్టపోయాయి. యాక్సిస్ బ్యాంక్ షేరు 3.5 శాతం, హెచ్‌డిఎఫ్‌సిబ్యాంక్ షేరు 1.3 శాతం చొప్పున పడిపోయాయి. అమెరికా డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి బలహీనంగా కొనసాగింది. గురువారం రూపాయి 11 పైసలు క్షీణించి డాలర్‌కు రూ.95.84 వద్దకు చేరింది. భౌగోళిక రాజకీయ అనిశ్చితుల కారణంగా ముడిచమురు ధరలు భారీగా పెరగడం, అమెరికా బాండ్ ఈల్డ్స్‌తో పాటు డాలర్ విలువ పెరగడం రూపాయిపై ఒత్తిడిని పెంచాయి. బంగారం ధరలు కూడా భారీగా పడిపోయాయి. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ఔన్సుకు 4,300 డాలర్ల దిగువన కొనసాగుతూ 4,288 డాలర్ల వద్ద ఉంది. అమెరికా ట్రెజరీ ఈల్డ్స్‌కారణంగా బంగారం ధర లపై రెండు వైపులా ఒత్తిడి పెరిగింది. దేశీయంగా ఎంసీఎక్స్‌లో బంగారం 10 గ్రాములకు రూ.1,50, 900 స్థాయికి పడిపోయింది. మార్కెట్లు మొత్తం నష్టాల్లో ఉన్నప్పటికీ, నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ ఇండియా షేర్లు ట్రేడింగ్ ప్రారంభించిన రోజే 5.21 శాతం వరకు లాభపడ్డాయి. ఎన్‌ఎస్‌ఇ షేరు ఇష్యూ ధర రూ.1,785తో పోలిస్తే 0.84 శాతం పెరిగి రూ.1,800 వద్ద ట్రేడింగ్ ప్రారంభించింది. అనంతరం రూ.1,878కు చేరి ఇష్యూ ధరతో పోలిస్తే 5.21 శాతం లాభాన్ని నమోదు చేసింది. అమెరికా 10 యేళ్ల ట్రెజరీ ఈల్డ్ సుమారు 5.11 శాతానికి పెరగడం, ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 100 డాలర్లకు పైగా కొనసాగడం, భౌగోళిక రాజకీయ అనిశ్చితి ఇవన్నీ ద్రవ్యోల్బణం, రుణ వ్యయాలు, ప్రపంచవ్యాప్తంగా వడ్డీ రేట్ల తగ్గింపు వేగంపై ఆందోళనలను పెంచుతున్నాయని ఆయన పేర్కొన్నారు. దీంతో ముఖ్యంగా వడ్డీ రేట్లకు సున్నితమైన రంగాల్లో పెట్టుబడిదారులు రిస్క్‌ను తగ్గిస్తున్నారు. ముడిచమురు ధరలు, ప్రపంచ బాండ్ ఈల్డ్స్‌పై మరింత స్పష్టత వచ్చే వరకు మార్కెట్లలో అస్థిరత అధికంగా కొనసాగే అవకాశం ఉంది.

## టెక్ స్టార్టప్‌లకు 9 నెలల్లో 10.3 బిలియన్ డాలర్ల నిధులు

**న్యూఢిల్లీ, సెప్టెంబరు 24:** భారత టెక్ స్టార్టప్‌లకు ఈ యేడాది తొమ్మిది నెలల్లో మొత్తం 10.3 బిలియన్ డాలర్ల నిధులు సమీకరించాయి. గత యేడాది ఇదే కాలంలో సమీకరించిన 9.7 బిలియన్ డాలర్లతో పోలిస్తే ఇది 7 శాతం పెరుగుదల. మార్కెట్ ఇంటెలిజెన్స్ ప్లాట్‌ఫామ్ ట్రాక్స్‌న్ డేటా ప్రకారం, ఎంటర్‌ప్రైజ్ అప్లికేషన్స్, ఫిన్‌టెక్, ఎంటర్‌ప్రైజ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రంగాలు అత్యధిక పెట్టుబడులను ఆకర్షించాయి. మొత్తం పెట్టుబడులు పెరిగినప్పటికీ, ఫండింగ్ రౌండ్లు, తొలిసారి పెట్టుబడులు పొందిన కంపెనీలు, కొత్తగా యూనికార్న్ స్థాయికి చేరిన సంస్థల సంఖ్యలో గణనీయమైన తగ్గుదల నమోదైంది. 2026 తొలి తొమ్మిది నెలల్లో మొత్తం 1,134 ఫండింగ్ రౌండ్లు జరిగాయి. గత యేడాది ఇదే కాలంలో నమోదైన 1,838 రౌండ్లతో పోలిస్తే ఇది 38 శాతం తక్కువ. పెట్టుబడులు ప్రధానంగా పెద్ద డీల్స్ చుట్టూ కేంద్రీకృతమయ్యాయి. ఈ కాలంలో 100 మిలియన్ లేదా అంతకంటే ఎక్కువ విలువైన 18 ఫండింగ్ రౌండ్లు జరిగాయి. తొమ్మిది నెలల్లో భారత్‌లో ఆరు కొత్త యూనికార్న్ కంపెనీలు ఏర్పడ్డాయి. గత యేడాది ఇదే కాలంలో నాలుగు యూనికార్న్లు మాత్రమే ఏర్పడగా, ఈసారి వాటి సంఖ్య 50 శాతం పెరిగింది. యూనికార్న్ స్థాయికి చేరుకునే ముందు ఈ కంపెనీలు సగటున 101 మిలియన్‌డాలర్ల నిధులు సమీకరించాయి. 2025 తొలి తొమ్మిది నెలల్లో ఈ సగటు 205 మిలియన్లుగా ఉండేది. అంటే యూనికార్న్ స్థాయికి చేరేందుకు అవసరమైన ముందస్తు నిధుల పరిమాణం గణనీయంగా తగ్గింది. స్టార్టప్‌ల ఎగ్జిట్ మార్కెట్‌లో కూడా పలు మార్పులు కనిపించాయి. 2026లో ఇప్పటివరకు 29 ఐపీఓలు జరిగాయి. గత ఏడాదితో పోలిస్తే ఈ సంఖ్యలో ఎలాంటి మార్పు లేదు. అయితే కంపెనీల కొనుగోళ్లు 31 శాతం తగ్గి 91కు చేరాయి. గత ఏడాది ఇదే కాలంలో 131 కొనుగోళ్లు జరిగాయి. అదే సమయంలో కంపెనీలు తమ ప్రారంభ దశల నుంచి ఐపిఒ లేదా కొనుగోలు దశకు చేరుకునే సమయం గణనీయంగా తగ్గింది. భారత టెక్ స్టార్టప్‌లకు పెట్టుబడులు సమీకరించే ప్రధాన కేంద్రంగా బెంగళూరు తన ఆధిపత్యాన్ని కొనసాగించింది. తొమ్మిది నెలల్లో బెంగళూరుకు 4.4 బిలియన్ టెక్ పెట్టుబడులు వచ్చాయి. ఇది దేశవ్యాప్తంగా వచ్చిన మొత్తం టెక్ పెట్టుబడుల్లో 43 శాతం. గత యేడాది ఇదే కాలంలో బెంగళూరు వాటా 38 శాతంగా ఉంది. ముంబై 1.8 బిలి యన్ల పెట్టుబడులతో 18 శాతం వాటాను సాధిం చింది. గురుగ్రామ్ 1.6 బిలియన్ల పెట్టుబడులతో మూడో స్థానంలో నిలిచింది. గురుగ్రామ్ వాటా గత ఏడాది 8 శాతం ఉండగా, ఈసారి 16 శాతానికి రెట్టింపు అయింది.


SBI
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
సెంట్రల్ రిక్రూట్‌మెంట్ & ప్రమోషన్ డిపార్ట్‌మెంట్
కార్పొరేట్ సెంటర్, ముంబై
ఫోన్: 022-22820427

అప్లై చేయడానికి QRని స్కాన్ చేయండి

**కాంట్రాక్ట్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్‌ల నియామకం**

కాంట్రాక్ట్ ప్రాతిపదికన క్రింద పోస్టుల కోసం అర్హులైన భారతీయ పౌరుల నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి.

| క్రమ సంఖ్య | పదవి పేరు | ఖాళీలు | గరిష్ట వయస్సు (సంవత్సరాలలో) (31.08.2026 నాటికి) |
|---|---|---|---|
| ప్రకటన నం. CRPD/SCO/2026-27/20 (కాంట్రాక్ట్ పొజిషన్) | | | |
| 1 | డీన్, ఎస్‌బిఐఎల్ కోల్‌కతా | 01 | 55 |
| 2 | ఫ్యాకల్టీ, ఎస్‌బిఐఎల్ కోల్‌కతా | 01 | 55 |
| 3 | మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్, ఎస్‌బిఐఎల్ కోల్‌కతా | 01 | 40 |
| ప్రకటన నం. CRPD/SCO/2026-27/22 (కాంట్రాక్ట్ పొజిషన్) | | | |
| 1 | డిప్యూటీ వైస్ ప్రెసిడెంట్ (ఐటి రిస్క్) | 02 | 45 |
| 2 | అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ (ఐటి రిస్క్) | 02 | 42 |

అర్హతా ప్రమాణాలు (వయస్సు, అనుభవం, ఉద్యోగ ప్రొఫైల్ మొదలైనవి), చెల్లించవలసిన ఫీజు మరియు ఇతర వివరాల కోసం బ్యాంక్ వెబ్‌సైట్ https://sbi.bank.in/web/careers/current-openings లో లాగ్‌ఆన్ అయ్యి, ఆన్‌లైన్‌లో దరఖాస్తును నింపి ఆన్‌లైన్ ఫీజు లింక్ ద్వారా దరఖాస్తు ఫీజును చెల్లించండి. దరఖాస్తు మరియు ఫీజు చెల్లింపు వివరాలతో పాటు అర్హతలను నిర్ధారించు కొనుటకు మరియు పూర్తి వివరాల కొరకు ప్రకటనను చూడండి. ఏవైనా సందేహాలు ఉన్నచో, దయచేసి మాకు - "CONTACT US" —> "Post Your Query" లింకు ద్వారా వ్రాసి పంపండి. ఈ లింకు మీకు బ్యాంకు వెబ్ సైట్ (https://sbi.bank.in/web/careers/post-your-query) లో లభించును.

- ఆన్ లైన్ లో దరఖాస్తు చేయుటకు మరియు ఫీజు చెల్లింపు తేదీ : 16.09.2026 నుండి 06.10.2026 వరకు.

స్థలం: ముంబై
తేదీ: 16.09.2026
మహానిర్వహణాధికారి (ఆర్‌పి & పీఎం)


Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.